సంపుటి : 78 సంచిక : 44 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ శ్రావణ శుద్ధ పంచమి
17-23 ఆగస్ట్ 2026
వెల : ₹20/-



## నవతరమే.. నా విశ్వాసం!




## విరాళాల దిక్సూచి ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

@Jagriti Tv 78 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక www.jagritiweekly.com



# ఆవిష్కరణకు సిద్ధమైన 123 అడుగుల కార్తికేయ విగ్రహం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో ఆధ్యాత్మిక పర్యాటకానికి భారీ ఊతమిచ్చేలా ఒక మహత్తర ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. అమరావతి సమీపంలో 123 అడుగుల ఎత్తైన సుబ్రమణ్య స్వామి (మురుగన్/కార్తికేయ) దివ్య విగ్రహాన్ని అత్యంత వైభవంగా నిర్మించారు.

ఈ విగ్రహ నిర్మాణంలో శిల్పులు అత్యంత నైపుణ్యాన్ని ప్రదర్శించారు. స్వామివారి చేతిలో 'వేల్' (శూలం), శోభాయమానమైన అభయ హస్తం, ఆభరణాలు, దివ్యమైన ముఖకవళికలను తంజావూరు, తమిళనాడు సంప్రదాయ శిల్పకళా రీతులకు అనుగుణంగా తీర్చిదిద్దారు.

అమరావతికి అతి సమీపంలో, ప్రధాన జాతీయ రహదారులు, రాజధాని రహదారులకు అనుసంధానంగా ఉండటం వల్ల విజయవాడ, గుంటూరు, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు రవాణా సౌకర్యాలు ఎంతో సులభంగా ఉండనున్నాయి. ఈ ఆధ్యాత్మిక క్షేత్రం రాకతో చుట్టుపక్కల ప్రాంతాల్లో పర్యాటకరంగం అభివృద్ధి చెందడమే కాకుండా, స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరగనున్నాయి.

రాజధాని అమరావతికి ఒకవైపు అమరారామ అమరేశ్వర స్వామి ఆలయం, మంగళగిరి పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయం శ్రీరామరక్షగా నిలవగా, ఇప్పుడు ఈ 123 అడుగుల కార్తికేయ విగ్రహం సరికొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించిపెట్టింది. త్వరలోనే ఈ విగ్రహ మహా సంప్రోక్షణ, ఆవిష్కరణ మహోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.



## భారతీయ సాహితీ ద్రష్ట
## భండారు సదాశివరావుగారి స్మారక
# కథల పోటీ-2026

జాగృతి వారపత్రిక దీపావళి సందర్భంగా ప్రఖ్యాత సాహితీవేత్త స్వర్గీయ భండారు సదాశివరావు గారి స్మారక 'కథల పోటీ' నిర్వహిస్తున్నది. రచయితలకు ఆహ్వానం..



**ప్రథమ బహుమతి : రూ. 12000/-**
**ద్వితీయ బహుమతి : రూ. 7000/-**
**తృతీయ బహుమతి : రూ. 5000/-**

### నిబంధనలు :



1. సమకాలీనం, చారిత్రకం, సైన్స్ ఫిక్షన్ ఇతివృత్తంతో కూడిన కథలను పంపవచ్చు. భారతీయ సామాజిక జీవనమే నేపథ్యంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆంగ్ల పదాలను పరిహరించండి.
2. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఎనిమిది కథలకు రూ.1,000 చొప్పున ప్రోత్సాహక బహుమతులు, సాధారణ ప్రచురణకు స్వీకరించిన ప్రతి కథకు పారితోషికం ఉంటుంది.
3. కథ నిడివి 1500 పదాలకు మించరాదు. ఒక రచయిత 2 కథలకు మించి పంపరాదు.
4. కథ స్వంతమేనని, అనువాదం, అనుసరణ కాదని, బ్లాగుల్లోనూ, వెబ్ పత్రికల్లోనూ మరెక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని; పరిశీలనలో లేదని విడిగా హామీపత్రం జతచేయాలి. హామీపత్రంలో రచయిత పేరు, చిరునామా, ఇ-మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తప్పక రాయండి. కథ రాసిన పుటలలో ఎక్కడా రచయిత పేరు గానీ, ఇతర వివరాలేవి ఉండరాదు.
5. కథలను తెలుగులో అను లేదా యూనికోడ్ ఫాంట్‌లో డిటిపి చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి.
6. పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపాలనుకుంటే 'కథల పోటీ' జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్-500027 కు పంపొచ్చు. జాగృతికి కథల్ని చేర్చే బాధ్యత రచయితలదే.
7. కథల ఎంపికలో ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావులేదు. తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే.
8. ఈ కథలను దీపావళి సంచిక నుంచి వరుసగా ప్రచురిస్తాం.

**కథలు జాగృతికి చేరడానికి చివరి తేది : 22 ఆగస్టు, 2026**

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,**
**వ్యాపార ప్రకటనల వివరాల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

**చందాదారులకి గమనిక**

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి


ఆపరేటింగ్ వ్యవస్థల నుంచి సైబర్ సెక్యూరిటీ వరకు, డీప్ టెక్ నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకూ అంతా మనదే అయితేనే డిజిటల్ సార్వభౌమాధికారం సాధ్యమని ప్రధాని నరేంద్ర మోదీ గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా యువతకు ఇచ్చిన పిలుపులో ఎంత వాస్తవం ఉందో, మనవి కాని సోషల్ మీడియా వేదికలు మన ఆలోచనలను ఎలా ప్రభావితం చేస్తాయో ఇటీవల జరిగిన పరిణామాల ద్వారా అర్థమవుతోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌ను పోలిన, మనవైన సోషల్ మీడియా వేదికలను అభివృద్ధి చేయడం ద్వారా, దేశ సాంకేతిక పర్యావరణ వ్యవస్థ సురక్షితంగా, స్వతంత్రంగా ఉంటూ, డిజిటల్ స్వేచ్ఛకు హామీ ఇస్తుందని ఆయన అన్నమాటలు ఇంకా సాకారం కాకపోవడం విచారకరం. నిజానికి, ఈ విషయంలో చైనా మనకన్నా ముందుంది.

అయితే, చైనా నియంత్రిత, స్వదేశీ నమూనా, ఐటి వ్యవస్థ, పాలన పూర్తిగా ప్రజాస్వామికమైన, వాక్ స్వాతంత్ర్యం ఉన్న మన దేశంలో పని చేయవు. అందుకే, యువత ప్రధానిని, ఆయన తల్లిని కారుకూతలు కూసినా, మోదీ ప్రజాస్వామిక స్ఫూర్తితోనే వారిని మన్నించారు. అయితే, ఆయన ఈ చర్య రాజకీయ ప్రత్యర్థులకు, ఆ నిరసనలోకి ప్రవేశించిన సామాజిక వ్యతిరేక శక్తులకు నచ్చలేదు. ఆయన మాటలు అసలే రుచించలేదు. ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసిన విషయమేమిటంటే, ప్రధాని వీడియోను మెటా కొంతకాలం తమ వేదిక నుంచి తొలగించడం. ఈ విషయంపై కమ్యూనికేషన్స్ అండ్ ఐటిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ అధిపతి నిషికాంత్ దూబె ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియోను మెటా తొలగించినం దుకు ఆ సంస్థ అధిపతి జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జుకర్‌బర్గ్ చెప్పాడు కూడా. అయితే, సమాంతరంగా మనదైన ఐటి పర్యావరణ వ్యవస్థ ఉన్నప్పుడు మాత్రమే పెద్ద కంపెనీలు కూడా తమ హద్దుల్లో ఉంటాయన్నది కాదనలేని వాస్తవం.

అంతేకాదు, పరీక్షా పత్రాలు లీక్ కావడం అన్న సమస్య పలు రాష్ట్రాలలో ఉందని ఆయా ప్రాంతాల్లో తలెత్తిన ఉద్యమాలు చెప్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్

**శాలివాహన 1948 శ్రీ పరాభవ శ్రావణ శుద్ధ పంచమి**

## లోపలి పేజీలలో...

6లో


ముఖపత్ర కథనం

**విరాళాల దిక్సూచి**
**ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ**

ధారావాహిక నవల

2 **ఏ వెలుగులకీ ప్రస్థానం ?**

– గన్నవరపు నరసింహ మూర్తి


20లో

ప్రత్యేక వ్యాసం

**శుభాలరాశి...'వరాల'తల్లి**


19లో

# జాగృతి

## సంపాదకీయం

కూటమి పాలనలో ఉన్న ఝార్ఖండ్, పంజాబ్‌లలో జరిగిన నిరసనలలో వారు విద్యార్థుల పట్ల వ్యవహరించిన, వ్యవహరిస్తున్న తీరుకు, ఢిల్లీ 'విద్యార్థి' నిరసనల సందర్భంగా మాట్లాడిన మాటలకు ఎక్కడా పొంతన లేదు. ఇండీ కూటమి రాష్ట్రాలలో జరిగిన, జరుగుతున్న నిరసనలకు పెద్దగా ప్రచారం లభించకపోవ డానికి కారణం, కొన్ని మీడియా సంస్థలు వారికి ప్రాధాన్యతను ఇవ్వకపోవడమే నన్నది నిర్వివాదం. దాదాపు 49 రోజులుగా సాగుతున్న నిరసనను, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) రంగప్రవేశంతోనే, అప్పటికప్పుడు సహజంగా పుట్టిందంటూ కొందరు విశ్లేషకులు పేర్కొనడం వారి సమాజ వ్యతిరేక మనస్తత్వాన్ని పట్టి

## డిజిటల్ సార్వభౌమాధికారం తక్షణావసరం

చూపుతుంది. రౌడీ షీటర్లు, మాదక ద్రవ్యాలను అమ్మేవారు, అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్నవారి నుంచి ఇస్లామిక్ రాడికల్స్ దాకా, చర్చ్ ఆధ్వర్యంలో మతమార్పిడులు చేసేవారు, యువత, విద్యార్థులు.. ఇదీ సిజెపి నిరసనలో పాల్గొన్న వారి వైవిధ్యం. అయితే, నిజంగా యువజన సమస్యలు పట్టించుకుంటున్న వివిధ పార్టీలలోని యువత గంభీరమైన, అర్థవంతమైన చర్చలనే కోరుకుంటోంది. ఈ క్రమంలో, ఈ నిరసన ప్రదర్శన, హింస, అశ్లీల దూషణలతో కూడిన రీల్స్ భారతీయ సమాజానికి తీవ్రమైన సవాలును విసిరాయి.

ఇటీవలే విద్యార్థులను, యువతను ఆన్‌లైన్ ప్రచారం ద్వారా కూడగట్టడంలో కాక్రోచ్ జనతా పార్టీ విజయవంతం కావడం అన్నది పాశ్చాత్య మెకాలే విద్యా విధానం నుంచి యువత బుర్రలను ప్రక్షాళన చేయవలసిన అవసరాన్ని పట్టి చూపుతోంది. ప్రభుత్వం కూడా ఈ విషయాన్ని గుర్తించినట్టుగా ఉంది. వారి నిరసనలు పూర్తి అయ్యీ కాకముందే, పరీక్షల సంస్కరణల బిల్లును పార్లమెంటులో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే, ఈ చర్య యువతగా చెప్పుకుంటున్నవారికి పూర్తి సంతృప్తిని ఇచ్చినట్టుగా కనిపించడం లేదు. దీనిని బట్టి కేవలం విద్యా సంస్కరణలే కాక, విద్యా సంస్థల్లో భారతీయ దృక్పథంతో పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాల్సిన తక్షణ ఆవశ్యకత ఉందని అవగతమవుతోంది.

ప్రపంచంలో అతిపెద్ద సంఖ్యలో యువత ఉన్న దేశం భారత్. దాదాపు 800 మిలియన్ల మంది 35 ఏళ్లలోపు ఉన్నవారున్నారు. కనుక, వారి గొంతుకను వినాలి, వారితో చర్చించాలి, ప్రభుత్వం చేపట్టిన అంశాల లేదా విషయాల పట్ల వారిలో శాస్త్రీయ అవగాహనను కల్పించాలి.

ఇంతటి భిన్నత్వం కలిగిన దేశంలో, ముఖ్యంగా ఆకాంక్షలతో ఉన్న యువత కోరికలకు అనుగుణంగా విద్యా సంస్కరణలను రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాదు, వాటిని సమగ్రంగా, విశ్వసనీయంగా చేపట్టి, ఆవిష్కరణలకు, పరిశోధనలకు ప్రపంచ విద్యా కేంద్రంగా రూపుదిద్దుకోవాలి. ఇప్పటికే, ప్రభుత్వం అటల్ మిషన్‌లో భాగంగా, పాఠశాల స్థాయిలోనే అటల్ టింకరింగ్ లాబ్ పథకాన్ని అమలు చేస్తూ, చిన్న వయసు నుంచే వారిలో సృజనాత్మక ఐడియాలను, ఆవిష్కరణలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఎందరికి తెలుసు?

ప్రతిసారీ భౌతికంగా యువతను కలువకుండా నియమిత కాలంలో వారితో సాంకేతిక వేదికల ద్వారా విద్యాపరమైన, సమాజపరమైన చర్చలు నిర్వహించవచ్చు. ఈ మార్గాన్ని ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకుని, అనుసరించవచ్చు. తద్వారా, అజెండాను నడిపించుకోవాలనుకునే హాండ్లర్ల అబద్ధపు కథనాలను గుడ్డిగా నమ్మకుండా ఉండేందుకు, మనదైన ఇంటర్నెట్ ఆధారిత సమాచార హైవేను రూపొందించి, చివరి మైలు వరకూ దానిని తీసుకువెళ్లినప్పుడే వికసిత భారత్ వేగంగా సాకారమవుతుంది. ★

17 ఆగస్ట్ 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ


**నాన్నమ్మ ఇల్లు**

– డా. జడా సుబ్బారావు





| | | |
|---|---|---|
| నవతరమే.. నా విశ్వాసం! | - | 12 |
| ధాన్యం లెక్కల్లో గోల్‌మాల్ (తెలంగాణ) | - | 14 |
| నల్లమల రారాజుకు ఆకలి కష్టాలు! (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| ద్విముఖ సంక్షోభంలో పాకిస్తాన్! (అంతర్జాతీయం) | - | 24 |
| ఢిల్లీలో అలా... ఝార్ఖండ్‌లో ఇలా.. (జాతీయం) | - | 26 |
| శిక్షించు ? రక్షించు – జి.వి. శ్రీనివాస్ (కథ) | - | 28 |
| సుధావాహిని "విజయ విలాసం" (గళమెత్తిన గతం) | - | 30 |
| విద్యార్థి జీవితం ఆదర్శంగా ఉండాలి (యువవాణి) | - | 32 |
| మున్ముందు బీమాకి, పెట్రోల్‌కి లింక్! (చర్చ) | - | 34 |
| హిందూధర్మంపై గురూజీ-సుప్రీంకోర్టు.. (ఆర్‌ఎస్‌ఎస్-100) | - | 36 |
| హాకీ టైటిల్‌పై భారత్ గురి (క్రీడ) | - | 43 |
| కొరుకుడు పడని 'కొరియన్ కనకరాజు' (సినిమా) | - | 50 |




**న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన అనంతరం, ప్రశ్నపత్రాల లీకులు సహా పలు అంశాలపై నిజమైన, కల్పితమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో, ఇప్పుడు ప్రపంచం దృష్టి పార్లమెంటువైపు మళ్లింది. కఠినమైన శిక్షా చర్యల ద్వారా పరీక్షా వ్యవస్థపై విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు, ప్రభుత్వ పరీక్షల (అక్రమాల నివారణ) సవరణ బిల్లు, 2026ను ఉభయ సభలు ఆమోదించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీయగల మరో అంశంగా విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్ఏ) సవరణ నిలిచింది. ఈ సవరణను అడ్డుకోవడమే లక్ష్యంగా, ప్రతిపక్షాల మద్దతు పుష్కలంగా ఉన్న కొన్ని పౌర సంఘాలు ఇప్పటికే పెద్ద ఎత్తున ఒక దుష్ప్రచారాన్ని ప్రారంభించాయి. ఈ వ్యవహారంలో ఎన్‌జీఓలు అని పిలిచే ప్రభుత్వేతర సంస్థల గురించి ప్రధానంగా చెప్పుకోవాలి. వీటికి విస్తృతమైన నెట్‌వర్క్‌లు కూడా ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా వీటికి రెండు ముఖాలు ఉంటాయి. ఒక ముఖం అందరికీ కనిపిస్తూ ఉంటుంది. అది ఎక్కడపడితే అక్కడ విపరీతంగా ప్రచారానికి నోచుకుంటుంది. దానిని 'మానవాళికి అంతరాత్మ'గా చిత్రీకరిస్తుంటారు. దీనికి విరుద్ధంగా రెండవ ముఖం ఉంటుంది. అదేమిటంటే ఏవైతే ఎన్‌జీఓ నెట్‌వర్క్‌లు తమను తాము మానవాళికి అంతరాత్మగా డప్పు కొట్టుకుంటాయో అవే నెట్‌వర్క్‌లు తాము బోధించే విలువలకు విరుద్ధంగా 'సందేహాస్పద చర్యల'కు పాల్పడుతున్నాయి. అందువల్ల, మనం ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి ప్రతిపాదిత సవరణలను, వాటి ఉద్దేశ్యాన్ని హేతుబద్ధంగా విశ్లేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

# విరాళాల దిక్సూచి

ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జీఓ)ను సాధారణంగా ఒక నిర్దిష్ట ఆశయంతో నడిచే సంస్థగా పరిగణిస్తారు. ఇది ప్రధానంగా సామాజిక-ఆర్థిక, మానవతా, లేదా పర్యావరణ సమస్యలపై దృష్టి సారిస్తూ, ప్రభుత్వ నియంత్రణకు అతీతంగా స్వతంత్రంగా పనిచేస్తుంది. దీనిని మొట్టమొదట 1945 ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో ప్రస్తావించినప్పటికీ, ఆర్థిక సరళీకరణ తర్వాత ఎన్‌జీఓ రంగం మరింత సంక్లిష్టమైన స్వరూపాన్ని సంతరించుకుంది. ఇప్పుడు, ప్రభుత్వ, వ్యక్తిగత విరాళాలతో పాటు విదేశీ, కార్పొరేట్ నిధులు కూడా ఇందులో భాగమవుతున్నాయి. చాలా ఎన్‌జీఓలు లాభాపేక్ష లేనివి అయినప్పటికీ, వాటి నిధుల వినియోగం ఎల్లప్పుడూ నిశిత పరిశీలనలోనే ఉంది. వాస్తవానికి, ప్రభుత్వ కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి, సేవల పంపిణీలోని లోపాలను పూరించడానికి వీటిని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత, ప్రధానంగా అణగారిన వర్గాలకు సంబంధించిన కొన్ని సమస్యల కోసం వాదించడం, సుస్థిరత, అలాగే ప్రభుత్వ జవాబుదారీతనాన్ని పెంచే క్రియాశీలత వంటివి కూడా వీటి విధులకు తోడయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ వైఫల్యాలు ,పెరిగిన అంతర్జాతీయ నిధుల కలయికతో అతిపెద్ద, వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో ఒకటిగా ఎన్‌జీఓ రంగం మారింది.

ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) గణాంకాల ప్రకారం, ఒక కోటికి పైగా క్రియాశీలక ఎన్‌జీఓలు ఉన్నాయి, ఇవి సుమారుగా 2 ట్రిలియన్ డాలర్ల వార్షిక ఆదాయాన్ని, 20 కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. ఒక అంచనా ప్రకారం సొసైటీలు, ట్రస్టులు, సెక్షన్ 8 కంపెనీల పరిధిలో 34 లక్షలకు పైగా నమోదిత సంస్థలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్జీఓ వ్యవస్థలలో ఒకటి భారతదేశంలో ఉంది. అయినప్పటికీ, వాటిలో చాలా తక్కువ భాగం మాత్రమే పూర్తి క్రియాశీలకంగా, వృత్తిపరంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకారం, సుమారు 35,000 ఎన్జీఓలు చెల్లుబాటు అయ్యే ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సులను కలిగి ఉన్నాయి. ఇది దశాబ్దం క్రితం ఉన్న 50,000కు పైగా సంఖ్యతో పోలిస్తే తక్కువ. సహజంగానే, ప్రభుత్వ అజెండాను నిర్దేశించడానికి, ప్రభావితం చేయడానికి అంతర్జాతీయ సంస్థలకు భారతదేశం ఒక పెద్ద క్రీడా మైదానంగా మారింది. అందువల్ల, ఎఫ్‌సీఆర్ఏ చట్టం సామాజిక రంగంలో నిజమైన అంతర్జాతీయ సహకారానికి వీలు కల్పించే ఒక చట్టపరమైన చట్రాన్ని అందించడంతో పాటు, విదేశీ విరాళాల ప్రవాహం, వినియోగం భారతీయ చట్టానికి అనుగుణంగా ఉండేలా చూసేందుకు ఉద్దేశించినది.

దురదృష్టవశాత్తు, కాలక్రమేణా, అనేక సంస్థలు ఎన్జీఓ వ్యాపారంలో స్వప్రయోజనాలను పెంచుకున్నాయి. అందిన నిధుల సద్వినియోగానికి బదులుగా వాటిని స్వయం ప్రకటిత కార్యకర్తలకు, పరిపాలనా అధిపతులకు, వ్యక్తిగత సౌకర్యాలకు ఖర్చు చేశాయి. ప్రభుత్వ, ప్రభుత్వేతర విదేశీ శక్తులు తమ అజెండాలను ముందుకు తీసుకెళ్లేందుకు, నిధులను కుమ్మరించడానికి ఒక క్రీడాస్థలంగా భారత్ వంటి చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం మారింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, గ్రీన్‌పీస్ వంటి సంస్థలు నిధులను దారి మళ్లించాయని, పక్షపాత నివేదికలను రూపొందించాయని ఆరోపణలు ఎదుర్కొన్నాయి. 2015లో, 10 శాతం కంటే తక్కువ ఎన్జీఓలు మాత్రమే తమ రిటర్న్‌లు, బ్యాలెన్స్ షీట్‌లు, ఇతర ఆర్థిక వివరాలను అధికారులకు సమర్పించాయని సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) సుప్రీంకోర్టుకు తెలియజేసింది. జనవరి 10, 2017న, ప్రభుత్వ లేదా విదేశీ నిధులు పొందుతున్న దాదాపు 30 లక్షల ఎన్జీఓలపై పూర్తి ఆడిట్ నిర్వహించాలని ఆదేశిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. నిఘా నివేదికల ఆధారంగా కొన్ని అంచనాల ప్రకారం, ప్రధానంగా అభివృద్ధి ప్రాజెక్టులు నిలిచిపోవడం వల్ల ఎన్జీఓల క్రియాశీలత భారత ఆర్థిక వ్యవస్థకు 2-3 శాతం నష్టాన్ని కలిగిస్తోంది. విచిత్రమేమిటంటే, ఈ ఎన్జీఓలే ప్రభుత్వం నుండి జవాబుదారీతనం, పారదర్శకతను కోరుతూ, వాటిని పాటించడానికి నిరాకరిస్తున్నాయి. వారు అణగారిన సామాజిక వర్గాల సమ్మిళితత్వం, మానవ హక్కుల గురించి మాట్లాడతారు. కానీ, వాటికోసం వచ్చిన విరాళాలను ట్రస్టీల వ్యక్తిగత




# ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ

సౌకర్యాలకు మళ్లిస్తారు. విద్య, ఆరోగ్య సంరక్షణ కోసం అందుకున్న నిధులను మత ప్రచారం కోసం దుర్వినియోగం చేయడం మరో తీవ్రమైన ఆందోళన కలిగించే విషయం. ఎందుకంటే ఇది దేశీయ గుర్తింపు, ఆచారాలు, విశిష్ట సంప్రదాయాలను అణచివేస్తుంది. భారతదేశపు నిజమైన అవసరాలకు బదులుగా, అనేక ఎన్జీఓల అజెండా, వాదనాంశాలను సైద్ధాంతిక ధోరణులు, కార్పొరేట్ ప్రయోజనాలే నిర్దేశిస్తున్నాయి. కొందరి ఈ పారిశ్రామిక స్థాయి కపటత్వం కారణంగా, ఈ రంగం మొత్తం విశ్వసనీయత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

2020 నుంచి పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తూనే విదేశీ విరాళాలను సులభతరం చేసేందుకు అనేక సంస్కరణలు వచ్చాయి. ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రద్దు అయిన సందర్భంలో, నిధుల వినియోగానికి సంబంధించిన నిర్దిష్ట ప్రయోజన నిబంధన, ఆస్తుల నిర్వహణ సంబంధిత సమస్యలను 2026 సంస్కరణలు పరిష్కరిస్తాయి. రిజిస్ట్రేషన్ గడువు ముగిసినప్పుడు లేదా రద్దు అయినప్పుడు, విదేశీ నిధులతో కూడిన ఆస్తులను పరిరక్షించడానికి ఒక నియమిత అధికార సంస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిత ఎఫ్‌సీఆర్‌ఏ సవరణలు ప్రతిపాదిస్తున్నాయి. నోటిఫై చేసిన ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ నియమాలు, ఆమోదిత రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల కార్యకలాపాల పరిధిలో రిజిస్ట్రేషన్‌ను నిర్దిష్ట ప్రయోజనాలకు అనుసంధానిస్తాయి. అనుమతించిన మతపరమైన కార్యకలాపాల నుండి మత ప్రచారాన్ని మినహాయిస్తాయి.

ఒక నిర్దిష్ట కారణం పేరుతో విరాళాలు సేకరించినప్పుడు, దానిని అదే ప్రయోజనం కోసం ఉపయోగించాలని ఆశించడంలో తప్పేముంది? ఎన్జీఓ పరిశ్రమ దేశ చట్టానికి అతీతమైనదా? చట్టపరమైన నిబంధనలను పాటించనప్పుడు, సామాజిక సేవ పేరుతో ఆస్తులను పోగుచేయడానికి అటువంటి సంస్థలను ఎందుకు అనుమతించాలి? ఈ మధ్యవర్తుల ద్వారా ఒక విదేశీ విధ్వంసక ఎజెండా మన ప్రజాస్వామ్యంలోకి చొరబడటానికి మనం అనుమతించగలమా? ఒక విధంగా, ఇది దేశ సార్వభౌమత్వం, భద్రతకు సంబంధించిన ప్రశ్న. నిజానికి, అందుకున్న ప్రతి పైసా ఆశించిన కార్యానికే ఖర్చు అయ్యేలా చూసేందుకు, ప్రజల కార్యాచరణ, గ్రామీణ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి మండలి (సీఏపీఏఆర్టీ) వంటి సంస్థలు ఈ చట్టాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి.

సోదరి నివేదిత పేర్కొన్నట్టుగా పౌర బాధ్యతా భావంతో, ఒక సహజ సంబంధంతో ఇచ్చే దానమనే పురాతన సంప్రదాయం కూడా భారతదేశానికి ఉంది. దేవాలయాలు సహా సామాజిక నిర్మాణాలు, సంస్థలు సరిగ్గా ఈ కార్యకలాపాలను నెరవేర్చడానికే ఉద్దేశించినవి. సమాజం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ఒక మధ్యవర్తిగా ఉండాలి. వలసవాదం, ప్రభుత్వ-కేంద్రీకృత సంక్షేమవాద పాశ్చాత్య నమూనా స్వదేశీ స్వయంప్రతిపత్తి గల సామాజిక వ్యవస్థలను నాశనం చేశాయి. సేవ సహజంగా, పారదర్శకంగా, ఎలాంటి ఆశలు లేదా మోసపూరిత మార్గాలు లేకుండా ఉండాలనేది భారతీయ భావన. ఒక అజెండాతో నడిచే, మతమార్పిడి చేసే చర్య సేవ కాజాలదు. అది ఒక లాభాపేక్ష వ్యాపారం అవుతుంది. ప్రతిపాదిత సవరణలను ఎన్జీఓలకు, పౌర సమాజానికి లేదా ఏదైనా నిర్దిష్ట మత వర్గానికి ముప్పుగా చూడకూడదు. అంతేకాక, జవాబుదారీతనం, పారదర్శకత అనే పునాదులను పటిష్టం చేయడానికి, అలాగే స్వచ్ఛంద కార్యకర్తల నిబద్ధత, దృఢ విశ్వాసంతో ప్రజలకు నిజంగా సేవ చేయాలనుకునే ఎన్జీఓల విశ్వసనీయతను పునరుద్ధరించడానికి దీనిని ఒక ప్రయత్నంగా భావించాలి.

దాతృత్వ, విద్యా, సామాజిక, సాంస్కృతిక, అభివృద్ధి కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడంలో విదేశీ విరాళాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. భారతదేశం నిజమైన అంతర్జాతీయ సహకారాన్ని, మానవతా సహాయాన్ని స్వాగతిస్తుంది. అదే సమయంలో, భారతదేశం వెలుపల నుండి వచ్చి దేశంలో వినియోగించే నిధులు తప్పనిసరిగా పారదర్శకత, జవాబుదారీతనం, భారతీయ చట్టాలకు అనుగుణ్యత అనే చట్రంలో ఉండాలి. ప్రతిపాదిత విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026 ఈ చట్రాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తుంది. దీని ప్రాముఖ్యత కేవలం విదేశీ విరాళాల స్వీకరణ, వినియోగాన్ని నియంత్రించడంలోనే కాకుండా, ఒక సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ సర్టిఫికేట్ చెల్లుబాటు కానప్పుడు, విదేశీ నిధులతో కూడిన ఆస్తులతో వ్యవహరించడానికి ఒక స్పష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడంలో కూడా ఉంది. ఇందులో ఇమిడి ఉన్న విదేశీ విరాళాల పరిమాణం, సమర్థవంతమైన నియంత్రణను ప్రత్యేకంగా ,ముఖ్యమైనదిగా చేస్తుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం, 2019 –2022 మధ్య కాలంలో 13,520 సంస్థలు రూ. 55,741 కోట్ల విదేశీ విరాళాలను అందుకున్నాయి. అంతేకాకుండా, ఎఫ్‌సీఆర్‌ఏ పోర్టల్ ప్రకారం, 15 జూలై 2026 నాటికి, 14,449 క్రియాశీల ఎఫ్‌సీఆర్‌ఏ సర్టిఫికెట్లు ఉండగా, 22,498 రద్దు అయ్యాయి. 15,212 సర్టిఫికెట్లకు కాలం చెల్లింది. ఈ విధంగా, వివిధ వర్గాలలో ఉన్న 52,159 సంస్థలలో, 37,710 సంస్థల సర్టిఫికెట్లు రద్దు అయ్యాయి లేదా వాటి గడువు ముగిసిపోయింది. దీనితో పోలిస్తే, 14,449 సంస్థలు మాత్రమే క్రియాశీలంగా ఉన్నాయి. మరో మాటలో

చెప్పాలంటే, క్రియాశీల సర్టిఫికెట్లు ఉన్న సంస్థల సంఖ్య కంటే, రద్దు అయిన లేదా గడువు ముగిసిన స్థితిలో ఉన్న సంస్థల సంఖ్య 2.6 రెట్లకు పైగా ఉంది.

ఎఫ్‌సీఆర్ఏ అధికారిక అనుమతి ముగిసిన తర్వాత, విదేశీ నిధులతో నడిచే సంస్థల చట్టపరమైన హోదా, వాటి ఆస్తులను ఎందుకు అస్పష్టంగా వదిలి వేయకూడదో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**నిధుల నియంత్రణ నుండి ఆస్తుల నియంత్రణ వరకు**

ఒక సంస్థకు మంజూరు చేసిన ఎఫ్‌సీఆర్ఏ సర్టిఫికేట్‌కు కాలం చెల్లడం లేదా రద్దు అయినప్పుడు ఆ సంస్థకు అందిన విదేశీ విరాళాలతో ఏర్పరుచుకున్న స్థిర, చరాస్తులు ఏమవుతాయి? అనే ప్రాథమిక ప్రశ్నకు ప్రతిపాదిత సవరణ సమాధానం ఇస్తుంది. దీనికి సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న చట్రం(ఫ్రేమ్‌వర్క్) ప్రకారం, ఎఫ్‌సీఆర్ఏ సర్టిఫికేట్‌ను రద్దు చేసినప్పుడు లేదా అప్పగించినప్పుడు, విదేశీ విరాళాలు, వాటి ద్వారా చేకూర్చుకున్న ఆస్తులకు నిబంధనలు వర్తిస్తాయి. సర్టిఫికేట్‌ను పునరుద్ధరించక పోవడం, పునరుద్ధరణ దరఖాస్తు సమర్పించక పోవడం లేదా పునరుద్ధరణ దరఖాస్తు తిరస్కరణ వంటి కారణాల వల్ల సర్టిఫికేట్ చెల్లుబాటు కాకుండా పోయే పరిస్థితులకు కూడా ఈ చట్రాన్ని ప్రతిపాదిత బిల్లు వర్తింపజేస్తుంది. విదేశీ విరాళాలు, ఆస్తులను ఒక నియమిత అధికార సంస్థకు తాత్కాలికంగా అప్పగించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. ఇది ఎఫ్‌సీఆర్ఏ చెల్లుబాటు తాత్కాలికంగా నిలిచిపోవడానికి, అర్హతను శాశ్వతంగా కోల్పోవడానికి మధ్య ఉన్న ఒక ముఖ్యమైన వ్యత్యాసాన్ని చూపుతుంది. ఒకవేళ ఏదైనా సంస్థ తదనంతరం కొత్త సర్టిఫికేట్‌ను పొందినా, లేదా దాని సర్టిఫికేట్ పునరుద్ధరణకు నోచుకున్నా, దానికి అప్పటిదాకా తాత్కాలికంగా ఉన్నహక్కు రద్దు అవుతుంది. ఉపయోగించని విదేశీ విరాళాలు లేదా ఆస్తులు దానికి తిరిగి అప్పగించడం జరుగుతుంది. కేవలం చట్టాన్ని అనుసరించడం కోసమే అలా జరుగుతుంది. విదేశీ విరాళాల ద్వారా ఏర్పరుచుకున్న ఆస్తులను రక్షించడంతో పాటు, అదే సమయంలో నిజాయితీగల సంస్థలకు తమ చట్టపరమైన హోదాను పునరుద్ధరించుకునే అవకాశాన్ని కల్పించడానికి ఈ విధానం ప్రయత్నిస్తుంది.




**ప్రజా ప్రయోజనం-ఆస్తుల రక్షణ**

శాశ్వతంగా హక్కు పొందిన ఆస్తులను ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలని ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. వాటిని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు లేదా విభాగాలకు, కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ అధికార సంస్థలకు లేదా ఏజెన్సీలకు బదిలీ చేయవచ్చు, లేదా నిర్దేశించిన ప్రక్రియల ద్వారా విక్రయించవచ్చు. విక్రయించగా వచ్చిన ఆదాయం, ఉపయోగించని విదేశీ విరాళంతో కలపగా వచ్చిన మొత్తం భారత సంఘటిత నిధిలో జమ అవుతుంది. ఒక సంస్థ చెల్లుబాటు అయ్యే ఎఫ్‌సీఆర్ఏ హోదాను కోల్పోయినప్పుడు, అది చట్టబద్ధమైన, ప్రకటించిన ప్రయోజనాల కోసం అందించిన విదేశీ విరాళాలు, ఆస్తులపై నిరవధిక ప్రైవేట్ నియంత్రణకు దారితీయ కూడదు అనే ఇది ఒక ముఖ్యమైన సూత్రాన్ని ప్రతిపాదిత ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు ప్రతిష్ఠిస్తుంది. అదే సమయంలో, దీని అమలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, తగిన రక్షణ చర్యలకు లోబడి ఉండాలి. చట్టం అనుమతించిన చోట, విధానపరమైన లోపాలను సరిదిద్దుకుని, తమ చట్టబద్ధమైన హోదాను పునరుద్ధరించుకునేందుకు నిజమైన సంస్థలకు తగిన అవకాశం ఉండాలి.

**ప్రార్థనాస్థలాల పరిరక్షణ**

ప్రతిపాదిత చట్టం ప్రార్థనా స్థలాల ప్రత్యేక స్వభావాన్ని కూడా గుర్తిస్తుంది. శాశ్వతంగా కేటాయించిన ఆస్తి పూర్తిగా లేదా పాక్షికంగా ఒక ప్రార్థనాస్థలం అయినట్లయితే, దాని ధార్మికపరమైన స్వభావం దెబ్బతినకుండా చూసుకుంటూనే, దాని నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఇది ముఖ్యం ఎందుకంటే ప్రార్థనాస్థలాలను కేవలం సాధారణ ఆర్థిక లేదా వాణిజ్య ఆస్తులుగా పరిగణించలేము. అవి సామాజిక, సాంస్కృతిక, ధార్మికపరమైన ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. వాటి స్వరూపాన్ని తప్పక రక్షించాలి.

**కీలకమైన కార్యకర్తల జవాబుదారీతనం**

మరొక ముఖ్యమైన సంస్కరణగా కీలకమైన కార్యకర్తలు(కీ ఫంక్షనరీస్) అనే పదానికి ప్రతిపాదిత చట్టబద్ధమైన నిర్వచనం ఉంటుంది. కీలకమైన కార్యకర్తలుగా కంపెనీల డైరెక్టర్లు, సంస్థల భాగస్వాములు, ట్రస్టీలు, హిందూ అవిభక్త కుటుంబ కర్త, పాలక లేదా నిర్వహణ సంస్థల కార్యనిర్వాహకులు, సభ్యులు, ఒక సంస్థను నిర్వహించడానికి బాధ్యత వహించే ఇతర వ్యక్తులు ఉంటారు. కేవలం ఒక చట్టపరమైన సంస్థపై మాత్రమే జవాబుదారీతనం ఉండకూడదు. సంస్థలను నిర్వహించే బాధ్యత గల వ్యక్తులు తగిన శ్రద్ధ వహించి, చట్టానికి అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి. అదే సమయంలో, ప్రతిపాదిత చట్రం రక్షణలను గుర్తిస్తుంది. ఒక నేరం తమకు తెలియకుండా జరిగిందని లేదా దానిని నివారించడానికి తాము తగిన శ్రద్ధ వహించామని ఒక కీలక కార్యకర్త నిరూపించుకోవచ్చు. ఖాయిలా పడిన సంస్థల చివరి కీలక కార్యకర్తల బాధ్యతలను కూడా ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. వారు కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాల్సిన చట్టబద్ధమైన విధిని కలిగి ఉంటారు. ఒక సంస్థ ఉనికిలో లేకుండా పోయిన తర్వాత, విదేశీ విరాళాలు, ఆస్తులు అనిశ్చిత చట్టపరమైన స్థితిలో మిగిలిపోకుండా నిరోధించడమే ఈ బిల్లు ఉద్దేశ్యం.

**కాలపరిమితితో కూడిన ముందస్తు అనుమతి**

ముందస్తు అనుమతి ద్వారా విదేశీ విరాళాలు స్వీకరించే సందర్భాలలో ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ లేని సంస్థల నుంచి మరింత క్రమశిక్షణను కూడా ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. అటువంటి అనుమతి ఒక నిర్దిష్ట మూలం, మొత్తం, ప్రయోజనాలకు మంజూరు అవుతుంది. ప్రతిపాదిత సవరణ ప్రకారం, విరాళాన్ని నిర్దేశించిన కాలపరిమితిలోగా స్వీకరించి, వినియోగించుకోవాలి. ఇది ఒక సహేతుకమైన పాటించాల్సిన సూత్రం. ఒక నిర్దిష్ట ఆమోదిత ప్రయోజనం కోసం స్వీకరించిన నిధులను నిరవధికంగా వినియోగించకుండా వదిలివేయ కూడదు లేదా అనుమతి మంజూరు చేసిన ప్రయోజనానికి వెలుపల ఉన్న కార్యకలాపాలకు మళ్లించకూడదు.

**శిక్షల హేతుబద్ధీకరణ**

ప్రతిపాదిత చట్టం ఎఫ్‌సీఆర్ఏ కింద నేర శిక్షలను కూడా సవరించాలని కోరుతోంది. ప్రస్తుత నిబంధనలు ఐదేళ్ల వరకు జైలు శిక్షను

విధించగలిగినప్పటికీ, ప్రతిపాదిత బిల్లు గరిష్ట జైలు శిక్షను ఒక సంవత్సరానికి తగ్గించాలని కోరుతోంది. అదే సమయంలో, ఎఫ్‌సీఆర్ఏ నేరంపై దర్యాప్తు ప్రారంభించే ముందు కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి అవసరం. పరిపాలనా పర్యవేక్షణను బలోపేతం చేస్తూ, నేర శిక్షలను హేతుబద్ధీకరించే ప్రయత్నాన్ని ఇది సూచిస్తుంది. తీవ్రమైన ఉల్లంఘనలను సమర్థవంతంగా ఎదుర్కోవడం, అదే సమయంలో నిజాయతీగల సంస్థలను అనవసరమైన వేధింపుల నుండి రక్షించడం లక్ష్యంగా ఉండాలని నిర్దేశిస్తుంది.

**సామాజిక నిర్మాణ పరిరక్షణ**

ఎఫ్‌సీఆర్ఏ చట్టాన్ని భారతదేశ సామాజిక, జనాభా వైవిధ్యం నేపథ్యంలో కూడా చూడాలి. భారతదేశం ఒక బహుళత్వ ప్రజాస్వామ్యం. ఇక్కడ ప్రతి పౌరుడు మనస్సాక్షి, ధార్మిక స్వేచ్ఛ సహా రాజ్యాంగ స్వేచ్ఛలను అనుభవిస్తాడు. చట్టబద్ధమైన ధార్మిక, దాతృత్వ మానవతా కార్యకలాపాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి. అయితే, రాజ్యాంగం ద్వారా సంప్రాప్తించిన స్వేచ్ఛలు విదేశీ నిధుల దుర్వినియోగానికి ఒక రక్షణ కవచంగా మారకూడదు. విదేశీ విరాళాలను నిర్బంధమైన లేదా మోసపూరితమైన మత మార్పిడికి, ఉద్దేశపూర్వకంగా సామాజిక విభజనలను ప్రోత్సహించే కార్యకలాపాలకు, లేదా ప్రభుత్వానికి ప్రకటించిన వాటికి విరుద్ధమైన ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు. ఇక్కడ ఆందోళన చట్టబద్ధమైన, ధార్మికపరమైన సేవ గురించి కాదు.

సామాజిక సామరస్యం, జనాభా స్థిరత్వం లేదా సమాజ సంబంధాలను ప్రతికూలంగా ప్రభావితం చేయగల కార్యకలాపాల కోసం విదేశీ నిధులతో కూడిన వనరులను దుర్వినియోగం చేసే అవకాశం గురించే అసలు ఆందోళన. అందువల్ల, పటిష్టమైన ఆర్థిక పరిశీలన, పారదర్శకమైన లెక్కలు, సమర్థవంతమైన పర్యవేక్షణ అత్యవసరం. విదేశీ విరాళాలు అందుకునే ప్రతి సంస్థ దాని ధార్మిక పరమైన, సైద్ధాంతిక లేదా సామాజిక స్వభావంతో సంబంధం లేకుండా జవాబుదారీ తనంతో కూడిన ప్రమాణాలకు లోబడి ఉండాలి.

**విదేశీ నిధులు- జాతీయ కథనం**

భారతదేశ జాతీయ కథనానికి సంబంధించి ఒక విస్తృతమైన సమస్య కూడా ఉంది. నేడు భారతదేశం సాంకేతికత, వ్యవస్థాపకత, విజ్ఞానం, మౌలిక సదుపాయాలు, ప్రజాస్వామ్యం, మానవ వనరులు, సాంస్కృతిక వైవిధ్యంలో అపారమైన బలాలను కలిగి ఉంది.

భారతదేశం ఒక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా పయనిస్తున్న కొద్దీ, దాని ప్రపంచ ప్రతిబింబం, జాతీయ కథనం అత్యంత



ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయి. భారతదేశంపై చట్టబద్ధమైన అంతర్జాతీయ విమర్శలు ఉండవచ్చు. ఏ ప్రభుత్వంపైనైనా విమర్శ అనేది ప్రజాస్వామ్యంలో ఒక ఆవశ్యకమైన అంశం. అయితే, చట్టబద్ధమైన ప్రజాస్వామ్య విమర్శకు, భారతదేశ విజయాలు, సంస్థాగత సామర్థ్యం, అభివృద్ధి సామర్థ్యాన్ని క్రమపద్ధతిలో విస్మరిస్తూ, దాని బలహీనతలను మాత్రమే ఎంచుకొని, బాహ్య నిధులతో ఉద్దేశపూర్వకంగా సృష్టించిన కథనాలకు మధ్య వ్యత్యాసం ఉంది. ప్రభావాన్ని కొనుగోలు చేయడానికి, కథనాలను తయారు చేయడానికి లేదా భారతదేశ చట్టబద్ధమైన జాతీయ ప్రయోజనాలను దెబ్బతీయడానికి సాధనాలుగా విదేశీ నిధులతో నడిచే సంస్థలు మారకూడదు. అదే సమయంలో, చట్టబద్ధమైన అసమ్మతిని, స్వతంత్ర పాత్రికేయాన్ని, మానవతావాద కార్యకలాపాలను లేదా చట్టబద్ధమైన పౌర-సమాజ కార్యకలాపాలను అణచివేయడానికి నియంత్రణను ఉపయోగించకూడదు. పారదర్శకత, జవాబుదారీతనం, జాతీయ ప్రయోజనం పట్ల లక్ష్యం స్పష్టంగా ఉండాలి. చట్టబద్ధమైన ప్రజాస్వామ్య భావప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు విధించరాదు.

**దేశాభివృద్ధికి విదేశీ విరాళాలు దోహదపడాలి**

నిజమైన అంతర్జాతీయ దాతృత్వం, మానవతా సహాయం, విద్యా సహకారం, అభివృద్ధి భాగస్వామ్యాలను స్వాగతించడాన్ని భారతదేశం కొనసాగించాలి. కానీ అటువంటి సహకారం భారతదేశ చట్టాలను, రాజ్యాంగ వ్యవస్థను, సార్వభౌమత్వాన్ని, సామాజిక సామరస్యాన్ని గౌరవించాలి. విదేశీ విరాళాలు భారతదేశ అభివృద్ధికి తోడ్పడాలి. సమాజాలను బలోపేతం చేయాలి. చట్టబద్ధమైన ప్రజా ప్రయోజనాలకు మద్దతు ఇవ్వాలి. అవి భారతదేశ భవిష్యత్తును ప్రభావితం చేసే, దాని సామాజిక సమైక్యతను బలహీనపరిచే లేదా దాని జాతీయ ప్రయోజనాలకు భంగం కలిగించే సాధనాలుగా ఎన్నడూ మారకూడదు. అందువల్ల, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లుకు ఆర్థిక నియంత్రణకు మించిన ప్రాముఖ్యత ఉంది. ఇది విదేశాల నుండి భారతదేశంలోకి ప్రవేశించే డబ్బుపై జవాబుదారీతనాన్ని నెలకొల్పడం, అటువంటి వనరులు చట్టబద్ధమైన , ప్రకటిత ప్రయోజనాలకు అనుసంధానమై ఉండేలా చూడటానికి సంబంధించినది. ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు-2026 ప్రధానంగా విదేశీ విరాళాల ప్రవాహాన్ని నియంత్రించడంపై దృష్టి సారించిన వ్యవస్థ నుండి, ఆ విరాళాల ద్వారా సృష్టించిన ఆస్తుల దీర్ఘకాలిక చట్టపరమైన స్థితిని కూడా పరిష్కరించే వ్యవస్థ వైపు ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తుంది.

ప్రతిపాదిత సంస్కరణలు ఆర్థిక జవాబుదారీతనాన్ని బలోపేతం చేయగలవు, నిబంధనల పాటింపును మెరుగుపరచగలవు. విదేశీ నిధులతో కూడిన ఆస్తుల పరిరక్షణకు తోడు, అంతిమంగా అవి చట్టబద్ధమైన ప్రజా ప్రయోజనాల కోసం వినియోగితమవుతాయని నిర్ధారించగలవు. అయితే, అమలు పారదర్శకంగా, ఊహించదగినదిగా, నిష్పక్షపాతంగా ఉండాలి. చట్టం అనుమతించిన చోటల్లా, నిజమైన సంస్థలకు తగిన విధానపరమైన రక్షణలు, లోపాలను సరిదిద్దుకోవడానికి, చట్టబద్ధమైన హోదాను తిరిగి పొందడానికి నిజమైన అవకాశం ఉండాలి. అంతిమంగా, విదేశీ విరాళాలను భారతదేశ చట్టాల ప్రకారం అనుమతించిన, చట్టబద్ధమైన, న్యాయమైన ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించాలి. జవాబుదారీతనం, పారదర్శకత, ప్రజా ప్రయోజనం, జాతీయ భద్రత మార్గదర్శక సూత్రాలుగా ఉండాలి. తగిన రక్షణలతో అమలు చేస్తే, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు-2026 దేశానికి మరింత బలమైన, సువ్యవస్థీకృతమైన నియంత్రణ నిర్మాణాన్ని అందించగలదు. ఇది చట్టబద్ధమైన పౌర సమాజ కార్యకలాపాలను పరిరక్షిస్తూనే, దేశ సామాజిక సామరస్యం, జాతీయ భద్రత, సార్వభౌమత్వం, అభివృద్ధి, దీర్ఘకాలిక శ్రేయస్సును కాపాడు తుందనడంలో ఎలాంటి సందేహం లేదు

**– జాగృతి డెస్క్**




# దానవుడు వద్దు.. దానం కావాలి..!

**భారతదేశంలోకి విదేశీ నిధుల రాక, వాటి వినియోగానికి సంబంధించిన చర్చ కొత్తదేమీ కాదు. చాలా కాలంగా, విదేశీ సహాయంతో నడిచే అనేక సంస్థలు విద్య, ఆరోగ్యం, విపత్తు సహాయం, సామాజిక సేవ, మతపరమైన కార్యకలాపాలు, పరిశోధన వంటి రంగాలలో దేశంలో గణనీయమైన కృషిని చేస్తున్నాయి. ఇటువంటి చట్టబద్ధమైన, పారదర్శకమైన కార్యకలాపాలన్నింటినీ స్వాగతించాలి. అయితే, రాజకీయ ప్రభావం, సామాజిక అస్థిరత, మత మార్పిడి, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు లేదా భారతదేశ జాతీయ ప్రయోజనాలకు హాని కలిగించే చర్యల కోసం తమ ప్రకటించిన లక్ష్యాలకు భిన్నంగా విదేశీ నిధులను ఎన్‌జీఓలు వినియోగించినప్పుడు సమస్య తలెత్తుతుంది. ఈ ప్రాథమిక ఉద్దేశ్యంతోనే విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) రూపొందింది.**

విదేశీ నిధులు, రాజకీయ కార్యకలాపాలను పర్యవేక్షించడమే ప్రధాన లక్ష్యంగా, అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) సమయంలో 1976లో ఇది మొట్టమొదటసారిగా అమలులోకి వచ్చింది. తదనంతరం, 2010లో పాత చట్టం స్థానంలో మరింత కఠినమైన ఎఫ్‌సీఆర్‌ఏ-2010' వచ్చింది. ఇది 2011 మే 1న అమలులోకి వచ్చింది. విదేశీ నిధులపై పూర్తి నిషేధం విధించడం ఈ చట్టం ఉద్దేశ్యం కాదు. బదులుగా, భారతదేశానికి వచ్చే విదేశీ నిధులను పారదర్శకంగా స్వీకరించేలా, ఏ నిర్దిష్ట ప్రయోజనం కోసం అయితే వాటికి అనుమతి లభించిందో, ఆ ప్రయోజనం కోసమే అవి ఖర్చు చేసేలా చూడటమే దీని లక్ష్యం.

### ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ ఆవశ్యకత

ప్రస్తుత సమావేశాల్లో ప్రతిపాదిత చట్టాన్ని పార్లమెంటులో ప్రవేశపెడతారని తీవ్రంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఒక సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ సర్టిఫికేట్ రద్దు అయినప్పుడు, ఆ సంస్థ దానిని స్వచ్ఛందంగా వదులుకున్నప్పుడు, లేదా సర్టిఫికేట్ పునరుద్ధరణకు నోచుకున్నప్పుడు, విదేశీ నిధుల ద్వారా సంపాదించిన ఆస్తులను నిర్వహించడానికి, విదేశీ విరాళాలను నిర్వహించడానికి ఒక చట్రాన్ని ఏర్పాటు చేయడమే ఈ బిల్లులోని ఒక కీలక నిబంధన. ఈ లక్ష్యంతో, అటువంటి ఆస్తుల తాత్కాలిక నియంత్రణ, నిర్వహణను, అలాగే వాటి అంతిమ పరిష్కారాన్ని పర్యవేక్షించడానికి ఒక నియమిత అథార్టీని నియమించాలని ఈ ప్రతిపాదన సూచిస్తున్నది. నిర్దేశిత విధానం ద్వారా సంస్థ తన ఎఫ్‌సీఆర్‌ఏ నమోదును పునరుద్ధరించుకుంటే, ఆస్తులు, వినియోగించని విదేశీ నిధులను తిరిగి పొందేందుకు కూడా ఆ సంస్థకు అవకాశం ఉంటుంది. ఈ ఆస్తులలో ఏదైనా ప్రార్థనాస్థలం ఉన్నట్లయితే, అక్కడ ధార్మికపరమైన కార్యకలాపాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగాలని కూడా ఈ బిల్లు నిర్దేశిస్తుంది. ఈ బిల్లులో ఉన్న మరో ముఖ్యమైన మార్పు శిక్షా నిబంధనలకు సంబంధించినది. ప్రస్తుతం ఉన్న గరిష్ఠ శిక్షా కాలం ఐదేళ్ల నుంచి ఏడాదికి తగ్గించాలని ఇందులో ప్రతిపాదించారు. అంతేకాకుండా, నిర్దేశిత అధికారి జారీచేసే ఆదేశాలపై సమీక్ష, న్యాయపరమైన అప్పీలుకు కూడా ఇందులో అవకాశం కల్పించారు. మరో మాటలో చెప్పాలంటే, దీనిని కేవలం విదేశీ సంస్థలపై తీసుకునే చర్యగా మాత్రమే పరిగణించడం అసంపూర్ణం అవుతుంది. విదేశీ నిధుల విషయంలో జవాబుదారీ తనం, పారదర్శకత, జాతీయ ప్రయోజనాలే దీనికి సంబంధించిన ప్రధాన అంశాలు.

### విదేశీ నిధుల పర్యవేక్షణ

దేశంలోకి వచ్చే విదేశీ నిధుల మూలాలు, వాటి వినియోగాన్ని పర్యవేక్షించడం అనేది ఏ సార్వభౌమ దేశానికైనా ఒక సాధారణ విధానం. ఇలా చేస్తున్న ఏకైక దేశం భారతదేశం మాత్రమే కాదు. అమెరికా సహా అనేక దేశాలు విదేశీ నిధులు, విదేశీ ఏజెంట్లు, విదేశీ సంస్థలు, రాజకీయ ప్రభావాలకు సంబంధించిన అంశాలను నియంత్రించే ప్రత్యేక చట్టాలు, యంత్రాంగాలను కలిగి ఉన్నాయి. కాబట్టి, విదేశీ విరాళాలపై భారతదేశం అమలు చేస్తున్న నియంత్రణ చర్యలను ఏదైనా నిర్దిష్ట మతం లేదా వర్గానికి వ్యతిరేకంగా తీసుకున్న చర్యగా భావించడం వాస్తవ విరుద్ధం.

### గతంలోనూ అనేక సవరణలు

ఈ చట్టాన్ని సవరించడం ఇదే మొదటిసారి కాదు. దీనికి ముందు, వివిధ ప్రభుత్వాలు 1984, 2010, 2016, 2018, 2020, 2022 సంవత్సరాలలో ఈ చట్టాన్ని సవరించాయి. వాస్తవానికి, 2010లో ఈ చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి, దాని స్థానంలో మరింత కఠినమైన కొత్త చట్టాన్ని తీసుకువచ్చారు.

ఈ సమస్య కేవలం ఊహాజనితం కాదని గణాంకాలు సూచిస్తున్నాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, కేవలం 2016-2020 మధ్య కాలంలోనే 6,600కు పైగా ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జీఓలు) ఎఫ్‌సీఆర్‌ఏ నమోదులు రద్దు అయ్యాయి. విదేశీ వనరుల నుండి నిధులు పొందుతున్న మొత్తం 52,156 ఎన్‌జీఓలు, ఇతర సంస్థలలో, కేవలం 14,435 సంస్థలు మాత్రమే ప్రస్తుతం క్రియాశీలకంగా ఉన్నాయని మరో గణాంక వివరాలు వెల్లడిస్తున్నాయి. మొత్తం 22,496 సంస్థల నమోదులు రద్దు అయ్యాయి. 15,225 సంస్థలు పూర్తిగా నిష్క్రియంగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం, నమోదు రద్దు అయిన సంస్థలకు ఎఫ్‌సీఆర్‌ఏ కింద విదేశీ విరాళాలను స్వీకరించడం లేదా వినియోగించుకోవడం సాధ్యం కాదు. కాబట్టి, అటువంటి సంస్థలన్నీ తమ నమోదులను తప్పనిసరిగా పునరుద్ధరించుకోవాలి.

### ఉల్లంఘనలకు తార్కాణాలు

2015లో, గ్రీన్‌పీస్ ఇండియా ఎఫ్‌సీఆర్‌ఏ

నిబంధనలను ఉల్లంఘించిందంటూ పలు ఆరోపణలను ఎదుర్కొంది. వీటిలో విదేశీ విరాళాల కోసం నిర్దేశిత బ్యాంకు ఖాతా వెలుపల లావాదేవీలు నిర్వహించడం, విరాళాలను తప్పుగా లేదా తక్కువగా నివేదించడం, పరిపాలనా ఖర్చుల పరిమితిని మించడం, భారతీయ ఎన్‌జీఓలు లేదా కార్యకర్తల న్యాయపరమైన ఖర్చులను భరించడానికి ఒక విదేశీ ఎన్‌జీఓ ఆర్థిక సహాయం అందించడం, ఇతర నియమపాలనకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి. విచారణ అనంతరం, కేంద్ర హోం శాఖ దాని నమోదును నిలిపివేసి, తదుపరి చర్యల కోసం ప్రక్రియను ప్రారంభించింది. అదేవిధంగా, 2025లో లడఖ్‌కు చెందిన స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లడఖ్' (ఎస్‌ఈసీఎంఓఎల్) ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్‌ను కూడా కేంద్ర హోం శాఖ రద్దుచేసింది. దేశవ్యాప్తంగా ఇలాంటి తార్కాణాలు వందల సంఖ్యలో ఉన్నాయి. అయితే, విదేశీ నిధులను పొందే ప్రతి సంస్థా అనుమానాస్పద మైనది కాదని కూడా గుర్తించాలి. భారతదేశంలో అనేక సంస్థలు విదేశీ సహాయంతో ఆసుపత్రులు, పాఠశాలలు, అనాథ శరణాలయాలు, విపత్తు సహాయక చర్యలు, గ్రామీణాభివృద్ధి, పరిశోధన, విద్య, ఆరోగ్య సంరక్షణ సేవలు ఇతర సామాజిక కార్యక్రమాలు వంటి రంగాలలో సేవలందిస్తున్నాయి. ఎఫ్‌సీఆర్‌ఏ ఉద్దేశ్యం చట్టబద్ధమైన కార్యకలాపాలను పరిరక్షించడమే తప్ప వాటిని నిలిపివేయడం కాదు. చట్టబద్ధమైన విదేశీ సహాయాన్ని స్వాగతించడం, అదే సమయంలో విదేశీ నిధుల దుర్వినియోగాన్ని ఏ పరిస్థితుల్లోనూ సహించకపోవడం ప్రభుత్వ ఉద్దేశ్యం. నిబంధనలను పాటిస్తూ, పారదర్శకమైన లెక్కలను నిర్వహించే సంస్థ పట్ల అనుమానానికి తావుండదు. ఎందుకంటే, వ్యక్తులు, సమాజం, ప్రభుత్వాలు.. ఇలా అన్నింటికీ నిధుల అవసరం ఉంటుంది.

**క్రైస్తవ సంస్థలలో గందరగోళం-వ్యతిరేకత**

ఈ చట్టానికి సంబంధించిన సవరణల విషయంలో, చర్చిలేదా క్రైస్తవ సంస్థలే దీనికి లక్ష్యమనే వాదన అత్యంత రాజకీయ వివాదానికి దారితీస్తోంది. వాస్తవానికి, ఎఫ్‌సీఆర్‌ఏ రూపకల్పన ఏ నిర్దిష్ట మతం కోసమూ జరగలేదు. అలాగే ఇందులో ఏ మతం గురించీ ఎక్కడా ప్రస్తావించలేదు. అయితే మతపరమైన కార్యకలాపాలలో నిమగ్నమైన సంస్థలు చట్టం నిర్దేశించిన షరతులకు లోబడి ఉంటేనే విదేశీ విరాళాలను స్వీకరించగలవు. అయితే, గతంలో అనేక సందర్భాల్లో, చర్చిలు, వాటికి అనుబంధంగా ఉన్న సంస్థలు భారతదేశంలోని ధార్మిక విశ్వాసాలతో కూడిన ప్రజలను చట్ట విరుద్ధంగా మతమార్పిడి చేయడానికి విదేశీ నిధులను ఎలా దుర్వినియోగం చేశాయనేది రహస్యమేమీ కాదు. దేశంలోని షెడ్యూల్డ్ ప్రాంతాలలో చట్టాన్ని ఉల్లంఘించి నిర్మించిన అనేక

**పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కొన్ని దేశీయ, విదేశీ శక్తులు ఎలాగైతే గందరగోళ ప్రచారాన్ని వ్యాపింపజేశాయో, అదే విధంగా ప్రస్తుతం కొందరు నీతిబాహ్య మతగురువులు, కుట్రపూరిత చర్చి వర్గాలు, రెచ్చగొట్టే భాయ్‌జాన్‌లు, ఇతర సంస్థలు భారతదేశానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయి. వీటి పట్ల దేశం అప్రమత్తంగా ఉండాలి.**




అక్రమ చర్చిలు, మసీదులు, మదర్సాలు ఇతర మతపరమైన సంస్థల ఉనికి, అలాగే వాటి కార్యకలాపాలు అందరికీ తెలిసిన విషయమే. బహుశా అందుకే దొరికి పోతామనే భయం కేవలం అటువంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాల్లో నిమగ్నమైపోయిన వారి మనసుల్లోనే ఉంటుందేమో! మన దేశంలో, ఏదైనా సంస్థ మతపరమైన, విద్యాపరమైన లేదా సామాజిక సేవా కార్యక్రమాలలో నిజాయతీగా నిమగ్నమై, విదేశీ నిధులను చట్టబద్ధంగా వినియోగిస్తుంటే, కేవలం ఆ నిధులను స్వీకరించినంత మాత్రాన దానిని అనుమానంతో చూడరు. పైగా, అటువంటి సంస్థకు ప్రజల్లో గౌరవం లభిస్తుంది. అయితే, ఒక సంస్థకు ఉన్న మతపరమైన గుర్తింపు దానిని భారతీయ చట్టాలకు అతీతంగా ఉంచదని కూడా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. మనం సరైన మార్గంలో ఉన్నప్పుడు చట్టాన్ని ఎందుకు వ్యతిరేకించాలి? అలాగే, చట్టం పట్ల భయపడుతున్నట్లు నటించడం లేదా ఇతరులను భయపెట్టడానికి దానిని ఆయుధంగా వాడుకోవడం వంటి చర్యలకు ఎందుకు పాల్పడాలి?

**విదేశీ నిధులు-విదేశీ ప్రభావం**


అసలు చర్చ విదేశీ నిధులను అనుమతించాలా లేక నియంత్రించాలా అనే దాని గురించి కాదు, బదులుగా వాటి ద్వారా కలిగే విదేశీ ప్రభావాన్ని అర్థం చేసుకోవడం గురించినది. విదేశాల నుండి వచ్చిన నిధులను ఆసుపత్రిలో రోగికి చికిత్స అందించడానికి, ఆర్థికంగా వెనుకబడిన పిల్లల చదువుకు తోడ్పడటానికి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయం చేయడానికి లేదా శాస్త్రీయ పరిశోధనలకు వినియోగించినట్లయితే అవి మానవ సంక్షేమానికి సాధనాలుగా ఉపయోగపడతాయి. అయితే, అదే డబ్బును దేశంలోని అమాయక ప్రజలను చట్టవిరుద్ధంగా మతమార్పిడి చేయడానికి, దాని సామాజిక నిర్మాణాన్ని ప్రభావితం చేయడానికి, రాజకీయ వాతావరణాన్ని నడిపించడానికి, హింసాత్మక లేదా విధ్వంసక కార్యకలాపాలను ప్రోత్సహించడానికి, లేదా దేశీయ చట్టాలను ఉల్లంఘించడానికి ఉపయోగిస్తే అది ఆమోదయోగ్యం కాదు.

**విదేశీ నిధులను వినియోగించే సంస్థల విధులు**

- ఆ విదేశీ నిధుల పూర్తి మూలాన్ని వెల్లడించాలి.
- స్వీకరించిన నిధులు, చేసిన ఖర్చులకు సంబంధించిన ఖచ్చితమైన వివరాలను అందించాలి.
- నిర్దేశిత బ్యాంకింగ్ విధానాన్ని పాటించాలి.
- విదేశీ విరాళాలను కేవలం నిర్ణీత ప్రయోజనం. ఉద్దేశిత లబ్ధిదారుల కోసమే వినియోగించాలి.
- సంబంధిత పత్రాలు, లెక్కలను సకాలంలో సమర్పించాలి.
- విదేశీ దాతకు, భారతీయ సంస్థకు మధ్య ఏవైనా అనుమానాస్పద ఆర్థిక లేదా రాజకీయ సంబంధాలను దాచకూడదు. నిజమైన పారదర్శకత అంటే ఇదే అవుతుంది.

**అప్రమత్తత అవసరం**


పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కొన్ని దేశీయ, విదేశీ శక్తులు ఎలాగైతే గందరగోళ ప్రచారాన్ని వ్యాపింపజేశాయో, అదే విధంగా ప్రస్తుతం కొందరు నీతిబాహ్య మతగురువులు, కుట్రపూరిత చర్చి వర్గాలు, రెచ్చగొట్టే భాయ్‌జాన్‌లు, ఇతర సంస్థలు భారతదేశానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయి. వీటి పట్ల దేశం అప్రమత్తంగా ఉండాలి. విదేశీ నిధులు దేశంలోకి రావాలి, కానీ అవి భారతీయ చట్టాల పరిధిలోనే రావాలి. సేవలు అందించాలి, కానీ పారదర్శకతతో కూడి ఉండాలి. మతపరమైన లేదా సామాజిక కార్యకలాపాలు జరగాలి, కానీ అవి రాజ్యాంగం, చట్టాల పరిధికి లోబడి ఉండాలి. మన జాతీయ ప్రయోజనాలకు భంగం కలిగించే విదేశీ నిధుల విషయంలో ఎలాంటి వివక్ష, ఒత్తిడి లేదా భయం లేకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఇది సార్వభౌమాధికారం, ఆత్మవిశ్వాసం కలిగిన భారతదేశ విధానం. మనం కోరుకునేది నిధుల రూపంలో వచ్చే "దానం" తప్ప, "దానవుడ్ని" కాదు.



**వినోద్ బన్సాల్**
జాతీయ అధికార ప్రతినిధి, వీహెచ్‌పీ

ఆగస్టు 6న ముంబైలో జరిగిన "ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్" వేదికపై యువతతో సంభాషిస్తూ, అభివృద్ధి చెందిన భారతావనిని నిర్మించడం అనేది కొత్త తరంపై విశ్వాసం, సామాజిక సంవాదం, సాంస్కృతిక విలువల ద్వారా మాత్రమే సాధ్యమని ఆర్‌ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 100కు పైగా నగరాల నుండి 15 నుండి 19 ఏళ్ల వయస్సు గల సుమారు 2,000 మంది హైస్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ సామాజిక, రాజకీయ, ప్రపంచ, విద్య, సాంస్కృతిక పరిస్థితులపై యువతతో అభిప్రాయాలను మోహన్ భాగవత్ పంచుకున్నారు.

**భా**రతీయ దృక్పథం నుండి ప్రపంచాన్ని ఏకం చేయడంలో యువత పాత్రను నొక్కి చెబుతూ, దేశపు కొత్త తరం (జెన్‌జెడ్, జెన్‌ఆల్ఫా) భవిష్యత్తుకు ప్రతినిధులనే స్పష్టమైన సందేశాన్ని అందించారు. వారిని అనుమానంతో చూడటం కాకుండా, వారికి ఆత్మీయత, సంభాషణ, మార్గదర్శకత్వం అవసరం అని అన్నారు. అంతేకాకుండా, జాతీయ భద్రత, విద్యా సంస్కరణలు, ఎల్‌జీబీటీక్యూ వర్గం, మహిళల భాగస్వామ్యం, ఉపాధి, రిజర్వేషన్లు, సుస్థిర అభివృద్ధి వంటి సమకాలీన అంశాలపై సంఘ్ దృక్పథాన్ని ప్రముఖంగా వివరించారు.



**చర్చలోని ముఖ్యాంశాలు**

- యువత దేశ వ్యతిరేకులు కారు. వారి డిమాండ్లు సమంజసమైనవి. వ్యవస్థాగత సంస్కరణలకు చర్చ 'తాము ఇందులో భాగమే' అనే భావన చాలా అవసరం.
- విద్య అనేది వ్యాపారం కాదు. దానిని ఆ విధంగా కాకుండా భిన్నంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. విద్య బడ్జెట్‌కు జీడీపీలో 6% కేటాయించాలనే ప్రతిపాదనకు సంపూర్ణ మద్దతు ఉంది.
- ఎల్‌జీబీటీక్యూ వర్గం మన సమాజంలో అంతర్భాగం. వివాహ వ్యవస్థకు బదులుగా, స్వలింగ జంటల కోసం ప్రత్యేక చట్టపరమైన విధానం ఉండాలి.
- దేశ నిర్మాణంలో పురుషులతో సమానమైన పాత్రను మహిళలు పోషించాలి.
- వివక్ష ఉన్నంత కాలం రిజర్వేషన్లు అవసరం. ఈ అంశాన్ని రాజకీయం చేయకూడదు.
- మానవత్వమే అత్యంత ప్రధానమైనది. పాకిస్థాన్ పౌరులందరూ శత్రువులు కారు. సామరస్యం, చర్చలే అంతిమ లక్ష్యాలు కావాలి.

**యువత - ప్రజాస్వామ్య హక్కులు**

- నీట్ పరీక్షా పత్రం లీక్ ఇతర అంశాలపై యువత చేపట్టిన నిరసనల గురించి ప్రస్తావిస్తూ, వారి ఆవేదన పూర్తిగా సమంజసమైనదేనని భాగవత్ స్పష్టం చేశారు.
- యువత దేశ వ్యతిరేకులు కారు: జెన్ జీ తరానికి చెందిన యువత ఉద్యమాలు లేదా నిరసనలలో పాల్గొంటున్నంత మాత్రాన, వారు దేశ వ్యతిరేకులని అర్థం కాదు. వారు మన సమాజంలోనూ, దేశంలోనూ ఒక భాగం. మన తదుపరి తరానికి వారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

– ఆత్మీయత–సంభాషణ: అర్థవంతమైన,



# నవతరమే..

ఫలవంతమైన సంభాషణకు ఆత్మీయ భావన అత్యవసరం. అటువంటి ఆత్మీయత ఆధారంగా సంభాషణ జరిగినప్పుడు మాత్రమే ఒకరి సమస్యలను మరొకరు నిజంగా అర్థం చేసుకోగలరు. ఇతర అన్ని పరిపాలనా మార్గాలు మూసుకుపోయినప్పుడు, ప్రజాస్వామ్యంలో నిరసనలు, ప్రదర్శనలు సంభాషణకు ఒక చట్టబద్ధమైన మాధ్యమంగా మారతాయి.

**తరాల మధ్య అంతరం-నిజాయితీ**

పూర్వపు తరాలతో పోలిస్తే, నేటి జెన్ జెడ్, జెన్–ఆల్ఫా తరాల వారు మరింత సూటిగా, తార్కికంగా ప్రశ్నలు అడుగుతున్నారు. నవతరం తమ పూర్వీకుల కంటే ఎక్కువ నిజాయితీ కలిగి ఉందని సర్‌సంఘచాలక్ పేర్కొన్నారు. ఒకవేళ ఏ తరాన్ని నమ్మాలనే ఎంపిక వస్తే, తాను జెన్‌జెడ్ తరానికే ప్రాధాన్యత నిస్తామని ఆయన తెలిపారు. మేము జెన్ జెడ్ వయస్సులో ఉన్నప్పుడు మా తరం స్వభావం ఏమిటంటే పెద్దలు చెప్పింది అంగీకరించేవాళ్లం. ప్రశ్నించేవాళ్లం కాదు అని అన్నారు.

**నిరసన కూడా సంభాషణే**

నిరసన కూడా ఒక రకమైన సంభాషణే అని భాగవత్ చెప్పారు. మనం ఇక్కడ కూర్చుని మాట్లాడుతున్నాం. ఇలా అర్థం చేసుకుంటే సరే. మన మధ్య చర్చ జరుగుతుంది. మీకు ఇబ్బంది ఉంటే లేదా నాకు ఇబ్బంది ఉంటే, దాన్ని పరిష్కరించే అధికారం మీ చేతుల్లో లేదా నా చేతుల్లో ఉంటే, అది జరగకపోతే నేను అరుస్తాను అని అన్నారు.

**పెల్లెట్ గన్‌లపై పూర్తి సమాచారం లేదు**

విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ, భాష్పవాయు



# నా విశ్వాసం!

గోళాలు, పెల్లెట్ గన్‌లు వాడిన విషయంపై పూర్తి సమాచారం లేదు. ఈ పరిస్థితి వెనుక కారణాలను చూడాలి. వాస్తవ సమాచారం లేకుండా మాట్లాడలేము. కొన్ని వాస్తవాలు రిపోర్టుల ఆధారంగా మాట్లాడుతున్నాం. ఈ ఉద్యమంలో కొంతమంది సామాజిక వ్యతిరేకులు ఉన్నారని కూడా రిపోర్టులు ఉన్నాయి. కానీ ప్రామాణిక సమాచారం లేకుండా చెప్పలేము అని మోహన్ భాగవత్ అన్నారు. ముందుగా సంభాషణ జరిగి ఉంటే పరిస్థితి తీవ్రమయ్యేది కాదా అని అడిగినప్పుడు జరగకూడని విషయం జరిగితే ఎక్కడో తప్పు ఉండాలి. అందుకే అది జరుగుతుంది. తప్పు ఎవరిది, ఏమిటి అనేది వేరే విషయం. కానీ లోపం ఉంది. దాన్ని సరిదిద్దుతారు. సరిదిద్దాలి అని నేను నమ్ముతున్నాను అని తెలిపారు. 140 కోట్ల దేశజనాభాలో సగానికి పైగా 35 కంటే తక్కువ వయస్సువారున్నారు. 2029 సాధారణ ఎన్నికల నాటికి అతి పెద్ద ఓటు వర్గంగా జెన్ జెడ్ మారనుంది అని అన్నారు.

**విద్యా వ్యవస్థ - నవతరం నిర్మాణం**

విద్యా విధానంలో సమూల సంస్కరణల ఆవశ్యకతను నొక్కిచెబుతూ, విద్య అనేది వ్యాపారం కాదని, అది జీవితానికి అత్యవసరమైన అంశమని, సమాజంలోని చివరి వ్యక్తికి కూడా అది అందుబాటులో ఉండాలని భాగవత్ పేర్కొన్నారు. స్థూల దేశీయ ఉత్పత్తి (జీడీపీ)లో 6 శాతాన్ని విద్య కోసం ఖర్చు చేయాలన్న దీర్ఘకాలిక డిమాండ్‌కు మద్దతు తెలుపుతూ, ఇది పూర్తిగా సమంజసమైనదని, దీనిని అమలు చేయడం సాధ్యమేనని అన్నారు. విద్య అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదని, అది మొత్తం సమాజం సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. సంఘ్‌కు అనుబంధంగా ఉన్న 'విద్యా భారతి' సంస్థ సుమారు 23,000 పాఠశాలలను విజయవంతంగా నిర్వహిస్తుండటం దీనికి ఒక ప్రత్యక్ష నిదర్శనమని తెలిపారు. నాణ్యమైన ఉపాధ్యాయ శిక్షణతోనే విద్యా సంస్కరణలు ప్రారంభం కావాలి. కేవలం పాఠశాలలను నిర్వహించడం లేదా ఆదాయాన్ని ఆర్జించడం విద్య లక్ష్యం కాకూడదు. భావితరాల వారిలో ఉత్తమ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే దాని ప్రధాన ఉద్దేశ్యం. దీనికి ఎల్లప్పుడూ ఏదో ఒక ఉద్యమం అవసరం లేదు. సామాజిక చైతన్యం ద్వారా కూడా సంస్కరణలను సాధించవచ్చని అన్నారు.

**రిజర్వేషన్ గురించి**

రిజర్వేషన్‌ను అనంతకాలం కొనసాగించాలా లేదా తగ్గించాలా అనే ప్రశ్నకు నేరుగా సమాధానం చెప్పను. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రిజర్వేషన్ గురించి ఏమి అనుకున్నారో చూడండి. నిజాయతీగా ఆయన సలహా పాటిస్తే సమస్య ఉండదు. రిజర్వేషన్ సామాజిక కారణాల వల్ల ఉంది. సామాజిక వివక్ష ఉన్నంత కాలం రిజర్వేషన్ కొనసాగుతుంది అని భాగవత్ అన్నారు. రిజర్వేషన్ పొంది పరిస్థితి మెరుగైనవారు ఉదారంగా దాన్ని వదులుకోవాలి. అటువంటి ఆలోచన ఇప్పటికే కొంతమంది లబ్ధిదారుల్లో వస్తోంది. అన్ని సంక్షేమ చర్యలు సరిగ్గా అమలైతే రిజర్వేషన్ అవసరం త్వరగా ముగుస్తుందని తెలిపారు.

**హింసాత్మక కంటెంట్‌కు ఎక్కువ లైక్‌లు!**

నియమాలు చేయడం సరే. కానీ వాటి పట్ల ప్రజల వైఖరి మారితేనే అవి విజయవంతమవుతాయి. చాలా చట్టాలు ఇప్పటికే ఉన్నాయి. సమాజం అంగీకరిస్తేనే చట్టాలు ప్రభావవంతంగా ఉంటాయి. రోల్ మోడల్స్ మారాలి. లక్షలాది మంది అనుచరులు ఉన్న ఇన్ఫ్లుయెన్సర్లు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రామాణిక వనరుల నుంచి సమాచారం ధృవీకరించాలి. ఏదైనా నిషేధిస్తే లోపాలు ఉంటాయి. నిషేధం మాత్రమే పరిష్కారం కాదు. జెన్‌జెడ్ హింసను అంగీకరించదు. అయినా హింసాత్మక కంటెంట్‌కు ఎక్కువ లైక్‌లు ఎందుకు వస్తాయి? దీన్ని ఆలోచించాలి, విశ్లేషించాలి. ఈరోజు సాంకేతికత మన ముఖాలు, స్వరాలు ఉపయోగించి నకిలీ వీడియోలు సృష్టించగలదు. కాబట్టి సామాజిక మాధ్యమాల్లో వచ్చేది ఏదైనా వెంటనే నమ్మకుండా ప్రామాణిక వనరుల ద్వారా దానిని ధృవీకరించాలి అని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ అన్నారు.

**ఎల్‌జీబీటిక్యూ - సమాన లింగ వివాహం**

ఎల్‌జీబీటీక్యూ లేదా ఎలాంటివారైనా మన సమాజంలో భాగం. మన సమాజంలో వారిని ఆదరించే సంప్రదాయం ఉంది. వివాహం అనేది ఇద్దరు కలిసి జీవించడానికి సృష్టించిన సౌకర్యం కాదు. అది కుటుంబాన్ని సృష్టించే సామాజిక సంస్థ. కుటుంబం సమాజ ప్రాథమిక యూనిట్. తర్వాతి తరాలను మంచి పౌరులుగా తయారు చేస్తుంది. ప్రస్తుత వ్యవస్థను భంగపరచి కొత్త వ్యవస్థలు లేకపోతే సంఘర్షణలు వస్తాయి. చట్టాలు సమాజాన్ని నిర్దేశించవు. సమాజం చట్టాలను నిర్దేశిస్తుంది. ముందు సమాజాన్ని సిద్ధం చేయాలి. ఈ దశలో వివాహ వ్యవస్థను మార్చితే ఇతర దుష్పరిణామాలు వస్తాయి. సమాన లింగ వివాహం అని చెప్పకండి. సమాన లింగ సహచరులు ఎలా కలిసి జీవించాలో వ్యవస్థ తయారు చేయాలి. దానికి చట్టం చేయవచ్చు. సమాజం దాన్ని అంగీకరిస్తుంది అని భాగవత్ అన్నారు.

**నేను నాయకుడ్ని కాదు**

నాయకత్వం అంటే ప్రసంగాలు చేయడం, ఎన్నికలు గెలవడం, ప్రజల ముందు నిలబడడం కాదు. నిజమైన నాయకులు వెనుక నుంచి నడిపిస్తారు. లోపలి నుంచి పని చేస్తారు. నేను నన్ను నాయకుడిగా చూడను. కార్యకర్తగా చూస్తాను. నాయకత్వం లక్ష్యం ప్రజలను వెలుగు వైపు నడిపించడం. మరింత మంది నాయకులను సృష్టించడం. నేనే నడిపించడం కాదు. నా నాయకత్వం నాయకులను సృష్టించాలి అని సర్‌సంఘచాలక్ అన్నారు.

**పాకిస్తాన్, చైనాలతో భారత్ సంబంధాలు**

సంఘర్షణ కాలంలో ప్రభుత్వం చేసేదానికి మద్దతు ఇవ్వాలి. దీనికి పాకిస్తాన్ చైనా దేశాలు రెండు ఉదాహరణలు. సంఘర్షణలను ఎదుర్కొంటూ , భేదాలను నియంత్రణలో ఉంచడం అనేది భారతీయ పరిష్కారం. శాశ్వత ద్వేషం పరిష్కారం కాదు. పాకిస్తానీయులంతా మన శత్రువులు కాదు. మానవత్వం ఒక్కటే ఉండాలి అని భాగవత్ అన్నారు.

**ఉపాధి-కార్మిక గౌరవం**

ఉపాధి అంటే ఉద్యోగం మాత్రమే కాదు. వ్యవస్థాపకత్వం, నైపుణ్యాలు కూడా. చేతి పనికి గౌరవం లేదు. కార్మిక గౌరవం తిరిగి సాధించాలి. అందరూ సర్వీస్ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇష్టపడుతున్నారు. చేతి పనులు చేసినా సంపదను సృష్టించవచ్చు. సంపాదించవచ్చు. విలాసవంతమైన జీవితానికి గ్యారంటీ లేదు. కానీ గౌరవప్రదమైన జీవితం సాధ్యమే. చేసే వృత్తి చిన్నదైనా, పెద్దదైనా సమాజం ఆ వృత్తిని, దానిని చేసేవారిని గౌరవించాలి అని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ తెలిపారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

పర్యావరణ పరిరక్షణ దిశగా మార్పు ఇంటి నుంచే మొదలు కావాలి. ప్రభుత్వం వేరే విధంగా ఆలోచిస్తుంది. వారిపై వేరే ఒత్తిళ్లు ఉంటాయి. సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి అని మోహన్ భాగవత్ చెప్పారు.

– జాగృతి డెస్క్

# ధాన్యం లెక్కల్లో

తెలంగాణలో రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన ధాన్యం.. రైస్ మిల్లులకు చేరిన తర్వాత పరిణామాలపై ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోంది. కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం మిల్లర్లకు అప్పగించిన ధాన్యం గల్లంతవడం ఆందోళన కలిగిస్తోంది. ధాన్యం రికార్డుల్లో చూస్తే ఒక లెక్క.. గోదాముల్లో చూస్తే మరో లెక్క కనిపించడం, మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం పేరుకుపోవడం వంటి పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లింగ్ వ్యవస్థపై అనుమానాలను పెంచుతున్నాయి. ఇటీవలి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలతో క్రమంగా అక్రమాలు బయటపడుతున్నాయి. వీటినిబట్టి చూస్తే.. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చినవి మచ్చుకు కొన్ని మాత్రమే అయి ఉంటాయని, రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే పెద్దమొత్తంలో ధాన్యం లెక్క తప్పిందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతి వ్యవసాయ సీజన్‌లో రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఆ ధాన్యాన్ని మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ రైస్ కోసం అప్పగించిన తర్వాత, నిర్దేశిత నిబంధనల ప్రకారం బియ్యంగా మార్చి పౌరసరఫరాల శాఖ లేదా ఎఫ్‌సీఐకి మిల్లర్లు అప్పగించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ సక్రమంగా జరిగితే రైతుల ప్రయోజనం, ప్రభుత్వ ఆహార భద్రతా వ్యవస్థ, ప్రజా పంపిణీ వ్యవస్థ మూడింటికీ భరోసా ఉంటుంది. కానీ మిల్లుల వద్దే ధాన్యం మాయమవుతున్నట్లు తనిఖీల్లో వెల్లడవుతున్న పరిణామాలు.. ఈ వ్యవస్థలోని పర్యవేక్షణ లోపాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో భారీగా ధాన్యం వ్యత్యాసాలు గుర్తించారు. తొలి దశలో ఆరు జిల్లాల్లోనే సుమారు 52 కోట్ల రూపాయల విలువైన సన్నధాన్యం గల్లంతైందని అధికారులు గుర్తించినట్లు తెలిసింది. కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, మెదక్, ములుగు, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని పలు మిల్లుల్లో నిల్వలు, రికార్డులను పరిశీలించగా ఈ వ్యత్యాసాలు బయటపడినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మిల్లుల్లో ఇలాంటి తనిఖీలు జరిగితే అక్రమాల విలువ వేల కోట్ల రూపాయలకు చేరవచ్చని వారి అంచనా. అంతేకాదు.. ఆ తర్వాత కొనసాగించిన తనిఖీల్లో మరిన్ని రైస్ మిల్లుల్లో సీఆర్ఎం అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. ఆ తర్వాత కూడా కొనసాగిన సోదాల్లో ఈ అక్రమాల విలువ దాదాపు 600 కోట్ల రూపాయలకు పైమాటే అని అధికారులు అనుమానాలు వ్యక్తం చేశారు.

### రికార్డుల్లో ధాన్యం.. గోదాములు ఖాళీ

మిల్లింగ్ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడే మార్గాలు చాలానే ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ కేటాయింపుల మేరకు ధాన్యం మిల్లుల్లో ఉన్నట్లు రికార్డుల్లో చూపిస్తూ, వాస్తవానికి కొంత ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ధాన్యం బస్తాల సంఖ్య, తూకాలు, తేమ శాతం, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన వివరాలు, గోదాముల్లోని భౌతిక నిల్వల మధ్య వ్యత్యాసాలు తనిఖీల్లో బయటపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో నాసిరకం ధాన్యంతో మార్పిడి చేయడం, తేమ శాతం పేరుతో అధిక కోతలు చూపడం వంటి ఆరోపణలు కూడా ఉన్నాయి. అంతేకాకుండా మిల్లింగ్ తర్వాత బియ్యం రికవరీ తక్కువగా వచ్చిందని చూపించి, వాస్తవంగా లభించిన బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇలా జరిగితే నేరుగా ప్రభుత్వానికి ఆర్థిక నష్టం కలగడమే కాకుండా, ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరమైన బియ్యం లభ్యతపైనా ప్రభావం పడే ప్రమాదం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

### ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలు

సీఎంఆర్ వ్యవస్థలో ప్రస్తుత సీజన్ అక్రమాలే కాకుండా పాత బకాయిల సమస్య కూడా తీవ్రంగా ఉందని తనిఖీల్లో బయటపడుతోంది. ఉదాహరణకు 2022-23 సంవత్సరానికి సంబంధించిన లెక్కలే చూసుకుంటే.. 10 లక్షల టన్నులకు పైగా బియ్యం ఇంకా రైస్ మిల్లుల నుంచి రావాల్సి ఉందని తెలుస్తోంది. ఈ అక్రమాలు ఎంతో కాలంగా జరుగుతున్నాయనడానికి ఇది నిదర్శనమని అంటున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన రైస్ మిల్లుల నుంచి భారీ మొత్తంలో ధాన్యం బకాయిలు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

అయితే, ఇక్కడే ప్రభుత్వ పర్యవేక్షణపై కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మండల, జిల్లా స్థాయిలో రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు ఎప్పటికప్పుడు



మిల్లుల్లో ధాన్యం నిల్వలు, సీఎంఆర్ బియ్యం రికవరీని పరిశీలించాల్సి ఉంది. కానీ హైదరాబాద్ నుంచి వెళ్లిన విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేపట్టేవరకు భారీ వ్యత్యాసాలు గుర్తించకపోవడం పర్యవేక్షణ వ్యవస్థ పనితీరుపై అనుమానాలకు తావిస్తోంది.

### గత ప్రభుత్వ హయాం నుంచీ ఇదేతీరు?

ప్రస్తుతం అధికారుల తనిఖీల్లో బయటపడుతున్న అనేక అంశాలు ఇప్పుడు మాత్రమే మొదలైనవి కావన్న ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్ బకాయిలు, ధాన్యం నిల్వల్లో వ్యత్యాసాలు, మిల్లర్ల డిఫాల్ట్ వంటి సమస్యలు గత ప్రభుత్వ హయాం నుంచే కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పట్లో అధికారులు ఇలాంటి అక్రమాలను గుర్తించినప్పటికీ


> 2023 నుంచి మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం, తిరిగి వచ్చిన బియ్యం మధ్య తేడాలను పరిశీలిస్తే సుమారు 500 కోట్ల రూపాయల విలువైన దాదాపు 90 వేల టన్నుల ధాన్యం విషయంలో అక్రమాలు జరిగి ఉండొచ్చని రామచందర్ రావు సందేహం వ్యక్తం చేశారు. సీఎంఆర్ ధాన్యం ప్రభుత్వానికి చేరలేదన్న ఆరోపణలపై పారదర్శకంగా, వేగంగా దర్యాప్తు జరిపించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. ధాన్యం కొనుగోలు వ్యవస్థ రైతుల జీవనాధారంతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థకు కీలకమని పేర్కొన్నారు.

# గోల్‌మాల్

పై స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోలేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. ధాన్యం రికార్డులకు, వాస్తవ నిల్వలకు తేడాలు ఉన్నా చర్యలు తీసుకోక పోవడం, ప్రభుత్వ ధాన్యం విక్రయించినా కేసులు నమోదు చేయలేదన్న ఆరోపణలు ఈ విమర్శలకు బలం చేకూరుస్తున్నాయి.

అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ పరిణామాలకు బాధ్యత వహించాల్సిందే అన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.





అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచి పోయినప్పటికీ గత ప్రభుత్వ హయాం నుంచే పేరుకుపోయిన బకాయి లను, అక్రమాలను, మిల్లర్ల వ్యవహారాలను సమీక్షించి ఉంటే, ఇంత పెద్ద మొత్తంలో వ్యత్యాసాలు బయటపడే పరిస్థితి వచ్చేది కాదన్న అభిప్రాయాలు వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం విజిలెన్స్ తనిఖీలను విస్తృతం చేయడం, డిఫాల్ట్ మిల్లర్లపై చర్యలకు సిద్ధమవడం కొంత ఊరట కలిగిస్తున్నా, ఇన్నాళ్లుగా కొనసాగిన పర్యవేక్షణ లోపాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం మాత్రం ప్రభుత్వ పెద్దలపై ఉందంటున్నారు.

### కఠిన చర్యలకు ప్రభుత్వం సిద్ధం?

రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా జరుగుతోన్న మిల్లర్ల అక్రమాల వ్యవహారంపై తాజాగా విజిలెన్స్ నివేదికల నేపథ్యంలో పౌరసరఫరాల సంస్థ కఠిన చర్యలకు సిద్ధమవుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. డిఫాల్ట్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు నిలిపివేయడం, తీవ్రమైన అక్రమాలకు పాల్పడిన వారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించే దిశగా చర్యలు చేపట్టడం వంటి నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, సీఎంఆర్ అక్రమాల వ్యవహారంలో ఇప్పటికే పలుచోట్ల క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రభుత్వ ధాన్యం మళ్లించిన డిఫాల్ట్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటి లెక్కలు మాత్రమే కాకుండా, గత 10 నుంచి 12 ఏళ్ల సీఎంఆర్ కార్యకలాపాలపై ప్రత్యేక ఆడిట్, బకాయిల రికవరీ, బ్లాక్‌లిస్టింగ్, బ్యాంకు గ్యారంటీల అమలు, ఆస్తుల జప్తు, విస్తృత విజిలెన్స్ తనిఖీలు, క్రిమినల్ కేసుల నమోదుపై దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలుస్తోంది. మరోవైపు, భవిష్యత్తులో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు క్యూఆర్ కోడ్ గన్నీ బ్యాగులు, వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్, ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలనే ప్రతిపాదనలు కూడా ప్రభుత్వం ముందు ఉన్నాయి. అయితే, ఇవి కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వీటిని అమలు చేస్తేనే ఇప్పటికైనా ఈ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ సాగుతుందా?

మరోవైపు, విజిలెన్స్ దాడులు ముమ్మరం కావడంతో రాజకీయ జోక్యం మొదలైన సంకేతాలు కూడా కనిపిస్తున్నాయి. కొందరు మిల్లర్లు తమకు దగ్గరగా ఉండే ప్రజాప్రతినిధుల ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విచారణ సంస్థలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం కీలకమని, అలా చేస్తేనే అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట వేయవచ్చని కొందరు అధికారులు అంటున్నారు. రాజకీయ సంబంధాలు, పలుకుబడి, ఒత్తిళ్లతో అక్రమాలపై చర్యలు తీసుకోవడం మానేస్తే, కుక్కతోక వంకర మాదిరిగానే తయారవుతుందన్న సందేహాలు వినిపిస్తున్నాయి. రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి సేకరిస్తోంది. ప్రభుత్వ గోదాములకు చేరాల్సిన ఆ బియ్యాన్ని దారి మళ్లించడం అంటే ప్రజల ఆస్తికి నష్టం కలిగించడంతో పాటు ప్రభుత్వాన్ని మోసం చేసినట్లే భావించాలని అంటున్నారు.

### ముఖ్యమంత్రికి బీజేపీ అధ్యక్షుడి బహిరంగ లేఖ

ఈ మొత్తం వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ పరిణామంతో రైస్ మిల్లుల్లో సీఎంఆర్ అక్రమాల అంశం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. 2023 నుంచి మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం, తిరిగి వచ్చిన బియ్యం మధ్య తేడాలను పరిశీలిస్తే సుమారు 500 కోట్ల రూపాయల విలువైన దాదాపు 90 వేల టన్నుల ధాన్యం విషయంలో అక్రమాలు జరిగి ఉండొచ్చని రామచందర్ రావు సందేహం వ్యక్తం చేశారు. సీఎంఆర్ ధాన్యం ప్రభుత్వానికి చేరలేదన్న ఆరోపణలపై పారదర్శకంగా, వేగంగా దర్యాప్తు జరిపించాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. ధాన్యం కొనుగోలు వ్యవస్థ రైతుల జీవనాధారంతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థకు కీలకమని పేర్కొన్న రామచందర్ రావు, కొనుగోలు, రవాణా, నిల్వ, కస్టమ్ మిల్లింగ్ దశల్లో పర్యవేక్షణ, జవాబు దారీతనాన్ని బలోపేతం చేసే సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై విశ్వాసాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు.

ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ముందు అసలు అగ్నిపరీక్ష ఉందంటున్నారు రాజకీయ విశ్లేషకులు. గతంలో జరిగిన అక్రమాలను నిర్లక్ష్యం చేశారన్న విమర్శలకు ముగింపు పలకడంతో పాటు, ప్రస్తుత పర్యవేక్షణ లోపాలకు కూడా అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైనే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఆడిట్, మిల్లులవారీగా స్టాక్ ధ్రువీకరణ, డిజిటల్ ట్రాకింగ్, క్రమం తప్పని తనిఖీలు, బకాయిల పూర్తి రికవరీ, దోషులపై వేగవంతమైన చట్టపరమైన చర్యల వంటివన్నీ అమలు చేసినప్పుడే సీఎంఆర్ వ్యవస్థపై తిరిగి ప్రజల్లో, ముఖ్యంగా రైతుల్లో నమ్మకం పెరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు.

**సుజాత గోపగోని**

**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**

# నల్లమల రారాజుకు ఆ



**నల్లమల అడవి పేరు వినగానే మనసులో రెండు భావనలు ఏకకాలంలో మెదులుతాయి– ఒకటి గాంభీర్యం, మరొకటి కాస్త భయం. ఎందుకంటే ఇది సాధారణ అటవీ ప్రాంతం కాదు... నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్టీఆర్) పేరుతో దేశంలోనే అతి పెద్ద పులుల అభయారణ్యంగా గుర్తింపు పొందిన రాజ్యం. కృష్ణా, పెన్నా నదుల మధ్య వందల కిలోమీటర్ల పొడవునా పరుచుకున్న ఈ దట్టమైన అరణ్యంలో వందకు చేరువలో పులులు గాండ్రిస్తున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. వందల రకాల పక్షులు, జంతువులు, జలచరాలకు ఆలవాలమైన ఈ అభయారణ్యం చూసేందుకు కనువిందుగా అనిపించినా, లోలోపల ఒక చేదు నిజం దాగి ఉంది. ఈ రాజ్యానికి రాజైన పులికే కడుపు నిండా తిండి దొరకడం లేదు! ఆకలితో అలమటిస్తున్న పులుల్లో కొన్ని వేటగాళ్ల తూటాలకు బలైతే, మరికొన్ని తిండి కోసం ప్రమాదకర జీవులతో తలపడి ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇటీవల వరుసగా సంభవించిన రెండు పులుల మరణాలు ఈ చేదు నిజాన్ని రాష్ట్రం మొత్తాన్ని కుదిపేసేలా బయట పెట్టాయి.**


గత కొద్ది వారాల్లో నల్లమల అడవుల్లో రెండు పులులు మృత్యువాత పడ్డాయి. మార్కాపురం జిల్లా గిద్దలూరు–రాచర్ల అటవీ ప్రాంతంలోని గుండ్లకమ్మ రేంజ్‌లో జులై 31న ఒక పెద్దపులి కళేబరం లభించింది. అది చనిపోయి 35–40 రోజులు గడిచిపోయినట్లు అటవీ అధికారులు అంచనా వేశారు. మరీ దారుణం ఏమిటంటే... ఆ పులి కాళ్లు, గోళ్లు మాయమయ్యాయి! నంద్యాల జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో మరో పులి (టి–66ఎఫ్) మృతి చెందింది. ఈ రెండు మరణాల నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఒక్క పులి ప్రాణం పోయినా అది తీవ్రమైన విషయమేనని, క్షేత్రస్థాయిలో పారదర్శకంగా, వేగంగా దర్యాప్తు చేపట్టాలని అటవీ శాఖను ఆదేశించారు. దీనికోసం ఐదుగురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ క్షేత్రస్థాయి పరిశీలనలో మరో దిగ్భ్రాంతికర విషయం వెలుగులోకి వచ్చింది.

గుండ్లకమ్మ రేంజ్‌లో జరిగిన ఘటనలో ఉచ్చులో చిక్కుకున్న పులిని కొందరు దుండగులు నాటు తుపాకీతో కాల్చి చంపి, గోళ్లను అక్రమ వ్యాపారం కోసం ఎత్తుకెళ్లినట్లు తేలింది. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత స్థాయి కమిటీ (హెచ్ఎల్‌సీ) ఛైర్మన్ మల్లికార్జునరావు మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని నిర్ధారించారు. పోలీసులు, అటవీశాఖ సంయుక్తంగా చేపట్టిన దర్యాప్తులో ఏడుగురు వేటగాళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఏడు గోర్లు స్వాధీనం చేసుకున్నారు. పులి పంజాలో ముందుభాగంలోని కాళ్లకు ఐదేసి చొప్పున 10 గోర్లు, వెనుక భాగంలో నాలుగు చొప్పున 8 గోర్లు ఉంటాయి. అంటే మొత్తం 18 గోర్లు ఉంటాయి. మరి ఏడు గోళ్లు దొరికితే మిగిలిన వాటి సంగతి తేలాల్సి ఉంది. మరోవైపు దాదాపు పది రోజులుగా పులి కళేబరం అక్కడ పడి ఉన్నా గుర్తించలేకపోవ డానికి అటవీ శాఖ సిబ్బంది నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది.

దీంతోపాటు ఈ ఘటనలో ఇంకా ఇతరుల ప్రమేయం, అటవీ సిబ్బంది పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగు తున్నట్టు సమాచారం. మొత్తానికి నల్లమలలో వేటను నిలువరించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాల్సిన అవసరం కనిపిస్తోంది. ఇదిలా ఉంటే, గత ఏడాది నాలుగో దశ పులుల గణనలో నమోదైన 9 పులులు, ఒక కూన ప్రస్తుతం ఆచూకీ లేకుం డా పోయాయంటున్నారు. ఇవి కూడా వేటగాళ్ల బారిన పడ్డాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లోపాలు కూడా ఈ సందర్భంగా బయటపడ్డాయి. వన్యప్రాణుల కదలికలను గుర్తించేందుకు రూ.10 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన అత్యాధునిక థర్మల్ డ్రోన్ వాడకుండా మూలనపడేసినట్లు తేలింది. దీంతో వారానికోసారి కెమెరా ట్రాప్ నివేదికలు తప్పనిసరి చేస్తూ, కొత్తగా 25 బేస్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కమిటీ సిఫారసు చేసింది. సిబ్బంది తప్పనిసరిగా స్థానికంగా నివసించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని కూడా హెచ్చరించారు.

నంద్యాల జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో మరణించిన పులి (టి–66ఎఫ్) పైనా కమిటి విచారణ చేపట్టింది. అయితే ఈ మరణం వెనుక వేటగాళ్ల హస్తం లేదని విచారణలో తేలింది. ఆకలికి తట్టుకోలేక ఆహారం కోసం ముళ్లపందిని వేటాడేం దుకు ప్రయత్నించిన ఆ ఆడపులికి ముళ్లు గుచ్చుకుని తీవ్రంగా గాయపడింది. ఆ గాయాలతోనే క్రమేపీ శక్తి కోల్పోయి, కృశించిపోయి ప్రాణాలు వదిలింది. పులి శరీర భాగాలన్నీ భద్రంగానే లభించడంతో ఇది సహజ మరణమేనని అధికారులు స్పష్టం చేశారు. అయితే ఈ మరణం వెనుక ఉన్న అసలు కారణం మాత్రం మరింత లోతైన సమస్యను ఎత్తిచూపు తోంది.. అదే ఆహార కొరత!

తూర్పు కనుమల్లో భాగం నల్లమల అడవులు. ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం, నంద్యాల, పల్నాడు జిల్లాలతో పాటు తెలంగాణలోని నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాల పరిధిలో 5,725 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇందులోని కొండలనే నల్లమల కొండలు అంటారు. ఈ నల్లమల కొండల సరాసరి ఎత్తు 520 మీ. వీటిలో 923 మీ. ఎత్తుతో భైరానీ కొండ, 903 మీటర్ల ఎత్తుతో గుండ్ల బ్రహ్మేశ్వరం కొండ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ కొండలు, లోయలల్లో దట్టమైన అడవుల్లో పులులు సమృద్ధిగా ఉండటం వలన ఈ ప్రాంతాన్ని టైగర్ రిజర్వ్‌గా ప్రకటించారు. ఇది మన దేశంలోనే అతి పెద్ద పులుల సంరక్షణా కేంద్రం. ఒక్కడ 89 పులులు ఉన్నట్లు లెక్కించారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్





# కలి కష్టాలు!

### ఆకలికి అసలు కారణం


నిపుణుల ప్రకారం నల్లమల అభయారణ్యంలో పులులు, చిరుతలకు యాభై రోజులకు ఒక్కసారి కూడా తగినంత వేట లభించడం లేదు. దీంతో అవి తరచూ అటవీ సరిహద్దు గ్రామాల్లోకి వచ్చి పశువులు, ఇతర సాధు జంతువులను వేటాడాల్సి వస్తోంది. ఇది మనిషి–వన్యప్రాణి సంఘర్షణకు, ప్రమాదాలకు, పులులు వేటగాళ్ల కంట పడేందుకు దారితీస్తోంది. వాస్తవానికి గతంలో వన్యప్రాణుల సంతతిని పెంచేందుకు పచ్చర్ల, తెట్టగుండం, పెద్దపెంట వంటి ప్రాంతాల్లో ప్రత్యేక ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేశారు. బయటి నుంచి తెచ్చిన జింకలు, దుప్పులను వీటిలో ఉంచి, స్థానిక వాతావరణానికి అలవాటు చేశాక అడవిలోకి వదిలేవారు. కొన్నాళ్లు ఈ ప్రక్రియ సజావుగా సాగినా తర్వాత అధికారుల నిర్లక్ష్యంతో అది మూలపడింది. నల్లమలలో పచ్చిక మైదానాలు తక్కువగా ఉండటం, ముదురు గడ్డి, పొదలే ఎక్కువగా ఉండటంతో అవి జింకలు, దుప్పులకు ఆహారంగా పనికిరావడం లేదు. దుప్పులు, జింకలు ఎక్కువగా లేత పచ్చికను మాత్రమే మేతగా తీసుకుంటాయి. దాంతో అవి నల్లమల నుంచి బయటకు వెళ్లిపోతున్నాయి. దీనితో పులులు ఆకలితీర్చుకోవడానికి సమీప గ్రామాల్లోకి రావడం వేటగాళ్ల ఉచ్చులో పడిపోవడం జరుగుతోంది.

### పరిష్కారం వైపు అడుగులు

ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం పులుల ఆహార సమతుల్యతను పునరుద్ధరిం చేందుకు కొత్త ప్రణాళికతో ముందుకు వచ్చింది. అదే అడవి దున్నల పెంపకం. నల్లమలలో ముదురు గడ్డి, పొదలే ఎక్కువగా ఉన్నాయి. అడవి దున్నలయితే ముదురు గడ్డిపొదలను బాగా తింటాయి. ఆ తర్వాత అక్కడ లేత గడ్డి కూడా వస్తుంది అది దుప్పులు, జింకలకు ఆహారంగా మారుతుంది. దాంతో అవి నల్లమల నుంచి బయటకు వెళ్లకుండా ఇక్కడే ఉండే అవకాశం ఉంటుంది. దాంతో పులులతోపాటు ఇతర మాంసాహార జంతువులకు ఆహారం దొరుకు తుందని అటవీ అధికారుల ఆలోచన. బ్రిటిష్ కాలంలో నల్లమలలో అడవి దున్నల సంఖ్య ఎక్కువగా ఉండేది. ఆ తర్వాత వాటికి జబ్బులు రావడం, సరైన ఆవాసాలు లేకపోవడంతో క్రమేపీ వాటి సంఖ్య తగ్గింది. అందువల్ల మధ్యప్రదేశ్ నుంచి 50 అడవి దున్నలను తీసుకువచ్చి గిద్దలూరు నల్లమలలో ఉన్న గుండ్ల బ్రహ్మేశ్వరం చుట్టూ నలభై కిలోమీటర్ల పరిధిలో ఉంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మధ్యప్రదేశ్ నుంచి కొన్ని అడవిదున్నలను మూడు విడతలుగా నల్ల మలకు తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. శాకాహార జంతువుల సంఖ్య పెరిగితే పులులు అడవి దాటి బయటికి రావాల్సిన అవసరం తగ్గి, సహజ సిద్ధమైన వేట అందుబాటులోకి వస్తుందన్నది ఈ లక్ష్యం వెనుక ఉన్న ఆలోచన. నల్లమల పులుల సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం విస్తృత కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. యాంటీ పోచింగ్ క్యాంపుల సంఖ్యను 89 నుంచి 150కి పెంచడం, డ్రోన్లు, కెమెరా ట్రాప్‌లు, ఎం–స్ట్రైప్స్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించడం, 'హనుమాన్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టడం ఇందులో భాగం. జన్యుపరమైన వైవిధ్యాన్ని పెంపొందించేందుకు మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి రెండు, మధ్యప్రదేశ్ నుంచి మరో రెండు ఆడపులులను తరలించేందుకు కేంద్రం సూత్రప్రాయ ఆమోదం తెలిపింది.

### ముందున్న సవాలు

నల్లమల టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని గణాంకాలు గర్వంగా చెబుతున్నప్పటికీ, ఆ సంఖ్యను కాపాడుకోవడంలో ఎదురవుతున్న సవాళ్లు అంతే తీవ్రంగా ఉన్నాయి. అడవిదున్నల తరలింపు వంటి చర్యలు దీర్ఘకాలిక పరిష్కారానికి ఒక ముందడుగే అయినప్పటికీ... క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థను పటిష్టం చేయడం, అవినీతిని అరికట్టడం, కేటాయించిన నిధులు సద్వినియోగం కావడం లాంటి అంశాలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఎన్ని ఆధునిక పరికరాలు తెచ్చినా, ఎంత భారీ బడ్జెట్ కేటాయించినా వాటిని సద్వినియోగం చేసేది మనుషులే. చివరకు నల్లమల అడవుల్లో పులి గాండ్రింపు నిరంతరాయంగా మార్మోగాలంటే... ప్రతి పులి కడుపునిండా తిండి తినే హక్కుకు ప్రభుత్వం, ప్రజలు హామీ ఇవ్వాల్సిందే. ★



భాగం-49

# మార్క్సిజం-శ్రీరామరాజ్యం



## ప్రజాస్వామ్యంలో రాజసత్త-3

**రాజనీతి శాస్త్రానికి చెందిన అనేక వాదాలలో ఏకసత్తావాదం ఒకటి. దీనిని అనుసరించి ఒకే ప్రదేశానికి చెందిన వ్యక్తుల సమూహానికి సర్వోచ్ఛ సత్తాధారి (అధికారం కలిగినవాడు) అయిన ఒకే ఒక వ్యక్తి లేదా సంస్థ ఉంటుంది. అందరు పౌరులూ, సంస్థలూ కూడా ఈ సత్తాధారిక సంస్థకు అధీనమై ఉండాలి.**

**కాం**ట్ వాదన ఏమిటంటే, పౌరుడు తన కర్తవ్యాలను నిర్వర్తిస్తే, అధికారులు అతనిని అనుసరిస్తారు. వ్యక్తివాదుల ప్రకారం అధికారికి ప్రాధాన్యత ఉంది; కానీ కాంట్ అభిప్రాయంలో కర్తవ్యానికే ప్రాధాన్యత ఉంది. వ్యక్తివాదులు స్వేచ్ఛగా చేసే పనినే స్వతంత్రత అంటారు; కానీ కాంట్ నైతిక నియమాల ప్రకారం జీవనం సాగించడం ద్వారానే స్వతంత్రత సాధ్యం. మద్యపానం, జూదం వంటి నైతికతకు విరుద్ధమైన ప్రవర్తనను స్వతంత్రత అని పిలవలేమని ఆయన అన్నాడు.

వ్యక్తివాది మిల్ ప్రకారం, 'మద్యపానం వంటివి కూడా వ్యక్తి స్వాతంత్ర్యంలో ఆమోదయోగ్యమైనవి.' కానీ కాంట్ ఇలా అంటాడు: 'వ్యక్తి సమాజానికి మూలం; అతనిలోనే లోపం ఉంటే, ఆ లోపం మారాకులు, కొమ్మలు వేసి వ్యాపించకుండా ఆపలేము. అందువల్ల వ్యక్తి చేసే అనైతికమైన పనులను పూర్తిగా నిషేధించాలి. రాజ్యం ద్వారా మనిషి నైతిక నియమాలను అనుసరించేలా చేయవచ్చు.'

శక్తి విభజనను ఆమోదిస్తూనే, కాంట్ చట్టసభను రాజ్యంలో ప్రధానంగా భావించాడు. అతను సామంతులు, మతాల భూసంబంధిత ఏకస్వామ్యానికి కూడా వ్యతిరేకి. ఆయన అభిప్రాయం ప్రకారం, 'మనిషి వివేకం, నైతికత పూర్తి వికాసం రాష్ట్ర సమాఖ్య ద్వారానే సాధ్యం. స్థిరమైన శాంతి అనేది మానవ పురోగతికి అత్యంత అవసరం.' అయినప్పటికీ, కాంట్ ప్రకారం, 'రాజ్యం పాలితుల సమ్మతిపై ఆధారపడాల్సిన అవసరంలేదు.' అతని వాదన ఏమిటంటే, రాజ్యం శక్తి ద్వారా జన్మించింది, సామాజిక ఒడంబడిక (సోషల్ కాంట్రాక్ట్) ద్వారా కాదు. అతను రూసోలాగే 'సామాన్య ఇచ్ఛ'కు మద్దతిచ్చాడు.

కానీ అతని దృష్టిలో ప్రత్యక్ష ప్రజాస్వామ్య విధానాన్ని ఆశ్రయించడం తప్పని సరి కాదు. ఒక వ్యక్తి కూడా దానికి ప్రతినిధిగా ఉండవచ్చు. కాంట్ చెప్పిన సర్వమానస తత్వం వేదాంతుల స్వచ్ఛమైన అఖండ బోధామయ బ్రహ్మతో సమానం. 'వివేకమే తత్వ నిర్ణయానికి మూలాధారం' అని కాంట్ భావించాడు.

కాంట్ చేసిన ఈ వాదన నిస్సందేహంగా విలువైనది. వివేకానికి సంప్రదాయం, అపౌరుషేయ లేదా దైవిక - ఆర్ష శాస్త్రాలను సమాశ్రయించడం అవసరం. వివేక సామగ్రి లేకుండా వివేకం విఫలమవుతుంది. సాధారణ విషయాలలో ప్రజాస్వామ్యం ద్వారా వివేకాన్ని ఉపయోగించవచ్చు; కానీ ప్రత్యేక విషయాలలో ఆయా రంగాల నిపుణుల ద్వారానే వివేకం విజయవంతంగా ఉపయోగపడుతుంది.

ఈ విధంగా వివేకంతో నిర్ణయించిన నియమాల ద్వారా ఇచ్ఛలను నియంత్రించడం - సంచాలనం చేయడం, వ్యక్తి - సమష్టి సర్వకల్యాణానికి కారణమవుతుంది. ఈ నియంత్రణ స్వతంత్రతకు సహాయకరమే, అడ్డంకి కాదు. తల్లిదండ్రులు, గురువుల ద్వారానే సరైన నియంత్రణ సాధ్యమవుతుంది. శిక్షణ ద్వారానే మానవుడు విద్వాంసుడు, బలవంతుడు, ధనవంతుడై స్వతంత్ర సుఖాన్ని అనుభవించగలడు. నియంత్రణ లేని, అల్లరి చేసే బాలుడు సాధారణంగా ప్రాయవశాన మూర్ఖుడిగా మిగిలి, బంధనాలలో చిక్కుకుని పరతంత్రతలోనే ఉంటాడు. వ్యక్తుల సమూహమే సమష్టి. కాబట్టి, వ్యక్తి పతనం సమష్టి పతనానికి కారణమవుతుంది.

ఒక గ్రామ నాయకుడు తన గ్రామస్తులతో ఇలా అన్నాడని చెప్తుంటారు : 'ఈ రాత్రి అందరూ ఒక కుండలో పాలుపోయండి.' గ్రామస్తులు అంగీకరించారు; కానీ పోసే సమయంలో ఒక వ్యక్తి మనసులో ఇలా అనుకున్నాడు: 'అందరూ పాలు పోస్తారు కదా, నేను పాల బదులు నీళ్లు పోస్తే ఎవరికి తెలుస్తుంది?' దైవవశాత్తూ, పాలు పోసే సమయానికి అందరి మనసులోనూ ఇదే ఆలోచన వచ్చింది. ఫలితంగా, అందరూ కుండలో నీళ్లు మాత్రమే పోశారు, ఎవరూ పాలు పోయలేదు. కుండ స్వచ్ఛమైన నీరుతో మాత్రమే నిండిపోయింది. సరిగ్గా ఇదేవిధంగా, వ్యక్తుల చెడు, సమష్టి సమాజంలో చెడును తెస్తుంది, వ్యక్తిలోని మంచి సమష్టిలో మంచిని తెస్తుంది.

అందువల్ల, వ్యక్తి-సమష్టిల పరస్పర విరోధం లేని సమన్వయమే రెండింటికీ కల్యాణ కారణం అవుతుంది. భారతీయ రాజనీతి శాస్త్రాల ప్రకారం, వ్యక్తి-పాలకుడు లేదా సమష్టి-పాలకుడు ఈశ్వరునికి ప్రతీకగా ఉంటాడు. అందువల్ల అతనిలో తదనుసారమైన అంశలు, ఈశ్వరీయ గుణాలు - శక్తులు తప్పనిసరిగా ఉండాలి. అయినప్పటికీ, మత్స్య న్యాయం (బలవంతుడు బలహీనుడిని ఆక్రమించే స్థితి)వల్ల బాధపడుతున్న ప్రజలు శాంతి - సువ్యవస్థ కోసం రాజును ఎన్నుకున్నారు. కనుక, అతను ప్రజలపై బలవంతంగా రుద్దినవాడు కాదు. అందుకే అతని కార్యాలలో వివేకానికి ప్రాధాన్యత ఉన్నప్పటికీ, ప్రజాసమ్మతిని - ప్రజాసమర్థనను ఎన్నటికీ విస్మరించకూడదు. అసమర్థుడు, అవివేకి, శౌర్యం, వీరత్వం లేనివాడి చేతుల్లోకి పాలన వస్తే రాజ్యానికి హాని కలుగుతుంది-'వీరభోగ్యా వసుంధరా'-శక్తివంతుడు మాత్రమే భూమికి అధిపతి కాగలడు- 'నావిష్ణుః పృథివీపతిః' (దేవీ భాగవతం).

**హిందీమూలం : కరపాత్రీ స్వామి**
**అనువక్త : నేతి సూర్యనారాయణశర్మ**

ఆగస్ట్ 21 వరలక్ష్మి వ్రతం

# శుభాలరాశి... 'వరాల'తల్లి



**సకల సౌభాగ్యాలకు అధిష్ఠాన దేవత మహాలక్ష్మి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో అర్చించే విశిష్ట పర్వదినం వరలక్షీ వ్రతం. ఇది, ఒకే పూజతో అష్టలక్ష్ముల అనుగ్రహం పొందే వ్రతరాజంగా ప్రసిద్ధమైంది. శ్రావణ శుక్రవారాలకు మకుటాయమానం. శ్రావణ పున్నమికి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతాన్ని ఆచరించాలని 'వ్రతరత్నాకరం' పేర్కొంటోంది. ఆనాడు చిన్నపెద్ద, ధనికపేద భేదం లేకుండా ముత్తయిదువలు శక్తికొద్దీ అత్యంత భక్తిభావనతో ఈ వ్రతం చేసుకుంటారు.**

శ్రావణమాసంలో మంగళ, శుక్రవారాలను పరమపవిత్రమైనవిగా భావిస్తారు. కన్యలు, కొత్తగా పెళ్లయిన వారు మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు. లక్ష్మీదేవికి శుక్రవారం ప్రీతికరమట. అందులోనూ శ్రావణ శుక్రవారాలంటే మరింత ఇష్టమట. అమృతం కోసం దేవదానవులు పాలకడలిని చిలికిన వేళ శుక్రవారం నాడు అవతరించిన అమ్మవారిని విష్ణుపురాణం 'విశ్వమాత'గా అభివర్ణించింది.

'వరం' అంటే శ్రేష్ఠమైన, 'లక్ష్మి' అంటే సకల శుభలక్షణాలుగల దేవత. ఆమె కరుణా కటాక్షాలతోనే సకల శుభాలు ప్రాప్తిస్తాయని విశ్వాసం. వాక్కు, సంపద, మంగళానికి అధిష్ఠానదేవతలైన సరస్వతి, లక్ష్మి, పార్వతి విడదీయలేని, విడదీయరాని దివ్య శక్తులు. వారి సమ్మిళత శక్తి స్వరూపం వరలక్ష్మి వ్రతం బహుళార్ధ సాధకమని సూత మహర్షుల వంటి వారి ఉపదేశం.

స్త్రీల సౌభాగ్య, సంతానాభివృద్ధిని కాంక్షించిన పార్వతీదేవి, వాటి సుస్థిరతకు మార్గం ఉపదేశించ వలసిందిగా, పతి పరమేశ్వరుడిని ప్రార్థించగా, ఆయన వరలక్ష్మీ వ్రతాన్ని ప్రబోధించాడని ప్రాచీన గ్రంథాలు పేర్కొంటున్నాయి. నాటి మగధ రాజ్యంలోని కుండినంబి అనే పట్టణంలో చారుమతి అనే గృహిణి ఈ వ్రతాన్ని ఆచరించి సకల సౌభాగ్యాలు పొందిందని భవిష్యోత్తర పురాణం చెబుతోంది. చారుమతి (మంచి బుద్ధి కలది) పేరకు తగినట్లే, నిర్మల స్వభావు రాలు. కుటుంబంపై అపార ప్రేమకలిగి, నిరంతరం లక్ష్మీదేవి నామస్మరణలో ఉండేది. శ్రావణ పున్నమికి ముందు వచ్చే శుక్రవారం వ్రతం ఆచరించే వారికి ప్రసన్నురాలనవుతానని అమ్మవారు ఆమెకు కలలో కనిపించి ఆశీర్వదించిందని, ఆమె కుటుంబ పెద్దలను సంప్రదించి, వారి ఆమోదంతో సాటి మహిళలతో వ్రతం ఆచరించినట్లు వ్రతకథ వివరిస్తోంది. అమ్మవారి ఆనతి మేరకు చారుమతి తోటి ముత్తయిదువులతో కలసి శ్రద్ధా భక్తులతో పూజించి, ఆత్మప్రదక్షిణకు ఉపక్రమించింది. మూడు ప్రదక్షిణలకుగాను వారికి వరుసగా, బంగారు గజ్జెలు, హస్తకంకణాలు సహా సర్వాభరణాలూ లభించాయటుట. అడగకుండానే ఐశ్వర్యాన్ని ప్రసాదించిన 'అమ్మ'ను నిరంతరం పూజించాలన్న ఆకాంక్షే 'వ్రతం'గా మారిందనీ అంటారు. ధనం, ధాన్యం, సౌభాగ్యం, సంతానం, కీర్తి, ఆయుష్షు లాంటి సకల సంపదలు లక్ష్మీదేవి ప్రతిరూపాలు. వాటిని సుస్థిరంగా కొనసాగించాలన్న తమ ఆకాంక్షలను వరలక్ష్మి అమ్మవారు సాకారం చేస్తారని స్త్రీమూర్తుల విశ్వాసం.

'వరలక్ష్మిని ఒక్కసారి పూజించడమే కాదు... జీవితాంతం వ్రతం ఆచరిస్తూనే ఉంటాను' అని తొలిపూజనాడు చేసే ప్రమాణం కారణంగానే వరలక్ష్మీ 'పూజ' వరలక్ష్మీ 'వ్రతం'గా మారిందని చెబుతారు.

**వ్రతవిధానం**


ఈ వ్రతం అమ్మవారి ధ్యాన ఆవాహనలతో ప్రారంభమై షోడశోపచార పూజ,అంగపూజ, అష్టోత్తరశత/సహస్ర) నామాలతో కొనసాగి, వ్రతకథతో పరిసమాప్తమవుతుంది. ఇది వ్రతం కనుక శాశ్వత విగ్రహం కాకుండా, పాత్ర (బిందె/కలశం) మీద కొబ్బరికాయను పెట్టి, ఆసీనురాలైన లక్ష్మీదేవిలా ప్రతిమను సిద్ధం చేసుకోవాలి. గణపతి /విష్వక్సేనులను పంచోపచారాలతో (స్నానం, అర్చన, నైవేద్యం, ప్రదక్షిణం, నమస్కారం) అర్చించి, అమ్మవారిని ఆ కలశంలోకి విధివిధా నాలతో అవాహనం చేస్తారు. సప్తమాతృకలను పూజిస్తూ (కౌమారి పూజ)వారిలో ఒకరైన స్కందమాతను ప్రధానంగా అర్చిస్తారు. వ్రతకర్తలు ముత్తయిదు వులకు...

**'ఇందిరా ప్రతిగృహ్ణోతి ఇందిరా వై దదాతి చ!**
**ఇందిరా తారికా ద్వాభ్యామ్ ఇందిరాయై నమో నమః'**

(తోటి ముత్తయిదువా! ఈ వ్రత పరిసమాప్తితో మనిద్దరం లక్ష్ములమే. మనందరిలోనూ, మన చేతి తోరాల్లోనూ లక్ష్మి ఉందని గ్రహించాను. లక్ష్మీ స్వరూపిణీవై దీనిని స్వీకరించు) అని వాయనం ఇస్తారు. ఆషాఢంలో పుట్టినింట ఉండే నవవధువులు శ్రావణం ప్రవేశించాక, మొదటి మంగళవారం నోము పుట్టింటనే జరుపుకుని మెట్టినింట వరలక్ష్మి వ్రతం జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. ఈ మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేస్తే దీర్ఘ సుమంగళీయోగం, అష్టైశ్వర్యాలు లభిస్తాయని విశ్వసిస్తారు.

కోరికలు తీర్చే సర్వభీష్టప్రదాయిని వరలక్ష్మీదేవి. అయితే ఆమె కరుణా కటాక్షాలు ఆయా వ్యక్తుల తీరుతెన్నులపై ఆధారపడి ఉంటాయుట. సదాచారాపరాయణత, స్త్రీలు మన్ననలు అందుకునే చోటు, కన్నవారిని గౌరవించడం, బంధుప్రీతి, శుచీశుభ్రత పాటించడం, తులసీ తదితర మంగళకర వస్తువులు, మంగళవాద్యాలు, దీపకాంతులు, సర్వ దేవతలను అర్చించే స్వరం, ఆనందం, ఉత్సాహం, క్రమశిక్షణ, కార్యశూరత్వం, సమయపాలన వంటి లక్షణాలు కల ప్రదేశాలలో అమ్మవారు నివసిస్తారట.

'సర్వ మంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే
శరణ్యే త్ర్యంబకే దేవీ నారాయణీ నమోస్తుతే'



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్



# ఏ వెలుగులకీ ప్రస్థానం?

## 2

ఆ మర్నాడు ప్రియ తన స్నేహితురాళ్లతో పిక్‌నిక్‌కి వెళ్లింది. ఆ ఊరికి దగ్గర్లోనే ఉన్న అడవిలోని జలపాతం దగ్గరికి వెళ్లారు. వెళ్లేముందు శ్రీధర్, కౌసల్య కూతురు ప్రియకు ఎన్నో జాగ్రత్తలు చెప్పారు. అయినా ప్రతి గంటకు ఆమెతో ఫోన్లో మాట్లాడుతూనే ఉన్నారు. చివరకు ప్రియ కోపంతో 'మాట్లాడవద్దు' అని అమ్మానాన్నలకు చెప్పడంతో ఫోన్ చేయడం మానేశారు..

సాయంత్రం ఆరు గంటలకు పిక్‌నిక్ నుంచి వచ్చింది ప్రియ. ఎప్పుడు ఆమె బయటకు వెళ్లినా ఇంటికి రాగానే, అక్కడ జరిగిన విషయాలన్నీ తనతో ఏకరవు పెట్టే ప్రియ...ఆ రోజు ముభావంగా ఉండటం చూసి ఆశ్చర్యపోయింది కౌసల్య.

ఆమెకు కూల్‌డ్రింక్ ఇస్తూ "ప్రియా! డల్‌గా కనిపిస్తున్నావు? ఒంట్లో బాగుండలేదా?" అడిగింది కౌసల్య.

"బాగానే ఉంది అమ్మా" ముభావంగా చెప్పింది ప్రియ.

"పిక్‌నిక్ బాగా జరిగిందా? అక్కడేం చూశారు? భోజనాలు బాగున్నాయా?" అడిగింది కౌసల్య ..కూతురుని ఉత్సాహపరచాలన్న ఉద్దేశ్యంతో.

"బాగానే జరిగింది" అని చెప్పి లోపలికి వెళ్లిపోయింది.

"ప్రియా! ఏమిటా పరధ్యానం? పిక్‌నిక్ గురించి, భోజనాల గురించి నేనడుగు తుంటే ఏమీ మాట్లాడ కుండా వెళతావేంటి?" కోపంగా అడిగింది కౌసల్య.

"అమ్మా! నాకు కొద్దిగా తలనొప్పిగా ఉంది. తగ్గిన తర్వాత అన్నీ చెబుతానులే" అని గదిలోకి వెళ్లి మంచం మీద పడుకుంది .

కూతురు ప్రవర్తన కౌసల్యకి వింతగా అనిపించింది. ఏం జరిగిందో అక్కడ? నలుగురు స్నేహితురాళ్లు కలిస్తే గొడవలు,పోట్లాటలు జరుగుతుంటాయి. ప్రతి దానికి వాదులాడుకుంటూ ఉంటారు. ఏదో అక్కడ గొడవ జరిగే ఉంటుంది. తరువాత అదే చెబుతుంది" అనుకుని తన పనిలో మునిగిపోయింది కౌసల్య.

సాయంత్రం శ్రీధర్ ఇంటికి వస్తూనే,"ప్రియ వచ్చిందా?" ఆతృతగా అడిగాడు భార్యను.

"ఆ! గంట క్రితమే వచ్చింది. ఎందుకో డల్‌గా ఉంది. ఏం అడిగినా చిరాకుపడుతోంది" చెప్పింది కౌసల్య.

"ఎక్కడుంది అది?" అడిగాడు.

"గదిలో పడుకుంది. లేస్తే కాఫీ ఇద్దామని చూస్తున్నాను" చెప్పింది కౌసల్య.

శ్రీధర్ ఆమె గదిలోకి వెళ్లి "ప్రియా! లేమ్మా. చీకటి పడుతోంది" అన్నాడు.

"నేను మేల్కొనే ఉన్నాను నాన్నగారూ!" అంది ప్రియ కళ్లు నులుముకుంటూ.

"మరి పడుకున్నావెందుకు? ఒంట్లో బాగుండ లేదా?" అడిగాడు.

"కొంచెం నలతగా ఉంది" అంది.

"లేచి ముఖం కడుక్కో. పడుకుంటే మరింత డల్‌నెస్ వస్తుంది" అన్నాడు ఆమె చెయ్యి పట్టు కుంటూ. ప్రియ లేచి పెరట్లోకి వెళ్లింది. అక్కడ కుండీలోని నీటితో ముఖం కడుక్కొని తువ్వాలుతో తుడుచుకుంది.



**‘జాగృతి’ నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

“ప్రియా! కాఫీ” కౌసల్య పిలిచింది.

“నేను కాఫీ తాగను అమ్మా” అంటూ ప్రియ డాబా మీదకు వెళ్లడానికి మెట్లు ఎక్కసాగింది.

“ఏవండోయ్! మీ కూతురు కాఫీ తాగనంటోంది. మీరే పట్టుకెళ్లి తాగించండి. ఇవాళ దాని మూడ్ బాగున్నట్లు లేదు” భర్తను పిలిచి ఇచ్చింది కౌసల్య.

శ్రీధర్ ఆలోచిస్తూ కాఫీ గ్లాసు పట్టుకొని డాబా ఎక్కాడు. డాబా విశాలంగా ఉంది. అక్కడ నుంచి చూస్తే ఊరు, పచ్చటి పొలాలు, ఏరు అన్నీ కనిపిస్తు న్నాయి. శ్రీధర్ కళ్లు కూతురు ప్రియ కోసం వెతికాయి. ఆమె ఓ మూలనున్న సన్నజాజి పందిరి



దగ్గర మొగ్గలేరుతూ కనిపించింది.

“ప్రియా! కాఫీ తాగు” అంటూ ఆమె దగ్గరికి వెళ్లాడు శ్రీధర్.

“నాన్నగారూ! నాకెందుకో ఇవాళ కాఫి తాగబుద్ధి వెయ్యటం లేదు. నోరంతా చేదుగా ఉంది” అంది ప్రియ.

“ఈ రోజు నీకేమైంది? అందుకే నిన్ను పిక్‌నిక్‌లకు వెళ్లొద్దనీ చెబుతుంటాను. అయినా నా మాట వినవు” అన్నాడు కోపంగా శ్రీధర్.

అతని మాటలకు ప్రియ మౌనం దాల్చింది. నిశ్శబ్దం అలముకుంది. శ్రీధర్ కూతురును గమనిస్తున్నాడు. ఏదో జరిగింది ప్రియకు? ఎప్పుడూ చలాకీగా తుళ్లుతూ కేరింతలు కొట్టే ప్రియ ఈరోజు డల్‌గా ఉంది. ఆమె వదనంలో నిరుత్సాహం కనిపిస్తోంది.

ఇంతలో ప్రియ అతని దగ్గరకు వచ్చింది. శ్రీధర్ ఆశ్చర్యంగా ఆమె వైపే చూడసాగాడు. ఆమె కళ్లల్లో తడి స్పష్టంగా కనిపిస్తోంది. ఏం జరిగిందో శ్రీధర్‌కి అర్థం కాలేదు.

“ప్రియా! ఏం జరిగింది? ఎవరైనా ఏమైనా అన్నారా?” అడిగాడు.

“నాన్నా! నేనో విషయం అడుగుతాను. కోప్పడ కుండా చెబుతారా?” అంది చెమర్చిన కళ్లను తుడుచుకుంటూ.

శ్రీధర్ ఆమెని ఆశ్చర్యంగా చూడసాగాడు. ప్రియకి ఏదో జరిగింది. ఆమెకేదో సందేహం కలిగింది. ఆమె ఏం అడుగుతుందోనని అతనికి ఆతృత పెరగసాగింది.

పిక్‌నిక్‌లో ఏదైనా జరగరాని సంఘటన జరిగిందా? ఎంతో సరదాగా పిక్‌నిక్ వెళ్లిన ప్రియ ముఖంలో ఇంటికి వచ్చిన తరువాత నిరుత్సాహం, ఆందోళన కనిపించడం అతనిలో సందేహాలు రేకెత్తిస్తున్నాయి.

“ఏ విషయమో చెప్పు? ఇంతకీ ఏం జరిగింది?” అడిగాడు. అతని మాటల్లో ఆతృత ధ్వనించసాగింది.

“నాన్నగారూ? నేను అమ్మకు పుట్టలేదట. నిజమేనా?” అడిగింది.

ఆ ప్రశ్నకు ఒక్కసారిగా శ్రీధర్ నిశ్చేష్టుడయ్యాడు. ఆమె ప్రశ్న అతనికి అర్థం కాలేదు. ప్రియ అడిగింది నిజమేనా? తను సరిగ్గానే విన్నాడా? అతని ఆలోచనలు విపరీతంగా సాగిపోతున్నాయి.

“నువ్వేం అడుగుతున్నావు?”అడిగాడు. ఇప్పుడు అతని మాటల్లో తడబాటు కనిపించసాగింది.

“నేను అమ్మకి పుట్టానా?” అడిగింది.

“అమ్మకే పుట్టావు. అమ్మకి కాకపోతే ఇంకెవరికి పుడతావు? అయినా ఈ సందేహం నీకెందుకు వచ్చింది? ఎప్పుడు లేనిది ఏమిటీ పిచ్చి ప్రశ్న?” కోపంగా అడిగాడు శ్రీధర్.

“నా ఫ్రెండ్స్ చెప్పారు నాన్నా! నేను మీకు పుట్టలేదుట. నన్నెక్కడి నుంచో తెచ్చి పెంచుకున్నారట. వాళ్లు ఆ మాటలంటున్నప్పుడు నాకు చాలా బాధ వేసింది. నేను ఆ మాటలు నమ్మలేదు. అందుకే మిమ్మల్ని అడిగాను” అంది కళ్లు తుడుచుకుంటూ.

ఆమె సమాధానం అతని చెవులకు సోకింది కానీ సరిగ్గా వినిపించటంలేదు. వినిపించలేదా? లేక తన మనస్సు దానిని సరిగ్గా వినలేదా? అసలు ఏమిటీ ప్రశ్న? ఎప్పుడూ వినకూడని ప్రశ్న? అసలు ఇది నిజమేనా? ఎప్పుడూ తనతో మాట్లాడటానికే భయపడే కూతురు ప్రియ అడిగిన ప్రశ్నేనా ఇది?


అతని ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నాయి. మస్తిష్కం మొద్దు బారిపోతోంది. ఆ ప్రశ్నకు తన దగ్గర సమాధానం ఉందా? ఏం చెప్పాలి ఆ పిల్లకు? ఏ తండ్రీ ఎన్నడూ ఊహించని ప్రశ్న? ఎప్పుడూ వినకూడని ప్రశ్న? ఏ కూతురికీ రాకూడని సందేహం.

రాను రాను అక్కడ నిశ్శబ్దం పేరుకుపోతోంది. గాలి చప్పుడు తప్ప అక్కడంతా నిశ్శబ్దం. సూది మొనపడితే వినిపించేటంతటి నిశ్శబ్దం.

“నాన్నా! నేను మొదట నమ్మలేదు..కానీ మా ఫ్రెండ్స్‌లో ఇద్దరికి వాళ్ల అమ్మానాన్నలు నేను మీకు పుట్టలేదనీ,నన్ను ఎక్కడినుంచో తెచ్చుకొని పెంచు కున్నారనీ’ చెప్పారట. ఆ మాటలు వినగానే చాలా బాధ వేసింది. అనవసరంగా వాళ్లతో పిక్నిక్ వెళ్లాననిపించింది.

అయినా వాళ్లు చెప్పినది నిజం కాదని నాకు తెలుసు. నిజం కాకూడదనీ ఆ దేవుడికి మొక్కాను. అది నిజం కాదనీ మీరూ చెప్పండి నాన్నా! ఇంకెప్పుడూ మిమ్మల్ని ఈ ప్రశ్న అడగను. అమ్మని కూడా అడగను. ఎవరైనా ఈ ప్రశ్న అడిగితే వాళ్లతో జన్మలో మాట్లాడను” ఏడుస్తూ అంది ప్రియ.

ఆమె మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి శ్రీధర్‌కి. అతనికి ఏం చెప్పాలో అర్థం కావట్లేదు. ఎప్పుడూ...కూతురు ఏ ప్రశ్న వేసినా తక్షణంలో సమాధానం చెప్పే తనకు ఇప్పుడు ఈ ప్రశ్న ఇబ్బంది



గన్నవరపు నరసింహమూర్తి

పెడుతోంది.

అతన్ని ఆలోచనలు చుట్టుముడుతున్నాయి. ఈ లోకం బయటకు కనిపించే టంతటి మంచిది కాదు. కదుపులో కత్తులు పెట్టుకొని కావలించుకునే మనుష లున్న సమాజం మనది.

మనతో మంచిగా ఉంటూ లోపల అసూయ అనే అగ్నిపర్వతాలు దాచుకునే మనుషులుండే సమాజం ఇది. లేకపోతే చిన్నపిల్లలతో అనే మాటలేనా అవి? తన కూతురు గురించి తమ పిల్లలకు చెప్పే అవసరం వాళ్లకేం ఉంది?

దాని వల్ల పసిపిల్లల మనసులు కలుషితం అవడం తప్ప ప్రయోజనం ఏం ఉంటుంది? అవసరం అయితే నాలుగు మంచి మాటలు చెప్పాలి కానీ ఇలా విషాన్ని చిమ్మకూడదు. అందులోనూ చెప్పిన వాళ్లు ఈ సమాజాన్ని బాగుపరచడానికి బయల్దేరిన ఉపాధ్యాయులు. ఇటువంటి ఉపాధ్యాయు లతో సమాజం బాగుపడుతుందా?

శ్రీధర్ మస్తిష్కంలో పర్జన్య ఘోష. అతని గుండెల్లో కెరటాల హోరు.

"నేను మీకే పుట్టానని చెప్పండి నాన్నా? నేను మీ పిల్లనే అని చెబితే రేపు నాకు అలా చెప్పినవాళ్ల నోళ్లు మూయించేలా గట్టిగా సమాధానం చెబుతాను" అంది ప్రియ.

ఆమె మాటలకు అతను ఉలిక్కిపడి ఆలోచన ల్లోంచి తేరుకున్నాడు. అప్పటికే అతని ముఖం చెమటతో నిండిపోయింది.

"వాళ్లు చెప్పింది అబద్ధం. నువ్వు మాకే పుట్టావు. నువ్వు నా కూతురివి. ఎవ్వరి మాటలూ నమ్మకు" అన్నాడు శ్రీధర్.

ఆతని మాటలు నూతిలోంచి వస్తున్నట్లు వినిపించాయి. అయినా అవి ప్రియ చెవులకు అమృతంలా సోకాయి. ఆ మాటలు వినగానే ఆమె మోములో చిరునవ్వు విరిసింది. కన్నీళ్లు ఆగి పోయాయి. ఆనందం మళ్లీ చెమర్చడం మొదలైంది. ఆమె ముఖంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

వెంటనే ఆమె పరుగున తండ్రి వద్దకు వచ్చి కావలించుకుంది. శ్రీధర్‌కి స్పర్శ ఆనందాన్ని కలిగించింది. అతనిలోని పితృవాత్సల్యం ఒక్కసారిగా ఉప్పొంగింది.

ఇంతలో కౌసల్య "టిఫిన్ చేద్దురుగాని రండి" అని గట్టిగా పిలవడంతో ప్రియను తీసుకొని కిందకు దిగాడు.

ఆ రాత్రి భోజనాల తరువాత ప్రియకు కాసేపు లెక్కలు చెప్పాడు. కొద్దిసేపటికి "నాన్నా! నాకు నిద్ర వస్తోంది" అంటూ గదిలోకి వెళ్లిపోయింది.

కొద్దిసేపటికి పనులు ముగించుకొని, కౌసల్య భర్త దగ్గరకు వచ్చింది. ప్రతిరోజు వెన్నెల్లో డాబా మీద కబుర్లు చెప్పుకోవడం ఆ దంపతులకు అలవాటు.



ఇద్దరూ డాబా పైన చాప మీద కూర్చున్నారు. వెన్నెల చల్లగా కురుస్తోంది. నీలాకాశంలో చంద్రుడు తెల్లగా మెరిసిపోతున్నాడు. దూరం నుంచి కలకూజితం వినిపిస్తోంది. చల్లటి మలయమారుతం వీస్తూ హాయి గొలుపుతోంది.

కొద్దిసేపు ఆ జంట వెన్నెల్లో ఆ నీరవ నిశ్శబ్దాన్ని మౌనంగా అనుభవించారు.

ఆ తరువాత శ్రీధర్ "కౌసల్యా! మనం అనుకున్నంత జరిగింది. ఇవాళ పిక్నిక్‌లో ప్రియ స్నేహితురాళ్లు దానితో 'అది మనకు పుట్టిన పిల్ల కాదని' అన్నారట. అందుకే ఈరోజు అక్కడి నుంచి రాగానే అది డల్‌గా ఉంది. నన్ను సాయంత్రం డాబా మీద "నేను మీకు పుట్టలేదా నాన్నగారూ?" అని ఏడుస్తూ అడిగింది అన్నాడు.

అతని మాటలకు కౌసల్య ఆశ్చర్యపోయింది.

"అందుకేనా మీరు అక్కడంత సేపుండి పోయారు. మరి దానికి మీరేం చెప్పారు? అయినా వాళ్లకి ఈ విషయం ఎలా తెలిసిందట? మనం ఎవ్వరికీ ఆ విషయం చెప్పలేదు కదా?" ఆతృతగా అడిగింది కౌసల్య.

"ఇటువంటి విషయాలు దాగవు కౌసల్యా! అందరికీ తెలుస్తాయి. కాకపోతే ఎవ్వరూ మనల్ని నిజమా?కాదా? అని అడగరు. కానీ అడిగినవారికీ, అడగనివారికీ అందరికీ చెబుతుంటారు. మన ప్రియకి చెప్పింది మా సోషల్ మాస్టారుగారి అమ్మా యట. అంటే మా మాస్టారుగారే ఆ అమ్మాయికి చెప్పి ఉంటారు. కూతురుకే కాదు... తనకు తెలిసిన వాళ్లందరికీ చెప్పే ఉంటాడు. ఇలాగే అందరు మాస్టర్లకు కూడా చెప్పే ఉంటారు. మనం ప్రియని తెచ్చి పెంచుకుంటున్న సంగతి కొందరికే ఈ విషయం చెప్పాము. అయినా ఇందులో దాచ వలసినది ఏముంది చెప్పు? మనకు పిల్లలు కలగ లేదు. అందుకే ప్రియను పెంచుకున్నాము. బయట వాళ్లకి తెలిసినా పర్వాలేదు కానీ దానికే తెలిస్తే అది బాధపడుతుంది. అందుకే ఇప్పటివరకూ దానికి చెప్పలేదు.

కానీ మనం చెప్పకపోయినా దానికి స్నేహితురాళ్ల ద్వారా తెలిసిపోయింది. ప్రస్తుతానికి నేను దానికి నిజం చెప్పలేదు. ఆమె స్నేహితురాళ్లు చెప్పింది అబద్ధం అని మాత్రమే చెప్పాను. కానీ ఒకసారి అనుమానం అంటూ వస్తే అది అంత త్వరగా పోదు. అది దావానంలా దహించి వేస్తుంది. మనం నిజం చెప్పకపోతే అది లోలోపల కుమిలిపోతుంది. అది మరింత ప్రమాదం" అన్నాడు శ్రీధర్.

"ఇంతకీ మీరేమంటారు? దానికి నిజం చెప్పేస్తారా? అలా చెబితే ఇంకేమైనా ఉందా? మా అమ్మ ఎక్కడ అని అడిగితే ఏం చెబుతారు?నన్ను మా అమ్మ దగ్గరికి తీసికెళ్లండి అంటే ఏం చేస్తారు? ఊళ్లో వాళ్లు ఏదో చెబితే మనకేంటి? మనం మాత్రం నిజం చెప్పొద్దు. లేకపోతే ఇన్నాళ్లూ ఎంతో ప్రేమతో పెంచిన మనల్ని శత్రువులుగా చూస్తుంది. అది దానికి మంచిది కాదు" అంది కౌసల్య.

"దానికి తన జన్మ రహస్యం గురించి అనుమానం కలిగింది. ఇప్పుడు ఆ విషయం మనం చెప్పకపోయినా ఆ కార్చిచ్చు లోలోపలే మండుతూ ఏదో ఒక రోజు ఆ అగ్ని బయటపడుతుంది.అలా జరగక ముందే మనం నిజం చెప్పేస్తే మంచిది. ముందు బాధపడినా, తరువాత సర్దుకుంటుంది. ఇప్పుడు దాని తల్లి ఎక్కడుందో! అసలు ఉందో, లేదో కూడా తెలియదు కాబట్టి అది వాళ్లమ్మ దగ్గరకు వెళ్లే ప్రశ్నే ఉత్పన్నం కాదు. కానీ నిజం తెలియడం వల్ల తనలో సంఘర్షణ తగ్గుతుంది" అన్నాడు శ్రీధర్.


"అంటే నిజం చెప్పేస్తారా? ఇప్పుడింత త్వరగా ఆ చేదు నిజాన్ని చెప్పకపోతే ఏం నష్టం? కొన్నాళ్లు వేచి చూద్దాము. అది కొంచెం పెద్దదైతే అర్థం చేసుకొనే జ్ఞానం కలుగుతుంది. అప్పుడు చెప్పినా బాధ ఉండదు" సలహా ఇచ్చింది కౌసల్య.

"ఇప్పుడది చిన్నదనుకుంటున్నావు నువ్వు. కాని దాని వయస్సు పదమూడేళ్లు. అంటే యుక్త వయస్సులోకి ప్రవేశించింది. అన్నీ అర్థం చేసుకునే వయస్సు. ఇంకా ఆలస్యం చేస్తే దాని మనసు మరింత గాయపడొచ్చు. అలా జరిగితే కోలుకోవడం చాలా కష్టం" అన్నాడు శ్రీధర్.

"మనం దాని తల్లితండ్రులం కాదు అనీ దానికి తెలిస్తే అది తట్టుకోగలదా? దానికేదైనా అయితే మనం తట్టుకోగలమా చెప్పండి?" అంది కళ్లు తుడుచు కుంటూ కౌసల్య.

"అయినా ఈ విషయం ఎప్పుడో అప్పుడు దానికి తెలియక తప్పదు. ఇన్నాళ్లూ ఆ నిజం చెప్పవలసిన అవసరం రాలేదు. ఇప్పుడు వచ్చింది. ఈ నిజం చెప్పవలసిన రోజు ఇంత త్వరగా వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. మనం ఊహించింది ఎప్పుడూ జరగదు. అదే జీవితం.

(సశేషం)


SURYA
Shaping Structures That Shape Tomorrow
Steel is what turns plans into lasting structures. Surya provides high-quality steel solutions that support construction, infrastructure, and development. Engineered for strength and consistency, they help projects move forward with confidence.
Because the future is built on what holds firm today.
PRAKASH
SURYA
SURYA HAI TOH BHAROSA HAI
Lighting | Wires and Cables | Professional Lighting | Fans | Appliances | Water Pumps | PVC and Water Tanks | Steel Pipes
I am SURYA
50 YEARS OF TRUST
DURABLE PRODUCTS
ASSURED QUALITY
SURYA ROSHNI LIMITED | consumercare@surya.in | www.surya.co.in
TOLL FREE 1800 102 5657

# ద్విముఖ సంక్షోభంలో

**పాకిస్తాన్ ప్రస్తుతం తీవ్రమైన ద్విముఖ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఒకవైపు బలోచ్ తిరుగుబాటుదారులు (బీఎల్‌ఏ, తెహ్రీక్‌-ఎ-తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ) వంటి ఉగ్రవాద సంస్థల హింసాత్మక దాడులతో దేశభద్రత క్షీణిస్తుండగా, మరోవైపు ప్రధాని షెహబాజ్ షరీఫ్, దేశ అంతర్గత వ్యవహారాల మంత్రి (హోం మంత్రి) మొహసిన్ నఖ్వీ మధ్య రాజకీయ విభేదాలు ప్రభుత్వాన్ని బలహీనపరుస్తున్నాయి. ఈ రాజకీయ సంక్షోభంలో హోంమంత్రికి పాక్ శక్తిమంతమైన ఆర్మీ పూర్తి మద్దతు ఇస్తుండటం గమనార్హం.**

బలూచిస్తాన్‌లో హింస అత్యంత తీవ్ర రూపం దాల్చింది, అక్కడ పాకిస్తాన్ సైన్యానికి, స్థానిక వేర్పాటువాద గ్రూపులకు (ముఖ్యంగా బలూచ్ లిబరేషన్ ఆర్మీ–బీఎల్ ఏ, బలూచ్ లిబరేషన్ ఫ్రంట్ – బీఎల్ ఎఫ్) మధ్య గెరిల్లా యుద్ధం జరుగుతోంది. జులై, ఆగస్టు 2026 నాటి తాజా కథనాల ప్రకారం, వేర్పాటువాద గ్రూపులు కేవలం ఒకే నెలలో 48కి పైగా వ్యూహాత్మక దాడులు చేసి, దాదాపు 100 మందికి పైగా పాకిస్తాన్ సైనికులను మట్టుబెట్టినట్లు ప్రకటించాయి. క్వెట్టా, గ్వాదర్, జియారత్ వంటి ప్రాంతాల్లో పెరుగుతున్న హింసను అణచివేయడానికి పాకిస్తాన్ సైన్యం ‘ఆపరేషన్ షాబాన్’ వంటి భారీ వైమానిక, భూతల సైనిక చర్యలను చేపట్టింది. ఈ ఆపరేషన్లలో వందలాదిమంది బలూచ్ తిరుగుబాటుదారులను చంపినట్లు ఆర్మీ ప్రకటించగా, సాధారణ పౌరులు కూడా పెద్ద సంఖ్యలో బలవుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనల కారణంగా పాకిస్తాన్‌కు ఇస్తున్న వాణిజ్య ప్రాధాన్యత హోదాను రద్దు చేస్తామని యూరోపియన్ యూనియన్ హెచ్చరించింది, ఇది పాక్ ఆర్థిక వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెడుతోంది.

**గణనీయంగా పెరిగిన బలూచ్‌ల పోరాట సామర్థ్యం**

బలూచ్ తిరుగుబాటుదారుల పోరాట సామర్థ్యాలు, వ్యూహాలు, సాంకేతికత గత కొన్ని సంవత్సరాలుగా అనూహ్యంగా పెరిగాయి. ఒకప్పుడు కేవలం పాత రైఫిళ్లతో చిన్నపాటి దాడులు చేసిన వీరు, ఇప్పుడు పాకిస్తాన్ ఆర్మీని వణికించే ఒక అత్యాధునిక గెరిల్లా సైన్యంగా రూపాంతరం చెందారు. గతంలో కేవలం కొండల్లో, ఎడారుల్లో మాత్రమే దాక్కున్న తిరుగుబాటుదారులు, ఇప్పుడు క్వెట్టా, గ్వాదర్, కరాచీ వంటి ప్రధాన నగరాల్లోకి చొరబడి దాడులు చేస్తున్నారు. 2024లో ప్రారంభమైన “ఆపరేషన్ హిరూఫ్” ద్వారా వారు ఒకే రాత్రి, ఒకే సమయంలో బలూచిస్తాన్‌వ్యాప్తంగా 12కంటే ఎక్కువ ప్రాంతాలలో సైనిక పోస్టులు, హైవేలపై దాడులు చేసి సైన్యాన్ని దిగ్భ్రాంతికి గురిచేశారు. డ్రోన్ల ద్వారా సైనిక కదలికలపై నిఘా ఉంచడం, కమ్యూనికేషన్ కోసం శాటిలైట్ ఫోను, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను ఉపయోగించడంలో నిపుణులయ్యారు. దీనితో పాక్ ఇంటెలిజెన్స్ వీరి ప్రణాళికలను కనిపెట్టలేకపోతోంది. విద్యావంతులు దీనిలో చేరడంతో ఇంటర్నెట్, అంతర్జాతీయ మీడియాను వాడుకుంటూ తమ డిజిటల్ ప్రచారాన్ని బలంగా నడుపుతున్నారు. బీఎల్‌ఏ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆత్మాహుతి దళంలో మహిళలు కూడా భారీగా చేరుతున్నారు. బలూచ్ తిరుగుబాటుదారులు తమ పరిధిని పెంచుకోవడానికి ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలోని టిటిపితో, సింధ్ ప్రావిన్స్‌లోని వేర్పాటువాద గ్రూపులతో వ్యూహాత్మక ఒప్పందాలు




చేసుకున్నారు. దీనివల్ల వీరికి ఆయుధాలు, నిధులు, శిక్షణ అందుతున్నాయి. గల్ఫ్ దేశాలలో, యూరప్‌లో నివసిస్తున్న బలూచీల నుండి వీరికి క్రిప్టోకరెన్సీ, హవాలామార్గాల ద్వారా భారీగా నిధులు అందుతున్నాయి. బలూచ్ తిరుగుబాటుదారులు తమ సామర్థ్యాలను పెంచుకోవడంతో, పాక్ సైన్యం ఎన్ని ఆపరేషన్లు చేసినా వారిని అణచివేయలేకపోతోంది.

**పారగమ్య సరిహద్దులు**

బలూచిస్తాన్ సరిహద్దులు అత్యంత బలహీనంగా, పారగమ్యంగా ఉండటంవల్ల పాకిస్తాన్ ఆర్మీకి ఈ ప్రాంతంపై నియంత్రణ సాధించడం అసాధ్యంగా మారింది. ముఖ్యంగా ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ దేశాలతో ఉన్న సరిహద్దులే బలూచిస్తాన్ తిరుగుబాటుకు ప్రధాన ఊపిరిగా నిలుస్తున్నాయి. ఈ సరిహద్దుల గుండా వారు బలూచిస్తాన్‌లోకి వచ్చి పాక్ సైన్యంపై లేదా చైనా ప్రాజెక్టులపై దారుణంగా దాడులు చేసి వెంటనే, తిరిగి సులభంగా ఇరాన్ లేదా ఆఫ్ఘనిస్తాన్ భూభాగాల్లోకి పారిపోతున్నారు. పాక్ ఆర్మీ సరిహద్దులు దాటి వారిని వెంటాడలేదు. ఆఫ్ఘనిస్తాన్‌ను తాలిబన్లు ఆక్రమించుకున్న తర్వాత, అక్కడ అమెరికా సైన్యం వదిలివెళ్లిన అత్యాధునిక పరికరాలు సులభంగా దాటగలిగే ఈ సరిహద్దుల ద్వారానే చాలా సులువుగా బలూచ్ తిరుగుబాటు దారుల చేతికి చేరుతున్నాయి. ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ నుండి బిలియన్ డాలర్ల విలువైన డ్రగ్స్, ఇంధనం బలూచిస్తాన్ సరిహద్దుల ద్వారా పాక్‌లోకి అక్రమంగా చేరతాయి. ఈ అక్రమవ్యాపారం ద్వారా వచ్చే నల్లధనమే తిరుగుబాటు గ్రూపులకు ప్రధాన ఆర్థిక వనరుగా మారుతోంది. సరిహద్దుకు ఇరువైపులా నివసిస్తున్న బెలూచీలకు ఒకే రకమైన సంస్కృతి, రక్తసం బంధాలు ఉంటాయి. దీనివల్ల సరిహద్దు దాటి వచ్చే తిరుగుబాటుదారులకు ఆశ్రయం, రక్షణ కల్పించడం జరుగుతోంది. దీనిని అడ్డుకోవడం సైన్యానికి సవాలుగా మారింది. ఏ సైన్యమైనా విజయం సాధించాలంటే స్థానిక ప్రజల మద్దతు, సమాచారం ముఖ్యం. బలూచిస్తాన్‌లో పాక్ సైన్యానికి స్థానికుల మద్దతు అస్సలులేదు. దీనికి విరుద్ధంగా, సామాన్య ప్రజలే సైన్యం కదలికల గురించిన ముందస్తు సమాచారాన్ని తిరుగుబాటుదారులకు అందిస్తున్నారు. సైన్యం చేసే అరాచకాల వల్ల, బాధితుల కుటుంబాలకు చెందిన యువకులు సైన్యంపై పగతో తిరుగుబాటు గ్రూపులలో చేరుతున్నారు. బీఎల్‌ఏకు చెందిన ‘మజీద్ బ్రిగేడ్’లో చదువుకున్న యువతులు కూడా ఆత్మాహుతి దాడులకు సిద్ధపడుతున్నారు. ఈ సరికొత్త మానసిక యుద్ధవ్యూహాన్ని ఎదుర్కోవడం

**పాకిస్తాన్‌లో ప్రస్తుతం నడుస్తున్న అధికార పోరాటం అత్యంత సంక్లిష్టమైన, ప్రమాదకరమైన దశకు చేరుకుంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, అంతర్గత వ్యవహారాల (హోం) మంత్రి మోహ్సిన్ నఖ్వీల మధ్య తీవ్రమైన విభేదాలు బహిరంగమయ్యాయి. ఈ అంతర్గత పోరాటం పాకిస్తాన్ పౌర ప్రభుత్వ ఉనికినే ప్రమాదంలో పడేసి, దేశంలో సరికొత్త రాజకీయ ప్రకంపనలకు కారణమవుతోంది.**



# పాకిస్తాన్!

పాక్ ఆర్మీకి అసాధ్యంగా మారింది. తిరుగుబాటు దారులు ఎప్పుడు, ఎక్కడ దాడి చేస్తారో తెలియని పరిస్థితి ఉండటంతో, సైన్యం ఎప్పుడూ రక్షణాత్మక ధోరణిలోనే ఉండాల్సి వస్తోంది. ఇది వారి మనో స్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. బలూచిస్తాన్‌లో తిరుగు బాటును అణచివేయడానికి చైనా ప్రాజెక్టుల రక్షణకు పాకిస్తాన్ సైన్యానికి చెందిన మూడు విభాగాలు, పారా మిలిటరీ బలగాలు అక్కడ భారీ ఎత్తున మోహరించాయి.

**చైనా ప్రాజెక్టులపై దాడులు**

గ్వాదర్ పోర్టు చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌కు గుండెకాయ వంటిది. చైనా పాకిస్తాన్‌లో పెట్టిన 65 బిలియన్ల డాలర్ల సీపెక్ పెట్టుబడులను పూర్తిగా నిర్వీర్యం చేయడమే బలూచ్ తిరుగుబాటు దారుల ప్రధాన వ్యూహాత్మక లక్ష్యంగా మారింది. చైనాను ఓడించడంకంటే, ఈ ప్రాంతంలో ప్రాజెక్టుల నిర్వహణ వ్యయాన్ని భారీగా పెంచడం ద్వారా చైనా ఇక్కడి నుండి వెళ్లిపోయేలా చేయడమే తిరుగుబాటు దారుల వ్యూహం. ఈ నిరంతర దాడుల కారణంగా పాకిస్తాన్‌లోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) సగానికి పైగా పడిపోయాయి. చైనా ప్రభుత్వం తమ పౌరుల రక్షణ కోసం సొంత చైనీస్ సెక్యూరిటీ బలగాలను బలూచిస్తాన్‌లోకి పంపేందుకు పాకిస్తాన్‌పై ఒత్తిడి తెస్తోంది.

**కేపీకేలో భీకర ఘర్షణలు**


ఖైబర్ పఖ్తున్‌ఖ్వా (కేపీకే) ప్రావిన్స్‌లో పాకిస్తాన్ భద్రతా బలగాలకు, తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ), దాని అనుబంధ గ్రూపులకు మధ్య ఘర్షణలు భీకర దశకు చేరుకున్నాయి. టీటీపీకి ఆశ్రయం ఇవ్వద్దని పాకిస్తాన్ ఆర్మీ ఆఫ్ఘన్ తాలిబన్లను ఎంత వేడుకున్నా వారు పట్టించుకోవడంలేదు. కేపీకే ప్రావిన్స్‌లో నిరంతరం టీటీపీ చేతిలో బలవుతున్న స్థానిక పోలీసులు, తమకు ఆర్మీ నుండి సరైన రక్షణ, ఆయుధాలు అందడంలేదని సైన్యానికి వ్యతిరేకంగా ఏకంగా రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపడం గమనార్హం. 'పఖ్తూన్ తహఫుజ్ మూవ్‌మెంట్ (పీటీఎం) వంటి సంస్థలు పాక్ సైనిక చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీనితో పాక్ ఆర్మీ ప్రస్తుతం చరిత్రలోనే అతిపెద్ద భద్రతా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

**అధికార పోరాటం**

పాకిస్తాన్‌లో ప్రస్తుతం నడుస్తున్న అధికార పోరాటం అత్యంత సంక్లిష్టమైన, ప్రమాదకరమైన దశకు చేరుకుంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, అంతర్గత వ్యవహారాల (హోం) మంత్రి మొహ్సిన్ నఖ్వీల మధ్య తీవ్రమైన విభేదాలు బహిరంగమయ్యాయి. ఈ అంతర్గత పోరాటం పాకిస్తాన్ పౌర ప్రభుత్వ ఉనికికే ప్రమాదంలో పడేసి, దేశంలో సరికొత్త రాజకీయ ప్రకంపనలకు కారణమవుతోంది. మొహ్సిన్ నఖ్వీ ఇటీవల ఒక సదస్సులో మాట్లాడుతూ, "పాకిస్తాన్ ప్రస్తుత పరిపాలనా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పాత వ్యవస్థతో దేశ సమస్యలను పరిష్కరించడం అసాధ్యమని ప్రకటించారు. నఖ్వీ మరో బాంబు పేలుస్తూ, పాక్ చరిత్రలోనే అత్యంత భారీ అవినీతి కుంభకోణాన్ని తాము కనిపెట్టామని చెప్పారు. నఖ్వీ ఎవరి పేర్లనూ అధికారికంగా వెల్లడించనప్పటికీ, ఆయన టార్గెట్ ప్రస్తుత పాలకులైన పీఎంఎల్-ఎన్ , వారి మిత్రపక్షాలేననేది నిష్ఠుర సత్యం. మొహ్సిన్ నఖ్వీకి పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ పూర్తి మద్దతు ఉంది. మీడియా మొఘల్ స్థాయి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన నఖ్వీ, ఆర్మీ అండతో పాకిస్తాన్ తదుపరి ప్రధాన మంత్రి కావాలని ఆశిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. నఖ్వీ వ్యాఖ్యలపై షెహబాజ్ షరీఫ్ నమ్మకస్తుడైన రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ తీవ్రంగా స్పందించారు. పాకిస్తాన్ అధికార నిర్మాణంలో పౌర ప్రభుత్వానికి, సైన్యానికి మధ్య చీలికలు ఎంత తీవ్రంగా ఉన్నాయో ఈ ఇద్దరి మధ్య ఘర్షణ నిరూపిస్తోంది. హోంమంత్రి నఖ్వీ వెనుక సైన్యం ఉండటంతో, ప్రధాని షరీఫ్ ఆయనను పదవి నుండి తొలగించలేక, ఆయన చేస్తున్న ఆరోపణలను భరించలేక తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారు.

**ప్రభుత్వం కూలిపోయే ప్రమాదం**

పాకిస్తాన్ అధికార వర్గాల్లో నడుస్తున్న ఈ ఘర్షణలు దేశంలో ప్రభుత్వం ఏ క్షణంలోనైనా పడిపోయే ప్రమాదాన్ని, తీవ్రమైన రాజకీయ మార్పులను సూచిస్తున్నాయి. హోం మంత్రి మొహ్సిన్ నఖ్వీ ద్వారా సైన్యం ప్రభుత్వ వైఫల్యాలను బహిరంగంగా ఎండగడుతోంది కాబట్టి, షెహబాజ్ షరీఫ్‌ను మార్చడానికి ఆర్మీ ఇప్పటికే వ్యూహం సిద్ధం చేసిందని అర్థమవుతోంది. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉన్న పీపీపీ, ఇతర చిన్న పార్టీలు ఎప్పుడూ సైన్యంవైపే ఉంటాయి. సైన్యం నుంచి సిగ్నల్ రాగానే, వారు షెహబాజ్ సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుని, దాన్ని పడగొట్టే అవకాశం ఉంది. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం పడిపోతే, సైన్యం మద్దతుతో మేధావులు, ఆర్థిక నిపుణులు, రిటైర్డ్ బ్యూరోక్రాట్లతో కూడిన 'టెక్నోక్రాట్ ప్రభుత్వం' ఏర్పాటుకావచ్చు. ఒకవేళ ప్రస్తుత పార్లమెంట్‌ను రద్దు చేయకుండా కేవలం ప్రధానమంత్రిని మాత్రమే మార్చాలని సైన్యం భావిస్తే, షెహబాజ్ షరీఫ్ స్థానంలో ఆర్మీ చీఫ్‌కు అత్యంత నమ్మకస్తుడైన మొహ్సిన్ నఖ్వీని కొత్త ప్రధానమంత్రిగా కూర్చోబెట్టే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. తీవ్ర ఒత్తిడి నడుమ అసెంబ్లీని రద్దు చేసి కొత్తగా ఎన్నికలకు వెళ్లవచ్చు. అయితే, ఇమ్రాన్ ఖాన్ జైలులో ఉన్నంత కాలం, అతని పార్టీని (పీటీఐ) పూర్తిగా తొక్కేయడానికి సైన్యం ప్రయత్నిస్తున్నంత కాలం, ఈ ఎన్నికలు కేవలం ఒక నాటకం లాగే సాగుతాయి. ప్రభుత్వం స్థిరంగా లేకపోతే ఐఎంఎఫ్ తదుపరి విడత రుణ సహాయాన్ని నిలిపివేస్తుంది. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేయడం అసాధ్యంగా కనిపిస్తోంది. పాకిస్తాన్ మరోసారి ప్రత్యక్ష లేదా పరోక్ష సైనిక నియంత్రణలోకి వెళ్లడం దాదాపు ఖాయంగా మారింది. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం పడిపోయి, సైన్యం మద్దతుతో టెక్నోక్రాట్ ప్రభుత్వం ఏర్పడితే, అది ఇమ్రాన్ ఖాన్‌కు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే టెక్నోక్రాట్ ప్రభుత్వం దేశంలో ఎన్నికలను సుదీర్ఘ కాలం పాటు వాయిదా వేస్తుంది. ఎన్నికలు జరగనంత కాలం ఇమ్రాన్‌ఖాన్‌కు ప్రజల్లో ఎంత మద్దతు ఉన్నా ఉపయోగం ఉండదు. అయితే, సైన్యం నేరుగా దేశాన్ని పాలించాలనుకుంటే ప్రజా తిరుగుబాటు వచ్చే ప్రమాదం ఉంది కనుక, తెరవెనుక ఇమ్రాన్ ఖాన్‌తో రాజీ కుదుర్చుకోవడానికి ప్రయత్నించే అవకాశాలను కూడా తోసిపుచ్చలేం!



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్



# ఢిల్లీలో అలా.

**“దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంటుంది” అని స్వామి వివేకానంద చెప్పిన మాటలు నేటికీ సజీవ సత్యం. ఏ దేశానికయినా యువశక్తి గొప్ప సంపద. భారత్‌కు సహజ వనరులతో పాటు దేశంలో పెద్దఎత్తున ఉన్న యువత మనకి గొప్ప వరం. ఆ యువశక్తిని మంచికి మలచుకుంటే అంతకంటే గొప్ప ఆయుధం ఉండదు. అదే యువశక్తిలో విష బీజాలు నాటి తమ స్వార్థానికి వాడుకుంటే అల్లకల్లోలం ఖాయం.**

ఇటీవల దేశంలో ఇలాంటి పరిణామాలే జరిగాయి. నీట్‌పరీక్షా పేపర్ లీకుపై ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా జరిగిన యువకుల నిరసనలలో స్వార్థ పూరిత శక్తులు చేరడంతో ఉద్యమం పక్కదారి పట్టింది. అదే సమయంలో ఇదే తరహా అంశంతో ఝార్ఖండ్‌లో యువత చేపట్టిన నిరసనలో అల్లకల్లోలం లేకపోవడమే కాదు, వారి డిమాండ్‌లో నిజాయతీ కనిపిస్తోంది. ఎక్కడైనా యువత ప్రధానంగా మంచి చదువు,ఉన్నతమైన ఉపాధి కోరు కుంటుంది. ప్రభుత్వ ఉద్యోగాలు, పోటీ పరీక్షలే లక్షలాది యువత జీవితాలను మారుస్తాయి. సంవత్సరాల తరబడి కష్టపడి చదివిన తర్వాత ఒక పరీక్ష రాయడానికి సిద్ధమయ్యే యువతకు ప్రశ్న పత్రాల లీక్‌లు, పరీక్షలలో అక్రమాలు జరిగితే అది కేవలం ఒక పరీక్షా వైఫల్యం కాదు, వారి కలలపై, కుటుంబాల ఆశలపై, ప్రభుత్వ వ్యవస్థపై ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

దేశంలో కొంత కాలంగా పరీక్షల పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జాతీయ స్థాయిలో జరిగిన వైద్య ప్రవేశ పరీక్ష ‘నీట్’ వివాదం దేశాన్ని కుదిపివేస్తే, ప్రస్తుతం ఝార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రభుత్వ నియామక పరీక్షలపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అయితే ఈ మూడు సందర్భాల్లో ప్రభుత్వాల స్పందన, రాజకీయపార్టీల వైఖరి, చేపట్టిన సంస్క రణలను పోల్చిచూస్తే స్పష్టమైన వ్యత్యాసం కనిపి స్తోంది. అంతేకాదు విద్యార్థులు, యువత చేపట్టిన నిరసన విధానంలో కూడా తేడాలున్నాయి. ప్రధానంగా ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా జరిగిన ఉద్యమంలో అసాంఘిక శక్తులు జొరబడడంతో హింసాత్మకంగా సాగింది. అదే ఝార్ఖండ్‌లో పూర్తిగా విద్యార్థులు మాత్రమే చేపట్టిన ఉద్యమంలో ఇవేవీ కానరాకుండా లక్ష్య సాధనే లక్ష్యంగా సాగుతోంది. ఢిల్లీలో విద్యార్థుల ముసుగులో జొరబడిన దేశ ద్రోహ శక్తులకు రాజకీయ పార్టీల మద్దతు కూడా తోడవడంతో చెలరేగిన అల్లర్లు దేశంలో చర్చకు దారితీసాయి. అదే ఝార్ఖండ్‌లో విద్యార్థులు ఇలాంటి శక్తులకు అవకాశం ఇవ్వకుండా ఉద్యమించడం విశేషం.

‘నీట్’లో అక్రమాల ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పుడు దేశవ్యాప్తంగా ఆందోళన కనిపించింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ నిరసనలు జరిగాయి. కాంగ్రెస్‌తో పాటు ‘ఇండి’ కూటమిలోని పార్టీలు ఈ అంశంతో లబ్ధిపొందేందుకు ప్రయత్నిం చాయి. పార్లమెంట్ సమావేశాలు జరగకుండా అడ్డుకున్నాయి. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్ లీక్ కేసును సీబీఐకి అప్పగించింది. జాతీయ పరీక్షా వ్యవస్థలో లోపాలను అధ్యయనం చేయడానికి ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. పరీక్షల భద్రతను బలోపేతం చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టింది. ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం అమలు చేసి ప్రశ్నాపత్రాల లీక్‌లు, పరీక్షల అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన శిక్షల నిబంధనలు తీసుకొచ్చింది. అనంతరం డిజిటల్ భద్రత, కంప్యూటర్ ఆధారిత పరీక్షల విస్తరణ, పరీక్షా వ్యవస్థ ఆధునికీకరణ దిశగా చర్యలు కొనసాగాయి. విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్‌చే రాజీనామా చేయించి కేంద్రప్రభుత్వం తమ నిబద్ధతను నిరూపించుకుంది. స్వయంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పలు వీడియో సందేశాలు ఇచ్చారు.

యువతకు తక్షణ న్యాయం చేసేలా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం స్పందిస్తే ఝార్ఖండ్‌లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ), ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (జేఎస్ఎస్‌సీ) నిర్వహించిన పలు నియామక పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీక్‌లు, అవకతవకలు జరిగాయనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా జేపీఎస్‌సీ14వ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవడంతో వేలాదిమంది విద్యార్థులు రాంచీలో నిరవధిక ఆందోళనలు ప్రారంభించారు. పరీక్షను రద్దు చేయాలని, సీబీఐతో కానీ లేదా రాష్ట్రానికి వెలుపల ఉన్న పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులతో కానీ స్వతంత్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

జంతర్‌మంతర్ నిరసనలతో పోలిస్తే ఝార్ఖండ్ ఉద్యమంలో కనిపిస్తున్న గొప్పదనం అక్కడి క్రమశిక్షణ. రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద వేలాదిమంది ఉద్యోగార్థులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రోజుల తరబడి టార్పాలిన్ షెడ్ల కిందనే నిరసన కొనసాగిస్తున్నారు. వేసవిలో ఉద్యమాన్ని ప్రారంభించిన విద్యార్థులు వర్షాకాలం లోనూ తడుస్తూ దాన్ని కొనసాగిస్తున్నారు. వందే మాతరం నినాదాలతో తమ దేశభక్తిని చాటుకుంటు న్నారు. విద్యార్థులు స్వచ్ఛందంగా వంటా వార్పు చేసుకుంటున్నారు. విద్యార్థి నాయకుడు దేవేంద్రనాథ్ మహతో చేపట్టిన నిరాహార దీక్ష ఉద్యమానికి మరింత ఊపునిచ్చింది. హింసకు, విధ్వంసానికి తావివ్వ కుండా, ప్రజా ఆస్తులకు ఎలాంటి నష్టం కలిగించ కుండా, పరీక్షల పారదర్శకత, స్వతంత్ర విచారణ, నియామక వ్యవస్థలో సంస్కరణలనే ప్రధాన డిమాండ్లుగా శాంతియుతంగా ఆందోళన కొనసాగించడం ఈ ఉద్యమానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. విద్యార్థుల దృష్టి కేవలం ఉద్యోగాలపై, న్యాయమైన అవకాశాలపైనే ఉండటం కూడా ఈ ఉద్యమంలో ప్రధాన లక్షణంగా నిలిచింది.

ఝార్ఖండ్‌లో ఉద్యమాన్ని ఏ రాజకీయపార్టీ ప్రారంభించలేదు. మొదటి నుంచి విద్యార్థులే దీనికి నాయకత్వం వహిస్తున్నారు. ఢిల్లీలో హడావిడి చేసిన కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఇక్కడ అంటీ ముట్టనట్టు వ్యవహరించడంతో వారి తీరుపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో తప్పని పరిస్థితుల్లో సీజేపీ విద్యార్థులకు బహిరంగ మద్దతు ప్రకటించింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే రాంచీకి వెళ్లి సంఘీభావం తెలుపుతానని ప్రకటించారు. రాజకీయ పార్టీల నుండి ఎలాంటి అండదండలు లేకుండా ఇక్కడ విద్యార్థులు స్వతంత్రంగా ఉద్యమిస్తుండడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

రాజకీయంగా చూస్తే, ఇక్కడే స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తోంది. ఢిల్లీలో జరిగిన నీట్ ఉద్యమంలో కాంగ్రెస్‌తో పాటు ‘ఇండి’ కూటమిలోని పలు పార్టీలు ప్రత్యక్షంగా పాల్గొన్నాయి. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ మరో అడుగు ముందుకేసి,




# . ఝార్ఖండ్‌లో ఇలా..

ప్రోటోకాల్‌కు విరుద్ధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంటిముందు ధర్నాచేశారు. బాధ్యతా యుతమైన ప్రతిపక్ష నేత రాహుల్ రాజకీయ లబ్ది కోసం నీట్ ఉద్యమాన్ని విద్యార్థుల నుండి హైజాక్ చేయాలని చూశారు. కానీ అదే ఝార్ఖండ్‌లో పేపర్‌లీకుపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మౌనం దాల్చాయి. ఇప్పటికీ రోజూ జంతర్‌మంతర్ అంశాన్ని లేవనెత్తే రాహుల్‌గాంధీ, ఝార్ఖండ్ విద్యార్థుల కోసం పెదవివిప్పరు. ఆ రాష్ట్రంలో జేఎంఎం–కాంగ్రెస్–ఆర్జేడీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కాంగ్రెస్ రెండు నాలుకల ధోరణిని, దాటవేత వైఖరిని ప్రదర్శిస్తోంది. కాంగ్రెస్ పార్టీయే కాదు, సామాజిక వేత్తలుగా చెప్పుకునే మేధావి వర్గం, ప్రజా సంఘాలు, సినీ ప్రముఖులు, పక్షపాత మీడియా ఝార్ఖండ్ విషయంలో చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు.

జంతర్‌మంతర్‌లో జరిగిన, ఝార్ఖండ్‌లో జరుగుతున్న నిరసనలు పోల్చి చూస్తే నిజంగా విద్యార్థుల కోసం జరిగిన ఉద్యమం ఏదో, విద్యార్థుల ముసుగులో స్వలాభం చూసుకున్న శక్తులేవో స్పష్టంగా తేట తెల్లమయ్యింది. విద్యార్థుల పేరుతో జంతర్ మంతర్‌లో దేశ వ్యతిరేక శక్తులు జొరబడ్డాయని నాటి ఘటనలే నిరూపించాయి. దేశానికి వ్యతిరేకంగా ఆజాదీ నినాదాలు చేయడం, సనాతన ధర్మాన్ని కించపర్చేలా హిందూ దేవతలను దూషించడం, దేశ ప్రధానమంత్రి పదవిని అగౌరపరుస్తూ ఆయనపై, ఆయన తల్లి గురించి అసభ్యకరంగా మాట్లాడడం చూస్తే, వీరు విద్యార్థులేనా అనే సందేహాలొచ్చాయి. పార్లమెంట్ మార్చ్ పేరుతో ముందస్తు ప్రణాళికతో లారీలలో రాళ్లు పోగేసుకొని వాటిని పోలీసులపై రాళ్లు రువ్వడం, భద్రతాదళాలపై పెప్పర్ స్ప్రే చల్లడం, కొన్ని మీడియా చానెళ్లను లక్ష్యంగా చేసుకొని దాడిచేయడం వంటి ఘటనలు చూస్తే వీటి వెనుక దేశ ద్రోహశక్తులున్నాయని స్పష్టమవుతోంది. జంతర్ మంతర్ అల్లర్ల వెనుక అంతర్జాతీయ శక్తుల కుట్రలుంటే, ఝార్ఖండ్ ఉద్యమం వెనుక విద్యార్థుల ఆవేదన స్పష్టంగా కనిపిస్తోంది.

ఝార్ఖండ్‌తో పాటు పంజాబ్‌లో కూడా పరీక్షల పారదర్శకతపై పలు వివాదాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. విద్యాశాఖమంత్రి హర్జోత్ సింగ్ బైన్స్ రాజీనామా కోరుతున్నారు. అసెంబ్లీలో నిరసనలు, వాక్‌అవుట్‌లూ జరిగాయి. అయితే ఆప్ ప్రభుత్వం మాత్రం "ఇది పేపర్ లీక్ కాదు, టెక్నాలజీ ఆధారిత చీటింగ్" అని వాదిస్తూ లీక్ తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నిస్తోంది. ప్రశ్నపత్రం ముందుగానే బయటకు వెళ్లలేదని, కొందరు ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా మోసానికి పాల్పడ్డారని తప్పించు కునేందుకు ప్రయత్నిస్తుంది. ఢిల్లీలో సీజేపీ వెనుక ఆప్ హస్తం ఉన్నట్టు ప్రచారమున్న నేపథ్యంలో పంజాబ్‌లో ఆ పార్టీ మౌనం దాల్చింది. ఆ రాష్ట్రంలో ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా ఢిల్లీలో చూపిన ఉత్సాహం పంజాబ్‌లో చూపించలేదు.

పేపర్ లీక్‌పై ఈ మూడు ఘటనలను పోల్చి చూస్తే ఒక ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. కేంద్రంలో జరిగిన పరీక్షల వివాదంపై ఒక రకమైన రాజకీయ వైఖరి, కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్‌లో మరో రకమైన స్పందన, ఆప్ పాలిత పంజాబ్‌లో ఇంకో విధమైన రాజకీయ పోరు కనిపిస్తుంది. అధికారంలో ఎవరున్నారన్నది పక్కన పెడితే, పరీక్షల అక్రమాల విషయంలో రాజకీయ పార్టీల ప్రమాణాలు ఒకేలా ఉండవా? యువత భవిష్యత్తు రాజకీయాలకు అతీతమైన అంశం కాదా? అనే ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి.

మూడు చోట్ల జరిగిన పేపర్ లీకులలో మరో ముఖ్యమైన అంశం కూడా గమనిస్తే నీట్ వివాదం తర్వాత కేంద్ర ప్రభుత్వం విచారణతో పాటు సంస్థాగత సంస్కరణలు ప్రారంభించింది. కానీ ఝార్ఖండ్‌లో ఇప్పటికీ ప్రధానంగా సీఐడీ విచారణ, రాజకీయవిమర్శలకే వ్యవహారం పరిమితమైంది. పంజాబ్‌లో ప్రభుత్వం కేవలం ఆరోపణలను ఖండిస్తూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అయితే కేంద్ర ప్రభుత్వం చేపట్టినట్టు ఈ రెండు రాష్ట్రాల్లోనూ పరీక్షా వ్యవస్థను సమూలంగా మార్చే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, స్వతంత్ర సంస్కరణల కమిటీ, కొత్త రాష్ట్ర చట్టం లేదా నియామక సంస్థల పునర్వ్యవస్థీకరణ వంటి సంస్థాగత చర్యలు ఇప్పటివరకు ప్రకటించలేదు. కేంద్రంలోని ప్రభుత్వం విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయిస్తే, ఇది తమ విజయంగా చంకలు గుద్దుకుంటూ విద్యార్థుల ఉద్యమాన్ని హైజాక్ చేయడానికి ప్రయత్నించిన కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఝార్ఖండ్, పంజాబ్‌లో అదే తరహా చర్యలు తీసుకోకపోవడంతో దేశ ప్రజలకు వారి నిజస్వరూపం బట్టబయలైంది.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారవచ్చు. రాజకీయ పార్టీలు మారవచ్చు. కానీ పరీక్షల విషయంలో ప్రభుత్వాల నిబద్ధత మాత్రం మార కూడదు. యువత చేస్తున్నది రాజకీయ ఆరోపణలు కాదు. న్యాయమైన అవకాశాలు. హింసాత్మకమైన నిరసనలు కాదు. భవిష్యత్తులో ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా ఉండే వ్యవస్థను కోరుతున్నారు. లీకులు ఏ రాష్ట్రంలో జరిగినా ఒకే ప్రమాణంతో స్పందించి, ఒకే స్థాయి సంస్కరణలు అమలు చేసినప్పుడే ప్రజల విశ్వాసం నిలబడుతుంది. యువత భవిష్యత్తును కాపాడే పోరాటంలో రాజకీయ పార్టీలు గెలవడం కాదు, పారదర్శక వ్యవస్థ గెలవాలి. అదే దేశ భవిష్యత్తుకు నిజమైన భరోసా. ఈ సందర్భంగా "విద్యార్థులు, యువత రాజ కీయాలపై అవగాహన పెంచుకోవాలి, కానీ అంకితభావం, నైతికత కోల్పో కూడదు.." అని రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ అన్న మాటలకు ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో విలువ ఉంది. స్వార్థపూరిత శక్తుల, కుట్రపూరిత రాజకీయ పార్టీల చేతిలో దేశ విద్యార్థులు, యువత పావులుగా కాకుండా ఉంటే ఎలా ఉంటుందో జంతర్ మంతర్, ఝార్ఖండ్ విద్యార్థుల ఉద్యమాల మధ్య తేడాలే నిరూపిస్తున్నాయి.

**– శ్రీపాద**

## కథ

"అమ్మా!

సంబోధన 'ప్రియమైన' అని మొదలుపెట్టాలో, 'పూజ్యనీయ' అనాలో నాకింకా అర్థం కావడం లేదు. నిన్ను అనాలో, మీరు అనాలో కూడా నాకెప్పటికీ బోధ పడదేమో?

అందరూ అంటూ ఉంటారు అమ్మంటే ప్రేమకు ప్రతిరూపం, మమతకు ఆకారం అని.

చిన్నప్పుడు బడిలో చెప్పేవారు అమ్మ అంటే క్షమకు నిజమైన రూపం అని.

సృష్టికి మూలపురుషులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కంటె ఒక శక్తి ఉందని, ఆమెను ఆదిపరాశక్తి అంటారని గుడిలో ప్రవచనం చెప్తుంటే విన్నాను. 'అమ్మలగన్న అమ్మ చాలా పెద్దమ్మ' అని పోతన గారు నీ గురించి చెప్పారని విని, అబ్బురపడ్డాను.

అమ్మా !

అసలు నువ్వెక్కడ ఉంటావో నాకు తెలియదు. ఎలా ఉంటావో కూడా తెలియదు. నా దృష్టిలో వేలవేల రూపాల ఒకే ప్రతిరూపం నువ్వు.

అమ్మా!

కోప్పడను,ఏమనుకోను అని నువ్వు మాటిస్తే నీతో నా గుండె వేదన పంచుకోవాలని ఉంది. ఈ ప్రపంచంలో నా బాధను తీర్చగల ఒకే ఒక వ్యక్తివి నీవే. చెప్పనా అమ్మా.!?.

ఎలా కన్నావమ్మా? ఇలాంటి మూర్ఖులను. అదిగో నీ కళ్లు అప్పుడే సిందూర వర్ణ రంజితం కాబోతున్నాయి. నేను చెప్పేది పూర్తిగా విన్న తర్వాత నీకు ఏమనిపిస్తే అది చేద్దువు గానీ! అంతవరకు కాస్తా ప్రసన్నవదనంతో నా ఘోషను వినమ్మా.

దేవుళ్లు అంటే మన దేశంలో ఎంతటి భక్తి భావమో నీకు తెలియంది కాదు. దేవుని రూపం కనబడగానే కొందరు సాష్టాంగ ప్రణామాలు చేస్తారు. మరికొందరు నిలబడిన చోటనే చెప్పులు విప్పి, లెంపలు వేసుకుంటూ ప్రార్థన చేస్తారు. అంతటి భయభక్తులు మనవారికి దేవుడు అంటే.

కానీ అమ్మా! దేవుని చిత్రాలను అగరుబత్తుల ప్యాకెట్లపై, సరకులు వేసే సంచులపై ముద్రిస్తున్నారు. మొన్ననే ఇంటికోసం బియ్యం కొనడానికి వెళ్లా నమ్మా. ఆ కంపెనీ బియ్యం బాగుంటాయని అందరూ అంటారు. అవే కావాలని అడిగాను. షాపులో పనిచేసే కుర్రాడు అక్కడ ఉన్న బియ్యం బస్తాలపై కూర్చొని సెల్ ఫోన్లో వీడియోలు చూసుకుంటున్నాడు. లేచి, తను కూర్చున్న బస్తాను కిందకు లాగాడు. అప్పుడు చూశానమ్మా. గుండె పగిలిపోయింది. ఏదో తెలియని దుఃఖం కమ్ముకుంది.

అంతసేపు అతను కాళ్లను మఠంగా వేసుకొని కూర్చున్నది...ఎలా చెప్పనమ్మా?

రత్నభూషిత , పద్మాసన, మందస్మిత సుందర రూప లక్ష్మీదేవి వర్ణ చిత్రంపై.

మరొకటి కూడా గమనించాను. ఖాళీ అయిన బియ్యం సంచులు మూలన పడేసి, శుభ్రం చేసుకోవడానికి వాడుకుంటున్నారు.

చెప్పమ్మా! తప్పు ఎవరిది? చూడగానే నమస్కరించాలనే లక్ష్మీదేవి చిత్రాన్ని తమ వ్యాపార ప్రయోజనం కోసం బియ్యం బస్తాపై పెద్దగా ముద్రించిన వారిదా? ఆ బస్తాను కేవలం బస్తాగానే చూస్తూ, కాళ్లతో తొక్కుతున్న వారిదా?ఏదైనా మాకెందుకులే అనుకునే మాలాంటి వాళ్లదా?

దీపావళి వస్తే లక్ష్మీ బాంబుల అమ్మకాలు అగ్రస్థానం అందుకుంటాయి. వాటిపై లక్ష్మీదేవి సుందర రూపం. కానీ బాంబ్ పేలగానే ఆ చిత్రం తునాతునకలు అయిపోతుంది. చూస్తున్న నా గుండెల్లో బాంబుల మోత.

అగరుబత్తి ప్యాకెట్లు, బట్టల సంచులు, దీపావళి సామాన్లపై ఒకటేమిటీ చూడగానే గుర్తుపట్టి ఒక బ్రాండింగ్ ఏర్పరుచుకొనేలా వ్యాపార నిపుణులు అన్నింటిపై దేవుళ్ల చిత్రాలను ముద్రిస్తున్నారు. మనం వాటిని వాడిన తర్వాత చెత్తకుప్పలో పడేస్తున్నాం. కొన్నిసార్లు అశుద్ధంతో కూడా ఆ చిత్రాలు కలిసి పోతున్నాయి. దేవుని బొమ్మలు వేయకుండా బ్రాండ్ క్రియేట్ చేసుకోలేరా?

అమ్మా!

ప్రతి చిన్న విషయానికి మనోభావాలు దెబ్బ తిన్నాయనే అనేవారు వీటి



# శిక్షించు - రక్షించు

జి. వి. శ్రీనివాస్

విషయంలో మరెందుకు మౌనం వహిస్తున్నారో తెలియదు.

వాళ్లకు ఎవరు చెప్పాలమ్మా? గుడిలో అయితేనే దేవుడు గానీ, ఇవేవీ దేముని ప్రతిరూపాలు కావా? మార్పు ఎక్కడ నుంచి మొదలవ్వాలో చెప్పమ్మా?

అలాగే నువ్వు గమనించే ఉంటావు కదా! జనం ఒకప్పటిలా ట్రాఫిక్ రూల్స్‌ను గౌరవించడం లేదు. దూరంగా పోలీసును చూస్తేనే హెల్మెట్ పెట్టుకోవడం, దాటిపోగానే తీసి, బండికి తగిలించడం. అమ్మా! హెల్మెట్ అనేది మన రక్షణ కోసమే అని, పోలీస్ కోసం కాదని వీళ్లకి తెలియదా? తెలుసు, కానీ నిర్లక్ష్య భావన. రాంగ్ సైడ్‌లో రావడం గొప్ప అనుకుంటారు. ఎవరైనా అది తప్పు అని చెప్పే సాహసం చేస్తే.. అంతెత్తున లేచి విరుచుకుపడతారు. చూస్తూ మౌనంగా ఉండలేకపోతున్నాను. వాళ్ల నోటికి జడిసి, మూగనవుతున్నాను.

కుంకుమ ఇష్టపడే నా శ్రీమతికి ఇప్పుడు కుంకుమ అంటేనే భయపడుతుంది. బజార్‌లో కొన్న కుంకుమ పెట్టుకుంటే చర్మం దురద. అందమైన నుదురుపై మచ్చ మిగులుతుంది. రూపాయి సంపాదనే ముఖ్యమా? జనుల ఆరోగ్యంతో పని లేదా? అమ్మా! ప్రోటీన్ కోసం పన్నీర్ తినాలి అనుకుంటే అది కూడా కృత్రిమమే. చివరకు కమ్మగా తినే పెరుగును కూడా పాలు వాడకుండా పౌడర్లు, రసాయ నలతో తయారుచేసి, జనాల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారు. ఆ జనాల్లో వాళ్ల కుటుంబాలు, స్నేహితులు ఉంటారనే స్పృహ కూడా ఉండదేమో ఆ వెధవలకు. క్షమించు అమ్మా! కోపంతో మాట జారాను.

మతం పేరుతో దారుణాలు. ఇంతకాలం గుర్తురాని పురాతనవాదం ఇప్పుడే గుర్తుకు వచ్చింది. మతం అంటే మూర్ఖత్వం కాదని, మానవత్వమే అసలైన మతమని, అదే సర్వజన సమ్మతం అని ఎప్పుడు తెలుసుకుంటారు?. మతం అంటే అందరినీ కలిపేదే గాని విడదీసేది కాదని ఎప్పుడు నేర్చు కుంటారు?

ప్రాచీనతే తమ మార్గం అనుకునే వారికి అసలు ప్రాచీనకాలంలో సమాజ వ్యవస్థ ఎలా ఉండేదో కనీస అవగాహన కూడా లేదేమో అనిపిస్తోంది వారి వాదనలు వింటే. అప్పట్లో వర్ణ వ్యవస్థే గాని కుల వ్యవస్థ లేదని, ఒకే వృత్తి చేసే వారందరూ ఒకే వర్ణం అని వీరు ఎప్పుడు తెలుసుకుంటారు?

పేపర్ తిరగేస్తే చాలు అభం, శుభం తెలియని పసివాళ్లపై లైంగిక దాడులు. ఆస్తి కోసం కన్నవాళ్లనే పొట్టన పెట్టుకుంటున్న వైనాలు. పరువుహత్యలు. ప్రియుడి కోసం భర్తనే చంపించే భారతనారీలు. ఏమిటమ్మా ఈ దారుణాలు?

దీపావళి వస్తే లక్ష్మీ బాంబుల అమ్మకాలు అగ్రస్థానం అందుకుంటాయి. వాటిపై లక్ష్మీదేవి సుందర రూపం. కానీ బాంబ్ పేలగానే ఆ చిత్రం తునాతునకలు అయిపోతుంది. చూస్తున్న నా గుండెల్లో బాంబుల మోత.

అగరుబత్తి ప్యాకెట్లు, బట్టల సంచులు, దీపావళి సామాన్లపై ఒకటేమిటీ చూడగానే గుర్తుపట్టి ఒక బ్రాండింగ్ ఏర్పరుచుకొనేలా వ్యాపార నిపుణులు అన్నింటిపై దేవుళ్ల చిత్రాలను ముద్రిస్తున్నారు. మనం వాటిని వాడిన తర్వాత చెత్తకుప్పలో పడేస్తున్నాం. కొన్నిసార్లు అశుద్ధంతో కూడా ఆ చిత్రాలు కలిసి పోతున్నాయి.

ఎంత అమ్మ అయితే మాత్రం ఇంతటి క్షమ పనికిరాదమ్మా!.

మేము చెప్తే ఎట్లాగూ ఈ నీచులు మారరు. ఈ పాడు పనులు చేసేవాళ్లు కూడా ఒక తల్లి బిడ్డలే కదా!ఇంటికి వచ్చినప్పుడు నీ బిడ్డలకు నువ్వాయినా చెప్పొచ్చు కదమ్మా.

నీ బిడ్డే కదమ్మా!? నువ్వు చెప్తే వింటారు. తల్లిగా దండించే హక్కు నీకుంది. గట్టిగా బుద్ధి చెప్పు. లేదంటే కాళికవై ఈ విషపురుగులను ఏరి వెయ్యి తల్లీ!

ఈ అక్షర నివేదన ప్రతీ తల్లి చదువుతుందని, తన బిడ్డనయినా బాధ్యతగల పౌరునిగా తీర్చిదిద్దుతుందని ఆశతో...

ఈ ఉత్తరం చదివి, తన బిడ్డలకు మంచి బుద్ధులు నేర్పే మాతృమూర్తులకు వందనాలతో ..."

**ఇట్లు**

**నీ బిడ్డ**




# సుధావాహిని

**విద్యానగర సభా ప్రాంగణాన మంజుల మంజీర ధ్వనులు నాట్యమాడి కాలవశాన నిలిచిపోయిన ఆంధ్ర కవితా శారద, మరికొంత కాలానికి తంజాపురి విజయభవన సభా సదనంలో అందచందాలతో అవతరించింది. కృష్ణదేవరాయలే తిరిగి రూపుగొన్నాడా? అన్నట్టుగా రఘునాథ భూపాలుడు; అల్లసానిపెద్దన అచ్చున వచ్చినట్లుండే చేమకూర వేంకటకవి; భువన విజయమే పునర్నిర్మితమైనదా? అనిపించే విజయ భవనం.. తెలుగు సరస్వతి ఆ నగరిలో కొలువు దీరింది. దాని ఫలితంగానే వెలువడింది శృంగార రస ప్రధానమైన 'విజయ విలాసం' చక్కెర మడిలో అమృతం పారించిన కావ్యంగా వినుతికెక్కింది.**

చేమకూర వేంకటకవి కావ్యాల్లో తెలుగు భాష అందచందాలు వయ్యారాలు ఒలకబోస్తూ ఎంతో మనోహరంగా ఉండేవి. ముఖ్యంగా ఒక పదం నామ వాచకంగానూ, క్రియాపదంగానూ వాడే చమత్కారం ఆ కవి ప్రత్యేకత. అందుకే రఘునాథ రాయలంతటి కవి. 'క్షితిలో నీ మార్గమెవరికిన్ రాదు సుమీ' అని కీర్తించాడు.

**పాఱ చూచిన రిపుసేన పాఱజూచు**
**అర చందమామ నేలిన దొరగా నెన్నుదురు నెన్నుదురు**
**మనసు భద్రమయ్యే మన సుభద్రకిపుడు**
**అందందు నరుగ నరుగానరుగా?**

"మామ కాగమ వార్త" వంటి సభంగ శ్లేషలు ఎక్కువగా చేమకూర ఎక్కువగా వాడారని ఆచార్య మలయవాసిని ('ఝుమ్మందినాదం' పుస్తకంలో) పేర్కొన్నారు.

దక్షిణాంధ్ర యుగంలో వెలసిన ఆంధ్ర ప్రబంధాల్లో 'విజయ విలాసం' మేలుబంతి. ఈ కావ్యంలో..విజయుడు ముగ్గురు కన్యల్ని వివాహం చేసుకొని, పుత్రలాభం పొందిన ఘట్టాలు వర్ణితమయ్యాయి. అంటే నాయకుడొకడు, నాయికలు ముగ్గురు(ఉలూచి, చిత్రాంగద, సుభద్ర).చేమకూర ఈ కావ్యాన్ని రఘునాథరాయలుకే అంకితమిచ్చాడు.

'అపాత్రదానం కూడదు. రఘునాథ భూపాలు డనేక మంచి గుణములు కలవాడు. రఘునాథుడు చంద్రుని వంటి కాంతిని, సహస్రముఖుడైన ఆదిశేషుని మాటకారితనం, బుధుని వంటి వివేకాన్ని, శుక్రాచార్యుని వంటి నీతిని, మహేశ్వరుని వంటి ఐశ్వర్యాన్ని కలిగినవాడు. అంతేకాదు చక్కని పరి పాలనా దక్షత, భోగానుభవము, సమరస భావము, ప్రశస్తమైన కవితాగుణము, అపారమైన జ్ఞానము ఆయనకు ఉన్నాయి కనుక కృతి భర్తగా ఆయన అన్నివిధాల తగినవాడు' అని చేమకూర పద్యరూపంలో చెప్పారు.

రఘునాథ రాయలకు శ్రీరామచంద్రుడు ఇష్టదైవం. అందుకే కవి కావ్యా రంభంలో...

**"శ్రీ లెల్లప్పుడొసంగ, నీ సకల ధాత్రీ చక్రమున్ బాహువీ / థీలగ్నంబుగ జేయ, దిగ్విజయ మీన్ డీకొన్న చందాన, నే**
**వేళన్ సీతయు లక్ష్మణుండు దను సేవింపంగ విల్పూని, చె / ల్వొలీలన్ దగు రామమూర్తి రఘునాథాదీశ్వరున్ బ్రోవుతన్"**–అని స్తుతించాడు.

రఘునాథుడు కవి చేమకూర గురించి చెపుతూ–

**"ప్రతి పద్యము నందు జమ**
**త్కృతి గలుగం జెప్పనేర్తు; వెల్లెద బెళుకొ**
**కృతి వింటి మపారముగా**
**క్షితిలో నీ మార్గమెవరికిన్ రాదు సుమీ".**

'సొగసుగా ఉండే ఈ కావ్యాన్ని చాలాసార్లు తృప్తి కలిగేటట్లుగా విన్నాం. నీవు రాసే ప్రతి పద్యంలోను చమత్కారాన్ని ప్రదర్శిస్తావు. అంటే శబ్దంలోనో, భావంలోనో, అర్థంలోనో, చమత్కృతిని పొందు పరచి కవిత్వం రాయడంలోనూ,అర్థరస భావ అలంకారాది విషయాలన్నింటిలోను సమర్థుడవు. నేర్పుతో కూడిన ఈ కవితా పద్ధతి ఎవరికి సాధ్యం కాదు' అని ప్రశంసించడంలో రెండు విషయాలు స్పష్టమవు తాయి. చేమకూర వారి కవితా సౌరభాన్ని రఘునాథుడు పరిపూర్ణంగా ఆస్వాదించడం ఒకటి కాగా, ఆనాటి రాజులు కవులను ఎంత ఘనంగా గౌరవించేవారో అనేది రెండవది.

చేమకూర రచనలో ప్రతి పద్యంలోనూ చమత్కృతి ఉంటుందనీ, ఈ కవిత్వ పద్ధతి అన్యులకు సాధ్యం కాదన్న రఘునాథుని మాటను నాటి నుంచి నేటి కవులు, పండితులూ, విమర్శకులవరకు అంగీకరించిన వాస్తవం.

ఇంద్రప్రస్థ పురాన్ని వర్ణించే పద్యంతో కథను ప్రారంభించాడు కవి. ఆ నగరాన్ని పాలిస్తున్న ధర్మరాజు గుణగణాలను వెల్లడించాడు. 'లోకంలో రాజులకు ఒక లోపం ఉంటుంది. తాము ఆజ్ఞలు జారీ చేస్తారేగాని అవి తమకు కూడా వర్తిస్తాయని భావించరు. కానీ ధర్మరాజు అటువంటివాడు కాదు..ఆజ్ఞా పరిపాలనా వ్రతుడు" అని చెప్పాడు. అంటే ఆజ్ఞలను అమలు చేయడంలో ప్రజలకు ఆదర్శంగా ఉంటాడు.

ఈ కావ్య కథానాయకుడైన అర్జునుణ్ణి ...

**'అతని నుతింప శక్యమె! జయంతుని తమ్ముడు సోయగంబునన్ /బతగకులాధి పధ్వజుని ప్రాణసఖుండు కృపారసమ్మునన్**
**క్షితిధర కన్యకాధిపతికిన్ బ్రతిజోదు సమిజ్జయంబునం / దతని కతండెసాటి చతురబ్ధి పరీత మహీతలంబునన్'...** అని పరిచయం చేశారు


అందంలో జయంతుని తమ్ముడు, దయారసంలో పక్షీంద్రుడైన గరుత్మంతుణ్ని ధ్వజంగా కలిగిన విష్ణు స్వరూపుడైన శ్రీకృష్ణుని ప్రాణ స్నేహితుడు, యుద్ధంలో పార్వతీపతి ఈశ్వరునికి పోటీ నిలిచేటంతటి వీరుడు. నాలుగు సముద్రాలు ఆవరించిన ఈ భూలోకంలో

**అర్జునుడు ఇంద్రప్రస్థం వదలి భూప్రదక్షిణకు బయలుదేరాడు. ప్రయాణ సందర్భంగా సామంత రాజులిచ్చిన కానుకలను గ్రహించాడు, పావన సరస్సులలోను, నదుల్లోను స్నానాలు చేస్తూ తీర్థయాత్ర కొనసాగించాడు. తనకు అవ్వయైన గంగానదిని చూడగానే, అధికాసక్తితో అక్కడి స్వచ్ఛమైన నీటిలో స్నానమాడాడు. అతను ఆ నదీ తీరంలో విడిది చేసినప్పుడు, భాగీరథిని దర్శించడానికి వచ్చిన నాగకన్య 'ఉలూచి'కి, సుందరాకారుడైన అర్జునుడు ప్రథమ దర్శనంలోనే ఆకర్షించాడు.**

అర్జునుని అందానికి, దయాగుణానికి, యుద్ధంలో చూపే శౌర్యానికి అతనికతడే సాటి..అంటూ ఉపమానాలను చక్కగా ఉపయోగించుకున్నాడు కవి.

ఇక కథానాయిక సుభద్రాదేవి.. నిండు యౌవనంలో ఉంది. ఆమె మాట్లాడితే చిలకలను అభిమానించినట్లుగా ఉంటుంది. ఆమె కన్నులు చాలా అందమైనవి చకోరపక్షిలా. హంసనడక. 'మనసు భద్రమయ్యే మన సుభద్రకిపుడు' అని వాడాడు కవి.

ఒక బ్రాహ్మణుని ఏకైక ధనమైన ఆవును దొంగలెత్తుకొని పోయినారు. ఆ బ్రాహ్మణుడు పరుగున వచ్చి అర్జునుడికి మొరపెట్టుకున్నాడు. దొంగను శిక్షించి తన ఆవును తిరిగి ఇప్పించమని ప్రార్థించాడు. ఈ కార్యసాధనకు అర్జునికి విల్లు, అంబులూ అవసరమైనాయి. వాటిని గ్రహించేటందుకు ధర్మరాజు ద్రౌపది ఉన్న కేళీగృహం వైపు వెళ్లవలసి వచ్చింది. ఫలితంగా,




# "విజయ విలాసం"

వారి పూర్వ ప్రతిజ్ఞ ప్రకారం, అర్జునుడు ఏడాది పాటు భూప్రదక్షిణం చేసి రావలసి వచ్చినది.

అర్జునుడు ఇంద్రప్రస్థం వదలి భూప్రదక్షిణకు బయలుదేరాడు. ప్రయాణ సందర్భంగా సామంతులైన రాజులిచ్చిన కానుకలను గ్రహించాడు, పావన సరస్సులలోను, నదుల్లోను స్నానాలు చేస్తూ తీర్థయాత్ర కొనసాగించాడు. తనకు అవ్వయైన గంగానదిని చూడగానే, అధికాసక్తితో అక్కడి స్వచ్ఛమైన నీటిలో స్నానమాడాడు. అతను ఆ నదీ తీరంలో విడిది చేసినప్పుడు, భాగీరథిని దర్శించడానికి వచ్చిన నాగకన్య 'ఉలూచి'కి, సుందరాకారుడైన అర్జునుడు ప్రథమ దర్శనంలోనే ఆకర్షించాడు.

'ఈ నరుడు ఎవరు? 'ఈతడు మన్మథుడిని కూడా గెలవజాలిన సౌందర్య వంతుడు.వీరత్వంలోనూ, విలాసంలోనూ ఏ రాజు ఇతనికి సమానం కాలేదు' అనుకొంది.

**"నువ్వు బువ్వు నవ్వు జవ్వని నాసిక**
**చివురు నీవురు జవురు నువిదమోవి**
**మబ్బు నుబ్బు గెబ్బు బిబ్బోకవతివేణి**
**మెఱపు నొఱపు బఱపు దెఱవమేను"**

అర్జునుని అందానికి వశమైన ఉలూచి క్షణాల్లో అతన్ని నాగలోకం తీసుకు వెళ్లింది. కళ్లు తెరచి చూచిన అర్జునుడి ఎదుట మనోహరాంగి నిలిచి ఉంది. ఆమె అందాన్ని మననం చేసుకుంటున్నాడు. ఆమె (ఉలూచి) ముక్కు నవ్వ పువ్వును కూడా పరిహసించేటంత అందం, అధరము చివురుటాకు సౌకుమార్యం, సుందరమైన నల్లటి కొప్పు, ఆ కాంత శరీరం మెరుపు తీగకాంతిని మించి ఉందట.

ప్రేయసి ఉలూచితో పాణిగ్రహణ విధిని నిర్వర్తించాడు.తీర్థయాత్ర కొనసాగింపుగా, మణిపురం చేరి, అక్కడి ఉద్యానవనంలో విహరిస్తున్న మలయధ్వజ కుమార్తె చిత్రాంగద అందచందాలకు ముగ్ధుడయ్యాడు. అయితే ఇక్కడ చిత్రాంగదను అర్జునుడు చూచినాడు కాని, ఈ కురువీరుణ్ణి ఆమె చూడలేదు.

**'అపుడు నృపుడు ప్రఫుల్ల నవాంబుజ ప్ర**
**సన్న ముఖుడయి మలయధ్వజ క్షితీశ**
**కమల హితునకు మామకాగమ వార్త**
**దెలుపు మనుచు విశారదు బిలిచి పనిచె'**

చిత్రాంగదను చూచినప్పటి నుంచి ఆమెపై వలపు విరహంగా మారింది. ఇంక ఆ రాత్రి ఎలానో గడిపి ప్రభాత సమయంలో సచివుడు విశారదుని పిలిచి,తన రాక గురించి మలయధ్వజుడికి తెలియచేయాలని ఆదేశించాడు. ఆ అభిప్రాయాన్ని చమత్కారంగా అర్జునుని నోట చెప్పించినాడు కవి.


మామక + ఆగమన వార్త – అంటే నా రాకను గురించిన వార్త తెలుపుము.

మామకు + ఆగమన వార్త – మామలాంటి వాడు (అతని కూతురును తాను వివాహం చేసుకొనబోతున్నాడు కాబట్టి) అయిన రాజుకు నా రాక గురించి చెప్పమనడం రెండవ అర్థం.అర్జున, చిత్రాంగదల పెళ్లి జరిగింది.

అనంతరం ద్వారక చేరిన అర్జునుడు, ప్రియురాలు సుభద్ర సౌందర్యం తనివితీరా చూడవచ్చని సంతసించాడు. అయితే యతిగా వెళితే పనిసానుకూలమవుతుందని భావించి సన్యాసి వేషం ధరించాడు. ఆయనకు కొన్నాళ్లు సపర్యలు చేసిన సుభద్రతో,' 'ఓ సుందరీ! అందమైన మంచి చిలుక నీ చేయిపట్టుకొన్నది, శ్రేష్ఠమైన హంస నీకు సన్నిహితంగా వచ్చి నీ కాలు తొక్కింది. ఈ రెండు కూడా మంచి శకునాలే. త్వరలోనే నీకు వివాహం జరుగుతుంది.' అని చెప్పింది. దాంతో యతిరూపంలో ఉన్నవాడు అర్జునుడని, తన కోసం ఈ రూపంలో ద్వారకానగర ఉద్యానవనంలో ప్రవేశించాడని సుభద్రకు తెలిసింది. అర్జునుడు తన కోర్కెను వెల్లడించి, అనురాగంతో ఆమె చేయిపట్టుకొన్నాడు. సుభద్ర చేతిని సున్నితంగా విడిపించుకొంటూ 'పెద్దలున్నారు. వారు సంగతి తెలుసుకొని వివాహం చేస్తారు. ఇంతగా తొందర పడడం తగదు', అంటూ అంతఃపురానికి వెళ్లిపోయింది. వారికి అనతికాలంలోనే వివాహమైంది.

**'కలయగ మంచి లగ్నమిది, గట్టిగ నేగడె**
**లెన్ని యయ్యెనో / తెలిసెద నంచు నోర్తు,**
**జనుదేరద దే మని యోర్తు నెచ్చెలిన్**
**బిలిచెద నంచు నోర్తు, నొక పేరిడివా**
**రిటులేగి రంద; ఆ /చ్చెలియల వెంటనే సగము**
**సిగ్గరిగెన్ దరుణీలలామకున్'** అని శోభన ఘట్టాన్ని వివరించారు కవి చేమకూర.

చేమకూర వారి కవిత్వం గురించి ఎంత చెప్పుకున్నా తనివి తీరదు. 'సామెతలతోను శబ్దాలంకరములతోనూ నిండియుండి యర్థ గౌరవములు కలదయి రసవంత మయి యున్నందున చేమకూర వేంకటకవి కవిత్వము సర్వజనాదరణీయమయినదని తలచుచున్నాను' అని సెలవిచ్చినారాంధ్ర కవి చరిత్రకారులు.'ఈ చేమకూర చక్కెర మడిలో నమృతము పారించి పెంచినది కాని మట్టిలో నీరు పారించి పెంచినది కాదు' అని కళాప్రపూర్ణ వేదం వేంకటరాయ శాస్త్రి శ్లాఘించారు.



**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

# విద్యార్థి జీవితం ఆదర్శం

**గురూజీగా ప్రసిద్ధి చెందిన శ్రీ మాధవరావు సదాశివ గోల్వాల్కర్ ఆర్ఎస్ఎస్‌కు రెండవ సర్‌సంఘచాలక్‌గా 1940లో బాధ్యత స్వీకరించి 33 సంవత్సరాలపాటు యావత్ భారతదేశం పర్యటించి భారతీయ ఆత్మను అర్థం చేసుకున్న గొప్ప సామాజికవేత్త. వారు ఆజన్మాంతం భారతజాతి నిత్య యవ్వనానికి ప్రేరణదాతగా వివిధ సందర్భాలలో యువకులకు ఇచ్చిన మార్గదర్శనం, స్ఫూర్తి నేటికి కూడా అర్థవంతమైనదే.**

**దేశం వికాసం జ్ఞానం పాత్ర:** నీ చదువుపై దృష్టి కేంద్రీకరించు. మన యువకులు పరిజ్ఞానాన్ని విదేశాలలో ఆర్జించి శీఘ్రంగా స్వదేశానికి తిరిగి వచ్చెయ్యాలి. తద్వారా వాళ్లు మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాలలో సమానంగా అభివృద్ధి చేయాలి.

మన పురాణాలలో కచ దేవయానుల కథ ఉంది. అందులో దేవగురువు బృహస్పతి కుమారుడైన కచుడు మృతసంజీవనీ విద్యను నేర్చుకొనడానికై రాక్షసుల గురువు శుక్రాచార్యుని వద్దకు వెడతాడు. విద్యను సాధించి తిరిగి దేవలోకానికి తిరుగు ప్రయాణం అవుతుండగా అతడిని శుక్రాచార్యుని కుమార్తె దేవయాని వివాహమాడగోరుతుంది. కచుడు అందుకు అంగీకరించదు. ఎందుచేతనంటే అతడు వచ్చినది విద్యనేర్వడానికే గాని భార్యను సంపాదించు కొనడానికి కాదు.

**విద్యార్థి జీవనం ఆదర్శవంతంగా ఉండాలి :** మీరు చదువును నిర్లక్ష్యం చెయ్యడం ఉచిదం కాదు. తమ బాధ్యతలను తగురీతిలో అర్థం చేసుకున్నవారివల్లనే ఉత్తమ కార్యాలు జరగగలవు. పనిచేసే సమయంలో పరిచయంలోకి వచ్చే వారెవరంటే కుటుంబం, పొరుగువారు, సహాధ్యాయులు, విద్యాలయం అధికారులు. వీరందరితోను ఉత్తమరీతిలో వ్యవహరిస్తూ జీవితంలోని ఈ అన్ని అంశాలలోను ఆదర్శాలను నెలకొల్పడం అవసరం. కనుక మంచి విద్యార్థి జీవనం– అనగా మంచి రీతిలో ఉత్తీర్ణులు కావడం, అందు నిమిత్తమై నియమానుసారంగా చదవడం ఆవశ్యకం.

**పత్రికా రచన సరైన రీతిలో ఉండాలి :** మీరు ఉన్నత విద్య కొరకై అమెరికా వెడుతున్నారు. మీరు అక్కడ చేసే అధ్యయనంలో కృతార్థులై చక్కని పత్రికా రచన చేయగల నిపుణులై తిరిగి రావాలని కాంక్షిస్తున్నాను. సమాజానికి హాని కలిగించేటంత నీచస్థాయి పత్రికారచన ప్రస్తుతం మన దేశంలో కానవస్తూంది. ఎంతో ప్రాముఖ్యం గల ఈ రంగంలో కాస్త సంయమనం, వివేకం అవసరం.

**సంఘం సత్ప్రవర్తనను ఉత్పత్తి చేసే కార్ఖానా**

"సంఘంలో సత్ప్రవర్తన గురించి ఏ పాఠాలూ బోధించబడవు. ఇక్కడ ఉండేది ప్రత్యక్షమైన, సజీవమైన ఆదర్శాలు. ఇది దేశం కొరకై సర్వస్వాన్ని త్యాగం చేసి, యావచ్ఛక్తితో సమాజసేవ చేసే ఒక చైతన్యయుక్తమైన మహాయోజన. ఇది ఒక కార్ఖానా. నేను ఈనాడు ఒక విశ్వవిద్యాలయంలో నిలబడి ఉన్నాను. విశ్వవిద్యాలయం కేవలం జ్ఞానాన్ని ఇస్తుంది. సచ్ఛీలతను ఇవ్వని జ్ఞానం చెత్తబుట్టలో పారెయ్యదగినది. స్వార్థచింతనను తుచ్ఛంగా భావించి త్యజించి దేశం కొరకై సర్వస్వార్పణ చేసే ప్రవృత్తి ఏ జ్ఞానంవల్ల కలుగదో అటువంటి జ్ఞానాన్ని అందించే విద్యా ప్రణాళిక నిరర్థకం. ఈనాడు ఉన్న పరిస్థితి క్లిష్టమైనదే, కాని ఆశాశూన్యమైనది కాదు. నేడు విద్యార్జన చేస్తూన్న విద్యార్థులు రేపు సమాజానికి ఉపయోగపడతారు. వట్టి మాటలతో కాదు, తమ నిస్వార్థ సేవతో జాతీయ శీలపు ప్రత్యక్షాదర్శాలను సమాజంలో నిలబెడతారు. ఈ ఆశతోనే నా అభిప్రాయాలను మీ ముందు వెల్లడిస్తున్నాను.



అధిక ప్రాముఖ్యం గల సమస్య: ఈ మన యువకుల మహావిశాల సముదాయాన్ని మహనీయ సమాజ రచనకు యోగ్యులుగా, గుణసంపన్నులుగా, నాగరికులుగా తీర్చిదిద్దడం ఎలాగన్నదే నేటి నిజమైన సమస్య. యాంత్రికమైన ఆలోచనలవల్ల, పై పూత చర్యలవల్ల ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. ఈ పడికట్టు మాటలు ఏ ప్రయోజనాన్ని కలిగించవు. ఉదాహరణకు ఈ ప్రశ్న మాలికలో శైక్షణిక సంస్థలు, బోధకుల–విద్యార్థుల నిష్పత్తి, వారి పరస్పర సంబంధాలు, వసతి గృహ వ్యవస్థ మొదలైన విషయాల గురించిన ప్రశ్నలు ఉన్నాయి. కాని ఈ ప్రశ్నలు సమస్య మూలం వరకు వెళ్లేవిగా లేవు. సంస్థలు ఎలా నడుస్తున్నాయన్న దానికన్నా విద్యా బోధన ఈ లక్ష్యంతో, ఏ ఆశయంతో జరుగుతోంది, గుణసంపద విషయంలో అధ్యాపకుల స్థాయి, వసతి గృహ ప్రముఖుల స్థాయి ఎటువంటిది – అన్న ప్రశ్నలు మరింత ముఖ్యమైనవి. దేశమంతటిలో వీటి చుట్టూ ఎటువంటి వాతావరణం ఉందీ అన్న విషయాన్ని మనం సమర్థవంతంగా పరిశీలించాలి.

**దృశ్య శ్రవ్య సాధనాలు :** నేటి విద్యాబోధనలో దృశ్య – శ్రవ్య సాధనాల జోరు ఎక్కువగా ఉంది. ఇది సరైనదే. బోధనలోను, శీల నిర్మాణంలోను ఈ సాధనాలు చాలా ఉపకరిస్తాయి. కాని నేడు ఈ సాధన శక్తిని దుర్వినియోగం చెయ్యడమే ఎక్కువగా జరుగుతోంది. పత్రికలలో, గోడలమీద, ఇళ్లపైన ఎక్కడెక్కడ దృష్టి వాలుతుందో అక్కడల్లా ప్రకటనలు ప్రత్యక్షమౌతున్నాయి. రేడియోల ద్వారా, ఆంప్లిఫైయర్ల ద్వారా, ట్రాన్సిస్టర్ల ద్వారా అశ్లీల గీతాల హోరు చెవులను దిమ్మెక్కించేస్తోంది. ఎప్పుడు చూసినా కోలాహలమే. చెవులకు, కళ్లకు అడుగడుగున ఉద్రేకపరచే పాటలు, బొమ్మలు ఎదురౌతున్నాయి. వీటివల్ల యువకుల మనస్సులలో నైతికస్థాయి ఎంత దిగజారగలదో ఊహించుకోవడం కష్టంకాదు."

**మౌలిక దృక్కోణం :** మనం ఆలోచించే పద్ధతిని

## గా ఉండాలి

సరిచేసుకోవాలి. మన జీవితం మూల భూతమైన తత్త్వాన్ని మనసులలో ప్రతిష్ఠించుకోవలి. వ్యక్తి జీవితాన్ని, రాష్ట్ర జీవితాన్ని పరిపూర్ణం చేసే విలువలను మనం స్వీకరించాలి. ఇదే ప్రస్తుత కాలపు ఆవశ్యకత. ఈ విలువల లోపమే ఇప్పుడు విద్యార్థులలో క్రమశిక్షణా రాహిత్యం ఇతర సామాజిక దోషాల మూలాలతో పెనవేసుకొని ఉంది. విద్యార్థుల క్రమశిక్షణా రాహిత్యపు సమస్యను దానిలో ముడిపడి విషయాల నుంచి వేరుచేసి చూసి పరిష్కారాన్ని వెతకడంవల్ల ఏ ఉపయోగము ఉండదు. దీని పరిష్కారానికి మనం లోతైన చర్యలు చేపట్టక పోయినట్లయితే, ఇతరమైన పైపై నివారణ చర్యలు ఏ సత్ఫలితాలను ఇవ్వవు."

**ప్రగతి అంటే ఏమిటి?:** శ్రీ గురూజీ అలహాబాదు యూనివర్సిటీకి ఆహ్వానించబడ్డారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ ఆయన "ప్రగతి అంటే ఏమిటి? ప్రతి కదలిక ప్రగతి అవుతుందా? ఒకడు కొండశిఖరం మీద నుండి కిందపడి – చూడండి, నేనెంత ప్రగతి సాధించానో అంటే ఎలా ఉంటుంది? ఎవరైనా నాయకుడు దేశాన్ని గోతిలో దింపుతూన్నట్లయితే అతడు నాయకుడు కాదు. శిఖరానికి చేరుకోవడానికి అడ్డదారులుండవు. ఒక్కొక్క అడుగూ బలంగా వేస్తూ పైకి ఎక్కవలసి ఉంటుంది. కష్టపడాలి, సాధన చెయ్యాలి, అప్పుడు శిఖరాన్ని చేరగలగుతాము. శిఖరం మీద నుంచి కిందకు అడ్డదారి ఉంటుంది. పై నుంచి కిందపడడం సులువే" అన్నారు.

**సత్ప్రవర్తనతో తల్లిదండ్రులు అనుకూలం చేసుకోవాలి:** ఇండోర్ సంఘశిక్షావర్గలో శ్రీ గురూజీ రాజస్థాన్ నుంచి వచ్చిన యువకార్యకర్తలతో సంభాషిస్తున్నారు. ఒక స్వయంసేవకునితో మాట్లాడుతూండగా అతడు తన ఇంటి వ్యవహారాలను నిర్లక్ష్యం చేస్తున్నాడని తెలియవచ్చింది. అతడు తన తల్లిదండ్రులకు తగిన మర్యాదనిచ్చి మాట్లాడటం లేదు. తన తండ్రికి సంఘం అంటే సదభిప్రాయం లేదన్న కారణంతో ఆ స్వయంసేవకుడు ఇంట్లో సరిగ్గా ప్రవర్తించటం లేదు. అతడిని ఉద్దేశించి శ్రీ గురూజీ ఇలా అన్నారు: ఇంట్లో తల్లిదండ్రులను, ఇతర పెద్దలను గౌరవిస్తూ, సంఘకార్యాన్ని మనసులో దృఢంగా నిలిపి ఉంచుకుంటూ ఇంటి పనులన్నిటినీ సక్రమంగా నిర్వర్తించడం స్వయంసేవకుని మొదటి కర్తవ్యం. తల్లిదండ్రుల ఆజ్ఞని ఉల్లఘించకూడదు. వ్యక్తిగత జీవితాన్ని పూర్తిగా విడిచిపెట్టి సంఘకార్యానికే పూర్తిగా అంకితంకావాలన్న కోరిక మనస్సులో బలంగా ఏర్పడితే అప్పుడు మాత్రమే కాస్తోకూస్తో తల్లిదండ్రుల మాటను పాటించక పోవడం, ప్రచారక్‌గానో పని చెయ్యడం జరుగుతుంది. అలా మొదట్లో కాస్త ఘర్షణ ఏర్పడినా, తమ కుమారుని జీవితంలో సంఘకార్యానికే పూజ్యస్థానం ఉందని, తన జీవితాన్ని శీల పరిపూర్ణం చేసుకొని సమాజ సేవలో వినియోగించాలన్న ఏకైక వాంఛ మాత్రమే అతడిలో కనబడుతూందని అర్థమయ్యాక ఆ తల్లిదండ్రులు కూడా తప్పకుండా సంఘాన్ని ప్రశంసిస్తారు. వారు కూడా కోరుకునేది తమ కుమారుని సంతోషాన్నే, సంఘ కార్యంతో మాత్రమే అతడికి సంతోషం కలిగినట్లైతే వారు కూడా సంఘం పట్ల అనుకూల భావం గలవారే అవుతారు.

జాతీయ భావ జాగరణలో చాలా విషయాలు ఇమిడిఉంటాయి. మన వారసత్వం, ఉన్నత పరంపర, జాతీయ దృష్టికోణం మొదలైన అనేక విషయాలు అందులోకి వస్తాయి. ఇతర దేశాల పట్ల మన వైఖరి కూడా దానికి సంబంధించిన అంశమే. జాతీయ భావజాగరణకు భారత్‌లో ప్రయత్నం జరగటంలేదు. ఇది దయనీయ పరిస్థితి. ఇండో నేషియాలోను, మలేషియాలోను సీత (వాళ్లు సిందా అంటారు), శ్రీ రామచంద్రుని చిత్రకథలను ప్రచు రించి తమ ప్రాచీన పరంపర గురించిన అవగాహ నను కొత్తతరంవారికి అందించే ప్రయత్నాలు చేస్తు న్నారు. ఈ పుస్తకాలను నేను చూశాను. తమ ఆరాధనారీతి ఇస్లాం అయినా తమ పరంపర హిందూ పరంపర అని అక్కడి పరిపాలకులు అర్థం చేసుకుంటున్నారు.

ఇలాంటి పుస్తకాలనే క్రైస్తవ మిషనరీలు ప్రచు రించి బాలబాలికల మస్తిష్కాలలో క్రైస్తవ సిద్ధాంతాల ప్రభావాన్ని నింపేందుకు ప్రయత్ని స్తూన్నట్లు మీరు గమనించే ఉంటారు. ఈ మిషనరీలు ఒక కొత్త ఎత్తుగడను ప్రారంభించారు. తమ కథలలోని పాత్రలకు వాళ్లు రాముడు, కృష్ణుడు, గోవిందు మొదలైన పేర్లు పెడతారు. కాని కథలలోని విషయం మాత్రం క్రైస్తవ సిద్ధాంతాలకు సంబంధించినదై ఉంటుంది.

**దేశభక్తి వ్యాపారంకాదు :** ఒకప్పుడు సంఘ సంస్థాపకులైన డాక్టర్జీ ఇంటిగోడ కూలిపోయింది. దాన్ని మళ్లీ ఎప్పుడు కడతారని ఎవరో అడగగా "మెల్లి మెల్లిగా అది జరుగుతుంది" అని జవాబిచ్చారు. ఆ ప్రశ్నించిన వ్యక్తి "సమాజం కోసం ఇంత పనిచేస్తు న్నారు. ఒక్కగోడ కట్టుకోవడానికి మీ దగ్గర డబ్బు లేదు. ఫలానా ఆయనను చూడండి, ఆయన ఏకంగా ఇల్లు కట్టుకున్నాడు, మోటరు కారు కొనుక్కు న్నాడు. ఆయన దేశభక్తుడు కూడా. మీరు చూస్తే ఇలానే ఉన్నారు" అన్నాడు. డాక్టర్జీ "నేను అలాగే మరణి స్తాను. దేశభక్తితో నేను వ్యాపారంచెయ్యను" అన్నారు.

**తల్లి కోరిక :** ఈనాటి సంకట గ్రస్తమైన ఘడియలలో జన్మించినందుకు మనమెంతో అదృష్టవంతులమని భావించుకోవాలి. శాంతి, సమృద్ధి, సంపద, శక్తి గల దేశంలో జన్మించడమే అదృష్టమని మనవారు అనుకుంటారు. ఇలా ఆలోచించేవారు మన దేశంలో చాలామంది ఉన్నారు. అమెరికా, ఇంగ్లండు, మొదలైన దేశాలలోని భోగవిలాసాలకు ప్రలోభపడి అక్కడకు వెళ్లి జీవిస్తూ ఉంటారు. కాని నిజమైన వీరత్వం ఉన్న యువకులు మరొక రకంగా ఆలోచిస్తారు.

ఈ దేశంలో జీవిస్తూ కష్టాలను, లోటును, ఆపదలను ఎదుర్కొని తమ ప్రయత్నాల ద్వారా సంఘర్షణ ద్వారా వాటిని అధిగమించి సౌభాగ్యంవైపు పయనించే అవకాశం తమకు లభించి నందుకు వారు భగవంతునికి ధన్యవాదాలు చెబుతారు. వైభవం, సమృద్ధి ఉన్న సమయంలో పుట్టి ఉంటే మన జీవితాలకు కేవలం పుట్టడం, కొంత కాలం సుఖ సౌకర్యాలతో జీవించడం, ఏదో ఒకనాడు మరణించడం మాత్రమే అర్థంగా ఉండేది. కాని ప్రతికూల పరిస్థితులలో మనలోని సర్వోన్నత శక్తి సామర్థ్యాలను, గుణసంపదను ప్రదర్శించి , మన పౌరుషాన్ని పరీక్షకు నిలిపి, లోకం ముందు భవ్య ప్రచండ వ్యక్తిత్వంతో నిలబడే అవకాశం లభిస్తుంది. మనలోని సంపూర్ణ ఔన్నత్యాన్ని సాధన లోకి తెచ్చి మానవ మేధస్సు ఊహించగల అత్యధికమైన ఎత్తును ఎగిరి అందుకునే సదవకాశం లభిస్తుంది.


నేడు మన దేశమాతకు కావలసినది తన పుత్రులు అటువంటి శ్రేష్ఠ యువకులుగా, త్యాగ ధనులుగా, అంతకుమించి శౌర్యధనులుగా, పౌరుష సంపన్నులుగా తయారుకావడం. నరుని (శాశ్వత పౌరుషం) నారాయణుని (శాశ్వత జ్ఞానం) సంయోగం జరిగినప్పుడు విజయం నిశ్చితమని అర్థం చేసుకోవాలి. అటువంటి ప్రభావ సంపన్నులైన పురుషులే చరిత్రను నిర్మిస్తారు.

★

### వివేకానంద సూక్తిశతి

Self- deprecation! what is it for? You are the child of the infinite, the all - powerful Divine Mother. What means disease, or fear to you

నీకు వ్యాధి ఏమి నీకు భయమ్మేమి
ఆదిశక్తిస్తియైన అమ్మ వుండ
ఆత్మన్యూనతేల ఆత్మ విస్తృతి ఏల
వినుడి స్వామి సద్వివేకవాణి!!






బండిరాజుల శంకర్
ఆలేరు,
9948050608



# ముమ్ముందు బీమాకి, పె

**వాహనాలు బీమా చేసుకోని పక్షంలో భవిష్యత్తులో పెట్రోల్ బంకుల్లో అటువంటి వాహనాలకు పెట్రోలు, డీజిల్‌ను విక్రయించడం ఆపేసే అవకాశం ఉంది. సుప్రీంకోర్టు ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ఒక సూచన చేసింది. కేంద్ర ప్రభుత్వం దీన్ని సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ ఆలోచన భద్రత కోసమే తప్ప శిక్షేమీ కాదు. వాహనాలు తప్పని సరిగా బీమా చేయించుకోవాలన్నదే ఈ సూచన వెనుక ఉద్దేశం. ప్రస్తుతానికి ఇది అమలయ్యే అవకాశం లేదు. వాహనదార్ల మీద దీన్ని బలవంతాన రుద్దే ఉద్దేశం కూడా లేదు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఈ సూచనను పరిగణనలోకి తీసుకుంది. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, వాహనదార్లకు సరైన భద్రత కల్పించడానికి, వాహనాలకు నష్టం కలగకుండా ఉండడానికి ఇటువంటి చర్య ఒకటి అవసరమని, కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ప్రస్తుతం ఈ అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది.**

తమ వద్దకు వచ్చే వాహనదార్లకు ఇంధనాన్ని అమ్మే ముందు పెట్రోల్, డీజిల్ విక్రేతలు ఈ వాహనదార్లకు ఇంధనాన్ని విక్రయించవచ్చా, లేదా అన్న విషయాన్ని బీమా సంస్థ వద్ద నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన ప్రక్రియలను ఉపయోగించి వాహనాల



**జి.రాజశుక**

**సీనియర్ జర్నలిస్ట్**

నంబర్లను స్కానింగ్ చేయడం ద్వారా బీమా చేసిందీ లేనిదీ నిర్ధారించుకోవడానికి అవకాశం ఉంటుంది. 'వాహన్' వ్యవస్థ ద్వారా బీమా రికార్డులను పరిశీలిస్తే బీమా విషయం నిర్ధారణ అవుతుంది. బీమా సంస్థల రికార్డుల ప్రకారం వాహనానికి బీమా లేని పక్షంలో పెట్రోలు బంకులు వాహనాలకు పెట్రోల్ సరఫరాను నిరాకరించడానికి అవకాశం ఉంటుంది. వాహన దారు తమ కార్లకు, ద్విచక్ర వాహనాలకు బీమా చేసుకోనంతవరకూ ఏ పెట్రోల్ బంకులోనూ అతనికి ఇంధనం విక్రయించే అవకాశం ఉండదు.

ఏదైనా వాహనం పెట్రోల్ బంకులోకి ప్రవే శించగానే ఆ వాహనానికి సంబంధించిన నంబర్ ప్లేటును ఫోటో తీయడం లేదా స్కానింగ్ చేయడం జరుగుతుంది. దాన్ని 'వాహన్' యాప్‌లో అప్‌లోడ్ చేసిన మరుక్షణం ఆ వాహనానికి బీమా చేయించిందీ లేనిదీ నిర్ధారణ అయిపోతుంది. ఇదంతా జరగడానికి కొద్ది సెకన్ల కాలం మాత్రమే పడుతుంది. ఈ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయవ్యవస్థ బీమా నియంత్రణ సంస్థలకు, రవాణా విభాగాలకు ఈ సూచనను పంపించి, ఇందుకు అవసరమైన ప్రక్రియను రూపొందించవలసిందిగా ఆదేశించింది. దీనిపై దృష్టి సారించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వంలోని రవాణా మంత్రిత్వశాఖను కూడా ఆదేశించింది. బీమా సంస్థల అధికారులు, రవాణా విభాగాల నిపుణులు, ప్రభుత్వ అధినేతలు అతి త్వరలో ఈ ప్రక్రియను, విధానాన్ని పరిశీలించి ఒక సమగ్ర కార్యక్రమాన్ని రూపొందించే అవకాశం ఉంది.

**దీని అవసరం ఏమిటి?**

ఇటీవల సుప్రీంకోర్టు ఒక రోడ్డు ప్రమాదానికి సంబంధించిన కేసును విచారిస్తున్నప్పుడు దేశంలో లక్షలాది వాహనాలకు బీమా జరగలేదనే విషయం తెలిసింది. వాహనదార్లు తమ వాహనాలకు బీమా చేయించడాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నట్టు, దానికి ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వనట్టు కూడా అర్థమైంది. దేశంలో సుమారు 56 శాతం వాహనాలు బీమా చేయకుండానే రోడ్ల మీద తిరుగుతున్నాయని సుప్రీం కోర్టు దృష్టికి వచ్చింది. మరో విధంగా చెప్పాలంటే, దేశంలో మొత్తం 30.46 కోట్ల వాహనాలుండగా, అందులో 16.54 కోట్ల వాహనాలకు బీమా పాలసీ లేదని అర్థమవుతోంది. దేశంలో 2024లో 4.87 లక్షల రోడ్డు ప్రమాదా లు జరిగాయి. వీటిలో అనేక వాహనాలకు బీమా చేయించనందువల్ల వాహనదార్లు ఇప్పటికీ తమ సొమ్ము కోసం ఎదురు చూడవలసి వస్తోంది. వాహన నష్టంతో పాటు, సొమ్ము నష్టం కూడా భారీస్థాయిలో ఉంటోంది. దేశంలోని అనేక న్యాయస్థానాల్లో ఇటువంటి వివాదాలకు సంబంధించి లక్షలాది కేసులు అపరిష్కృతంగా మగ్గుతున్నాయి. వాహనదారు మరణించడం వల్ల అతని కుటుంబ సభ్యులకు అందుతున్న సొమ్ము అంతంత మాత్రంగా ఉంటోంది.

ఈ ఇంధన నిరాకరణ పథకం ఇంతవరకూ అమలులోకి రాలేదు. ఇందుకు సంబంధించి గడువులు, తేదీలు కూడా ఇంకా నిర్ధారణ కాలేదు. దీన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించడానికి అవకాశం ఉంది. న్యాయస్థానం కూడా ఈ మేరకు ఒక సూచన చేసింది. సుప్రీంకోర్టు బీమా సంస్థలకు, రవాణా విభాగాలకు, రవాణా మంత్రిత్వ శాఖలకు, కేంద్ర ప్రభుత్వానికి ఈ మేరకు పంపిన సూచనలకు వీటి నుంచి సమాధానాలు, స్పందనలు లభించాల్సి ఉంది. ఆగస్టు 14లోపల తమ సమాధానాలను

# ట్రోల్‌కి లింక్!

పంపించాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆగస్టు 18నుంచి వీటి మీద విచారణ ప్రారంభం అవుతుంది. వాహనదార్లు కూడా తమకు తాముగా తమ వాహనాలకు బీమా చేయించవలసిన అవసరాన్ని గుర్తించాల్సి ఉంది. ఇందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'వాహన్'యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దానిద్వారా బీమా చేయించుకోవడం మంచిది. బీమా చేయించుకోవడంలో ఏమాత్రం పొరపాటు జరిగినా, బీమా చేయించుకోకపోయినా, ఆలస్యంగా చేయించుకున్నా, గడువు ముగిసినా వాహనదార్లు బాగా ఇబ్బందిపడాల్సి ఉంటుంది. నిజానికి సుప్రీంకోర్టే కాకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, రవాణా విభాగాలు ఇప్పటికే దీనిమీద శ్రద్ధ పెట్టడం జరుగుతోంది. ప్రభుత్వం ప్రయోగాత్మ కంగా ఈ ప్రక్రియను ఏ ప్రాంతంలో చేపట్టబో తోందన్నది ఇంకా వెల్లడి కాలేదు.

**ముందు జాగ్రత్తలు అవసరం**

ఈ ఇంధన నిరాకరణ పథకం విషయంలో వాహనదార్లు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇప్పటికిప్పుడు మార్పులు జరిగే అవకాశం లేదు. అయితే, వాహనదార్లు ఈ విషయంలో ఎటువంటి లోపాలు, లొసుగులు లేకుండా బీమాను పూర్తి చేసుకుని సర్వసన్నద్ధంగా ఉండడం మంచిది. మీరు మీ వాహనానికి చేయించిన బీమా గడువు ముగిసిపోలేదని నిర్ధారించు కోవడం అవసరం. దాని గడువు ముగిసేలోగా బీమా చేయించుకోవడం శ్రేయస్కరం. బీమా కాగితాలను మీ ఫోన్లో ఉంచుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది. బీమా చేయించుకోని వాహనాలకు ఇంధ నాన్ని విక్రయించకపోవడమన్నది ప్రస్తుతం అమలు జరగకపోయినా బీమా చేయించు కోవడాన్ని మరింత కఠినం చేస్తూ రవాణా అధికారులు, పోలీసులు నిబంధనలు రూపొందించే అవకాశం ఉంది.

అంతేకాదు, ఈ కేసును విచారిస్తున్న సుప్రీంకోర్టు ధర్మాసనం కొత్త వాహనాలకు బీమా విధానం ఏ విధంగా ఉండాలన్నది కూడా నిర్ధారించింది. కొత్త ద్విచక్ర వాహనాలకు ఆరేళ్లు, కొత్త కార్లకు నాలుగేళ్లు తప్పనిసరిగా బీమా చేయించాలని ఆదేశించింది. కాగా, 2018లో సుప్రీంకోర్టు రూపొందించిన నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాలకు అయిదేళ్లు, కార్లకు మూడేళ్లు బీమా చేయించడం జరిగేది. న్యాయమూర్తులు సంజయ్ కారోల్, అగస్టీన్ జార్జ్ మాసీలతో కూడిన ధర్మాసనం దేశంలో వాహన ప్రమాదాలు పెరగడం పట్ల, 56 శాతం వాహనాలకు బీమా లేకపోవడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. తాము బీమా విషయంలో నిబంధనలు రూపొందించి ఎనిమిదేళ్లు కావస్తున్నప్పటికీ, అత్యధిక శాతం వాహనాలకు బీమా లేకపోవడం ఆశ్చర్యంగా ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాహనాల భద్రత కోసం తాము ఈ బీమా గడువు కాలాన్ని ఒక సంవత్సరం పొడిగిస్తున్నట్టు సుప్రీంకోర్టు ప్రకటించింది. వాహనదార్లకు సకాలంలో పరిహారం లభించడంతోపాటు, న్యాయస్థానాల చుట్టూ తిరగడాన్ని కూడా తగ్గించాలని తాము భావిస్తున్నట్టు తెలియజేసింది. ★


కీర్తిశేషులు శ్రీ వడ్లమూడి రామమోహనరావు 1985 నుంచి 2007 వరకు 22 సంవత్సరాలు జాగృతి వారపత్రిక సంపాదకుడిగా విశిష్ట సేవలు అందించిన ధన్యజీవి.



**జాగృతి ఆధ్వర్యంలో**

## స్వర్గీయ వడ్లమూడి రామమోహనరావు స్మారక 'నవలల పోటీ- 2026'

రచనలను ఆహ్వానిస్తున్నాం..

ప్రథమ బహుమతి రూ. 25,000

ద్వితీయ బహుమతి రూ. 20,000

సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి.
- నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా, మొబైల్ నంబర్ సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

నవలలు పంపవలసిన చిరునామా : 3-4-228/4/1, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- 500027.

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 07 సెప్టెంబర్, 2026**




# హిందూధర్మంపై గురూజీ-

**ప్రస్తుతం హిందుత్వ కేసుగా విస్తృతంగా పేరొందిన ఆర్.వై. ప్రభు వర్సెస్ పి.కె.కుంటే ఏఐఆర్ 1996 ఎస్‌సీ 1113 కేసులో, హిందుత్వ భావజాలం మతతత్వపరమైనదేనా అనే అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం సుప్రీంకోర్టుకు ఏర్పడింది. హిందూ ధర్మాన్ని ఈ దేశ ప్రజల సర్వవ్యాప్తమైన జీవన విధానంగా ఆర్ఎస్ఎస్ ద్వితీయ సర్‌సంఘచాలక్ గురూజీ ఎల్లప్పుడూ పేర్కొనేవారు. అది ఒక సంకుచితమైన మతం కాదని స్పష్టం చేశారు. దానిని హిందూ సంస్కృతి అని కూడా పిలిచేవారు. దశాబ్దాల తర్వాత ఇదే అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు కూడా వ్యక్తం చేసింది.**

హిందూ ధర్మాన్ని స్థూలంగా ఒక జీవన విధానంగా మాత్రమే వర్ణించవచ్చు. వాస్తవానికి ఇది ఏ మతం లేదా విశ్వాసానికి సంబంధించిన సంకుచిత సాంప్రదాయ లక్షణాలకు సరిపోలదు (హిందుత్వ కేసు తీర్పు, పేజీ 1127). 'హిందుత్వ' లేదా 'హిందూ ధర్మం' అనే పదాలను లౌకికవాదాన్ని ప్రోత్సహించడానికి లేదా భారతీయ ప్రజల జీవన విధానం, భారతీయ సంస్కృతి లేదా జీవన దృక్పథాన్ని నొక్కిచెప్పడానికి ఉపయోగించవచ్చని కూడా కోర్టు పేర్కొంది (హిందుత్వ కేసు తీర్పు, పేజీ 1132). అంటే దశాబ్దాల క్రితం గురూజీ చెప్పిన మాటలతో సుప్రీంకోర్టు అక్షరాలా ఏకీభవించింది. ఈ పరిణామ క్రమాన్ని పరిశీలిస్తే ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతాయి.

ఫండమెంటలిజం ప్రాజెక్ట్ మొదటి సంపుటం 1991లోనూ, చివరిదైన ఐదవ సంపుటం 1995 లోనూ ప్రచురితమయ్యాయి. ఇక్కడ ప్రస్తావించిన నాలుగవ సంపుటం 1994లో వెలువడింది. హిందుత్వపై సుప్రీంకోర్టు తీర్పు 1995లో వచ్చింది. 1940లో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్‌గా బాధ్యతలు చేపట్టిన గురూజీ 1973లో కన్నుమూశారు. అంటే, ఫండమెంటలిజం ప్రాజెక్ట్ సంపుటాలు, సుప్రీంకోర్టు తీర్పు వెలువడటానికి రెండు దశాబ్దాలకు పైగా ముందే, అంటే 1940 నుండి 1973లో తమ జీవిత చరమాంకం వరకు 33 ఏళ్లపాటు గురూజీ సర్ సంఘచాలక్‌గా ఉంటూ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అయినప్పటికీ, అప్పట్లో విచక్షణా రహితంగానూ, కొన్నిసార్లు దురుద్దేశపూర్వకంగానూ విమర్శలకు గురైన గురూజీ ఆలోచనలు, అభిప్రాయాలను ఫండమెంటలిజం ప్రాజెక్ట్, సుప్రీంకోర్టు సమర్థించాయి.

కాబట్టి, సారాంశంలో, దశాబ్దాల క్రితం గురూజీ మాట్లాడిన మాటలు 1990ల నాటి 'ఫండమెంటలిజం ప్రాజెక్ట్'లో ఉన్న హిందూ ధర్మపు మేధోపరమైన, సాంస్కృతికపరమైన, ధార్మికపరమైన విశ్లేషణకు అనుగుణంగా ఉండటమే కాకుండా, హిందుత్వకు సంబంధించి సుప్రీంకోర్టు లౌకిక రాజ్యాంగ దృక్పథానికి కూడా అనుగుణంగా ఉన్నాయి. గురూజీ మాట్లాడినప్పుడు, ఆయన అభిప్రాయాలు లౌకిక వ్యతిరేకమైనవిగా, మతతత్వమైనవిగా విమర్శలు ఎదుర్కొన్నాయి. కానీ గురూజీ వ్యక్తీకరించిన అవే అభిప్రాయాలు తరువాత ఫండమెంటలిజం ప్రాజెక్ట్ మేధోపరమైన మదింపు ద్వారా, సుప్రీంకోర్టు న్యాయపరమైన పరిశీలన ద్వారా ఆమోదానికి, సమర్థనకు నోచుకున్నాయి. దీని అర్థం ఏమిటంటే, గురూజీ మాట్లాడిన మాటలు ఆయన కాలానికి చాలా ముందున్నాయి. గురూజీ ఆలోచనలు తరువాత ఎలా ఆమోదయోగ్యంగా మారాయో చూపించడానికి ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. వివిధ విషయాలపై గురూజీ అభిప్రాయాలు కాలక్రమేణా ఎలా సమర్థనకు నోచుకున్నదీ వచ్చే ఉదాహరణలు మరింత సమగ్రంగా వెల్లడిస్తాయి. కానీ ఆ గంభీరమైన ప్రయత్నం ప్రారంభమయ్యే ముందు, గురూజీ గురించి తెలియని వారి కోసం ఆయన నేపథ్యాన్ని ఇక్కడ వివరిస్తున్నాము.


దేశం కోసం తన సర్వస్వాన్ని అంకితం చేసిన ఆధ్యాత్మికవేత్త గురూజీ, ఆర్ఎస్ఎస్ రెండవ సరసంఘచాలక్. డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గెవార్ స్థాపించిన ఆర్ఎస్ఎస్ ఒక మౌలికమైన ఉద్యమం. అయితే, ఆర్ఎస్ఎస్‌ను కొందరు తక్కువగా అర్థం చేసుకున్నారు. అన్యాయంగా అంచనా వేశారు. హెడ్గెవార్ స్వయంగా గోల్వాల్కర్‌ను తన వారసుడిగా ఎంపిక చేసుకున్నారు. స్వభావం, శిక్షణ, వ్యక్తిత్వ పరంగా ఆధ్యాత్మికవేత్త అయిన గురూజీ, శ్రీ రామకృష్ణ పరమహంస ప్రత్యక్ష శిష్యుడైన స్వామి అఖండానంద వద్ద దీక్ష పొందిన శిష్యుడు. ఒక తెలివైన యువకుడిగా ఉన్న గురూజీ, భారతీయ సంప్రదాయంలోని మహర్షుల మాదిరిగానే, ఆర్ఎస్ఎస్ నిర్మాణంలో తన సర్వస్వాన్ని సమర్పించుకొని ఒక గొప్ప మేధావిగా ఎదిగారు. ఆయనలో అంతర్లీనంగా ఉన్న ఆధ్యాత్మిక కోణం బహుశా ఆయన ఆలోచనలను, చర్యలను సూక్ష్మంగా ప్రభావితం చేసి ఉండవచ్చు. ఆ ఆధ్యాత్మికత వల్లే, గురూజీ సమకాలీన పరిస్థితుల బలమైన ప్రభావాలను ఎదిరించి అధిగమించగలిగారు. తాత్కాలిక సమస్యలకు అతీతంగా భవిష్యత్తు వైపు చూడగలిగారు. ఆ దృక్పథం నుంచి చూస్తున్నప్పుడు సందర్భాన్ని విస్మరించడం వల్ల కలిగే తీవ్ర వేదనను అధిగమించి, ప్రజలు, దేశం అంతరాత్మను తట్టిలేపగలిగారు. అందుకే, గురూజీని తెలిసిన చాలామంది ఆయనను ద్రష్ట (దూరదృష్టి గల జ్ఞాని)గా భావిస్తారు.

ఆయన కేవలం తన కాలానికి మాత్రమే పరిమితం కాకుండా, భవిష్యత్తుపై దూరదృష్టితో ప్రాచీన హిందూతత్వాన్ని, జీవన విధానాన్ని అవిశ్రాంతంగా వివరించారు. ఏటా దేశంలోని వివిధ ప్రాంతాలలో నిరంతరం పర్యటించి, ప్రజలను కలుస్తూ, తన ఆలోచనలను వారితో పంచుకుంటూ, ప్రపంచంలోనే అత్యంత బలమైన క్షేత్రస్థాయి సంస్థను ఆయన నిర్మించారు. ఆయన ప్రసంగాలలో కనిపించే మేధోపరమైన, నైతిక ధైర్యం, అలాగే తన భావాలను వివరించడంలో ఆయన ప్రదర్శించిన స్పష్టత

**వర్తమానపు ఒత్తిళ్లను ధిక్కరించి, ఇష్టపూర్వకంగా అపఖ్యాతిని ఎదుర్కొని, సత్యం వైపు నిలబడి దానిని చెప్పడానికి సిద్ధపడ్డారా లేదా అన్నదే కీలకమైన పరీక్ష. అన్నింటికన్నా అంతిమ పరీక్ష ఏమిటంటే, భవిష్యత్తు ఆ ఆలోచనలను ధ్రువీకరించిందా లేదా అనేది. 60 సంవత్సరాల క్రితం గురూజీ పలికిన మాటలు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పలికారా? లేక సందర్భాన్ని ఒక ఒత్తిడిగా భావించి పలికారా? ఆయన తర్వాత చరిత్ర వాటిని ధ్రువీకరించిందా? లేక తిరస్కరించిందా అన్నదే ఇక్కడి విశ్లేషణ సారాంశం.**

# -సుప్రీంకోర్టు ఏకాభిప్రాయం

అద్వితీయమైనవి. గురూజీ జీవించి ఉన్నప్పుడు లేదా ఆ తర్వాత ఆయన ఆలోచనలను ప్రశ్నించిన వారు కూడా, ఆయనకున్న దృఢ విశ్వాసం, ఆయన లక్ష్యం లోని చిత్తశుద్ధిని కాదనలేకపోయారు. భారతదేశ విభజన ఉద్యమం ప్రమాదకర స్థాయికి చేరు కుంటున్న తరుణంలో 1940లో గురూజీ ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వాన్ని స్వీకరించారు. కాబట్టి, ఆ విభజన ఉద్యమం రేకెత్తించిన తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలోనే ఆయన ఆలోచనలలో కొన్నింటిని అర్థం చేసుకోవాలి. ఆ సంక్షోభ సమయాల నుండి, దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పావు శతాబ్దానికి పైగా కాలం వరకు, సమకాలీన పరిస్థితు లకు అనుగుణంగా మాట్లాడినప్పటికీ, భారతదేశ భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై గురూజీ తన అభిప్రాయాలను అచంచలమైన స్థిరత్వంతో వ్యక్తం చేశారు.




ఆధునిక చరిత్ర వెలుగులో గురూజీ తన జీవితకాలంలో మాట్లాడిన మాటలను గుర్తుచేసు కుంటే, ఆయన ఆయా సందర్భాలలో మాట్లాడి నప్పటికీ, ఆయన చెప్పిన చాలా విషయాలు భవిష్యత్తుకు మరింతగా వర్తించేవనే వాస్తవం వెల్లడవుతుంది. తన అభిప్రాయాలను వ్యక్తపరిచే టప్పుడు, గురూజీ ఆనాటి సందర్భపు ఒత్తిళ్లను, సమకాలీన ఆకర్షణలను ధిక్కరించి, హిందూ భారతదేశపు శాశ్వత ధ్యేయాన్ని ప్రజల ముందు ఉంచేవారు. ఆర్‌ఎస్‌ఎస్ అధిపతిగా గురూజీ మూడు దశాబ్దాలకు పైగా భారతదేశ ప్రజలతో తన ఆలోచనలను పంచుకున్నారు. ఆయన పరమపదించి దాదాపు ఐదు దశాబ్దాలు అవుతోంది. కానీ ఆయన పని ఆయనతో ముగిసిపోలేదు. సమాజంపై అపారమైన ప్రభావాన్ని చూపే సంస్థగా ఆయన తీర్చిదిద్దిన ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా అది కొనసాగుతూనే ఉంది. ఆయన తన వెనుక అత్యున్నత నాణ్యత కలిగిన, శిక్షణ పొందిన అపారమైన మానవ వనరులను వదిలివెళ్లారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్ చేసే పని ద్వారానే నూతనంగా పునరుద్ధరణకు నోచుకుంటు న్నది. ఈ నాణ్యమైన మానవ వనరులే ఆయన కార్యాన్ని ముందుకు తీసుకువెళ్తున్నాయి.

కానీ గురూజీ ప్రవక్త కాదు. ఆయన ప్రవచించలేదు. ఆయన కేవలం ఒక ద్రష్ట – అంటే దార్శనికుడు. నిజానికి, హిందూ సంప్రదాయం ఏ ప్రవక్తను గానీ, ప్రవచనాన్ని గానీ గుర్తించదు లేదా నమ్మదు. హిందూ ధర్మం ప్రవచనాలను ప్రతిపాదిం చదు. ఇతర సంప్రదాయాలలోని ప్రవక్తలు తాము ఏకైక సత్య మతంగా, దేవుడిగా భావించేవాటిని కనుగొని, వాటిని తమ అనుచరులకు నిర్దేశిస్తారు. అదే సమయంలో, మిగతా మతాలు, దేవుళ్ల అసత్య మని కూడా ప్రకటిస్తారు. ఒక ప్రవక్త ప్రతిపాదించిన సత్యమే అంతిమ, ఏకైక సత్యం అవుతుంది. ఇది అన్ని ఏకేశ్వరవాద విశ్వాసాలకు వర్తిస్తుంది. వీటిని తర్వాతి భాగాలలో వివరంగా వివరించడం జరిగింది. కానీ అంతిమ సత్యం ఒక్కటే అనేది హిందూ ధర్మానికి పునాదిగా ఉంటుంది. కానీ రుషులు దీనిని విభిన్నంగా చూస్తారు, వివరి స్తారు. అందువల్ల, ఒక ఆరాధనా విధానం సత్యం, మిగతావి అసత్యం అని గానీ, లేదా ఒక దేవుడు సత్యం, మిగిలిన దేవుళ్లు అసత్యం అని గానీ చెప్ప డంలో అర్థం లేదు. అందువల్ల గొప్ప దార్శనికులు ఎప్పటికప్పుడు వచ్చి ప్రజలకు మార్గదర్శనం చేస్తారని, దార్శనికుల పరంపర అంతులేని ప్రవాహంలా కొనసాగుతుందని హిందువులు నమ్ముతారు. కాబట్టి, ప్రవక్తలు ప్రతిపాదించిన విశ్వాసాల విషయంలో లాగా, ఏ ఒక్కరి ఆలోచన కూడా అంతిమ ప్రవచనం కాదు లేదా అన్ని కాలాలకు చెల్లుబాటు అయ్యేది కాదు. అందువల్ల హిందూ ధర్మాన్ని ఏ ఒక్క వ్యక్తి ప్రతిపాదించలేదు. రుషులు, దార్శనికులు హిందూ ధార్మిక సూత్రాలను వివరిస్తారు.

గతంలోని ఆలోచనల చెల్లుబాటు కాలం ముగిసిన తర్వాత కూడా ప్రజలు వాటిని అనుసరిస్తూ ఉంటే, వారు గతంలోనే స్తంభించిపోయి, చరిత్ర గమనంలో తిరస్కారానికి నోచుకుంటారని హిందూధర్మం విశ్వసిస్తుంది. లేకపోతే, వివిధ మత సిద్ధాంతాలు, ప్రవచనాలు చేసినట్లే, వారు సమాజానికి, ప్రపంచానికి అపారమైన హింసను, హానిని కలిగిస్తారు. కాబట్టి, భవిష్యత్తులో మార్గదర్శనం కోసం గతంలో ఒక దార్శనికుడు చెప్పినదాన్ని అంగీకరించే ముందు, ప్రజలకు మార్గనిర్దేశం చేయడానికి ఎప్పటికప్పుడు జన్మించే మహనీయుల నిరంతర సంప్రదాయంలో, దార్శనికుడి పాత్ర ఒక అధ్యాయం మాత్రమేనని హిందువులు అర్థం చేసుకుంటారు. అందువల్ల హిందూ ధర్మం ప్రవచనం, ప్రవక్తలు అనే భావననే తిరస్కరిస్తుంది. ద్రష్టలను మాత్రమే అర్థం చేసుకుంటుంది. ఒక వ్యక్తి ద్రష్ట (దార్శనికుడు) అవునో కాదో తెలుసుకోవడానికి అతని ఆలోచనలు కేవలం సందర్భోచితమైనవా, అంటే ఆనాటి అవసరాలను, కోరికలను తీర్చడానికా? లేదా తన కాలంలోని ప్రజల ఆమోదాన్ని పొందడానికి ఉద్దేశించినవా, లేక అతను భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమకాలీన పరిస్థితికి అతీతంగా మాట్లాడాడా? అనేది అవగతం చేసుకోవడం మొదటి పరీక్ష అవుతుంది.

వర్తమానపు ఒత్తిళ్లను ధిక్కరించి, ఇష్టపూర్వకంగా అపఖ్యాతిని ఎదుర్కొని, సత్యం వైపు నిలబడి దానిని చెప్పడానికి సిద్ధపడ్డారా లేదా అన్నదే కీలకమైన పరీక్ష. అన్నింటికన్నా అంతిమ పరీక్ష ఏమిటంటే, భవిష్యత్తు ఆ ఆలోచనలను ధృవీకరించిందా లేదా అనేది. 60 సంవత్సరాల క్రితం గురూజీ పలికిన మాటలు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పలికారా? లేక సందర్భాన్ని ఒక ఒత్తిడిగా భావించి పలికారా? ఆయన తర్వాత చరిత్ర వాటిని ధృవీకరించిందా? లేక తిరస్కరించిందా అన్నదే ఇక్కడి విశ్లేషణ సారాంశం.

ప్రస్తుత సందర్భంలో గురూజీ ఆలోచనలు, సూక్తులను లోతుగా పరిశీలించి, విశ్లేషించడానికి ప్రయత్నిద్దాం. ఈ విశ్లేషణ చివరికి గురూజీని ఒక దార్శనికుడిగా చూపిస్తుంది. ఆయన సందర్భాన్ని, దాని ఒత్తిళ్లను, పరిమితులను అధిగమించి, భవిష్యత్తును చూడగలిగే ఒక ఉన్నత స్థానానికి ఎదిగారు. ఈ క్రమంలో, ఆయన పలికిన మాటలు కాలానికి ముందే ఉన్నందున అప్పుడు ఆమోద యోగ్యం కానివిగా,జనాదరణ లేనివిగా ఉన్నాయి, కానీ సకాలంలో అవి సర్వజనామోదం పొందాయి.

**(ఎస్.గురుమూర్తి రచించిన "గోల్వాల్కర్ ది మోడరన్ రిషి విత్ మిలీనియల్ విజన్" పుస్తకం నుంచి)**



# విజయవంతంగా అగ్ని 4 ప్రయోగం

ఆగస్ట్ 7న ఒడిషాలోని చందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ప్రయోగించిన అగ్ని–4 మధ్య శ్రేణి క్షిపణి ప్రయోగం విజయ వంతమైంది. భారతదేశ వ్యూహాత్మక నిరోధక శక్తిని, స్వదేశీ క్షిపణి సామర్థ్యాలను ఈ విజయం బలోపేతం చేసింది. రక్షణమంత్రిత్వశాఖ ప్రకారం, ఈ ప్రయోగం స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్(ఎస్ఎఫ్‌సి) ఆధ్వర్యంలో జరిగింది. ప్రణాళికాబద్ధమైన అన్ని మిషన్ లక్ష్యాలను విజయవంతంగా సాధించింది. భారతదేశ స్వదేశీ క్షిపణి కార్యక్రమం కింద అభివృద్ధి చేసిన, అణ్వాయుధ సామర్థ్యం గల, భూమి నుండి భూమికి ప్రయోగించే మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని–4. తాజా పరీక్షలో అన్ని కార్యాచరణ, సాంకేతిక పారామితులు ఆశించిన విధంగానే పనిచేశాయని, కార్యాచరణ పరిస్థితులలో క్షిపణి సమర్థతను ఇది నిరూపించిందని రక్షణ అధికారులు తెలిపారు. భారతదేశం ఇటీవలి సంవత్సరాలలో వరుస విజయవంతమైన పరీక్షల ద్వారా తన స్వదేశీ క్షిపణి సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటూ వస్తోంది. తాజా అగ్ని–4 క్షిపణి అన్ని మిషన్ లక్ష్యాలను విజయ

# స్వేచ్ఛ అంటే బాధ్యత అని యువత గుర్తించాలి




స్వేచ్ఛ అనేది బాధ్యతే తప్ప ఎటువంటి ఆంక్షలు లేకుండా వ్యవహరించడం కాదని దేశ యువత గుర్తించాలని జాతీయ భద్రతా సలహా దారు అజిత్ దోవల్ పిలుపునిచ్చారు. పూణెలో జరిగిన లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారం 2026 వేడుకలో పాల్గొన్న ప్రసంగిస్తూ, స్వాతంత్ర్య సమరయోధుడు లోకమాన్య బాలగంగాధర్ ప్రతిపాదించిన దేశ నిర్మాణ ఆదర్శాలను వారు అనుసరించాలని అన్నారు. నేటి యువత తమను తాము పూర్తిగా దేశానికి అంకితం చేసుకోవాలి. వ్యక్తిగత లేదా స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి, ఎల్లప్పుడూ జాతీయ ప్రయోజనాల కోసమే పని చేస్తామని వారు సంకల్పం తీసుకోవాలని కోరారు. స్వార్థ ప్రయోజనాలు ఎదురైతే, వాటిని విస్మరించా లన్నారు. ప్రస్తుతం దేశ నిర్మాణమే ప్రధాన ప్రాధా న్యతగా వుండాలన్నారు. పూణెలో జరిగిన లోక మాన్య తిలక్ జాతీయ పురస్కారాన్ని అజిత్ దోవల్‌కి హోంమంత్రి అమిత్ షా అందజేశారు.

మన దేశ చరిత్రలో ఒక అరుదైన అవకాశం వచ్చిందని, దాన్ని చేజారనివ్వలేమన్నారు. మనం ఈ మిషన్‌లో విజయం సాధించి, చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తామని తనకు పూర్తి నమ్మకం ఉంది, అని దోవల్ అన్నారు. ‘ముఖ్యంగా మన యువత, భారతదేశం ఎప్పుడూ ఇలాగే ఉందేమో అని అనుకోవచ్చు. కానీ, నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ అంటే కేవలం మనకు తోచినట్లు చేయడం మాత్రమే అని వారు భావించవచ్చు. కానీ స్వేచ్ఛ అంటే అదికాదు. దాని కోసం తమ ప్రాణాలను అర్పించిన మహనీయుల త్యాగాల వల్ల ఈ స్వేచ్ఛ సిద్ధించింది, అని పేర్కొంటూ, దాస్య శృంఖ లాలను తెంచుకో వడానికి యువతలో నూతన చైతన్యాన్ని రగిలించిన తిలక్ నాయకత్వాన్ని ఆయన గుర్తు చేశారు.

‘ఒకవేళ ‘తిలక్’ ఇప్పుడు మన మధ్య ఉంటే, మనకు ఏ కొత్తనినాదం ఇచ్చేవారు? బహుశా ఆయన ‘భారత్‌ను శక్తిమంతంగా, అభివృద్ధి చెందిన దేశంగా తీర్చి దిద్దడమే తన జన్మహక్కు

# నీళ్లు తాగినందుకు క్రైస్తవ కూలీ హత్య




తమ మతంలో అంటరానితనం లేదని చెప్పుకునే ఇస్లాంలో అది ఏ స్థాయిలో ఉందో, గత నెలలో జరిగిన ఒక క్రైస్తవ కూలీ హత్య బయటపెడుతుంది. అన్య మతస్తులు ఏం చేసినా అది తప్పుగా భావించే పాకిస్తాన్ దేశంలో, మండుటెండలో ఒక కూలర్ దగ్గర ఒక గుక్కెడ నీళ్లు తాగినందుకు సాదిక్ మసీహ్ అనే క్రైస్తవ కూలీ హత్యకు గురయ్యాడు. అతడు నీరు తాగడాన్ని చూసిన ఒక ముస్లిం సహోద్యోగి ఆ నీరు ముస్లింల కోసం కేటాయించిందని వాదనకు దిగాడు. సాదిక్ ఆ నీటిని కలుషితం చేశాడని ఆరోపించడంతో, ఇరువురి మధ్య వాగ్వాదం చెలరేగింది. అప్పటికి కార్మికుల జోక్యంతో గొడవ సద్దుమణిగింది. కొద్దిసేపటి తర్వాత, సాదిక్ మళ్లీ కార్మికుల కోసం ఉద్దేశించిన వాటర్ కూలర్ వద్దకు వెళ్ళాడు. అహ్మద్ అతన్ని మరోసారి ఎదుర్కొన్నాడు, కానీ ఈసారి అతను కత్తి తీసి సాదిక్ గొంతు కోసి చంపేశాడు. పాకిస్తాన్‌లో క్రైస్తవులను, ఇతర అన్యమతస్తులను సాధారణంగా చిన్నచూపు చూడటమే కాదు “అచూత్” అంటే “అంటరానివారు”గా పరిగణిస్తారు.

పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ప్రభుత్వ వ్యతిరేక, ఎన్నికల సంబంధిత నిరసనలపై అణచివేత గురించి ఖతార్ ఆధారిత ప్రసార సంస్థ అల్ జజీరా వరుస నివేదికలను ప్రచురించిన తరువాత, పాకిస్తాన్ ఆ సంస్థ ఒక ఆంగ్ల వెబ్‌సైట్‌కు అందుబాటును పరిమితం చేసినట్లు ఎన్‌డిటివి పేర్కొంది. తాజాగా, ఈ ప్రాంతాలలో రిపోర్టింగ్ చేయాలంటే, జర్నలిస్టులు ప్రభుత్వం నుంచి ఎన్‌ఒసిని పొందాలని ప్రకటించింది.

పాకిస్తాన్ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కూడా ఆ ప్రాంతంలోని ఎన్నికల గురించి అల్‌జజీరా వక్రీకరించిన చిత్రాన్ని ప్రసారం చేస్తోందని ఆరోపించింది. ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఒక ప్రకటనలో, ముజఫరాబాద్‌లోని నిర్దిష్ట పోలింగ్ కేంద్రాల నుండి మాత్రమే అల్‌జజీరా

వంతంగా నెరవేర్చి, కీలకసాంకేతికతలను ధృవీకరించి, భారతదేశపు విస్తరిస్తున్న సుదూర ఖచ్చితమైన దాడి సామర్థ్యాన్ని ప్రదర్శించింది. ఈ విజయవంతమైన ప్రయోగాలు అన్నీ, రక్షణ సాంకేతికతలో స్వావలంబన,వ్యూహాత్మక దళాల ఆధునీకరణ,అధునాతన స్వదేశీ ఆయుధ వ్యవస్థలద్వారా జాతీయభద్రతను పెంపొందించ డానికి భారతదేశం నిరంతరం ఇస్తున్న ప్రాధాన్యతను స్పష్టంచేస్తున్నాయి. విజయవంతమైన అగ్ని-4 పరీక్ష భారతదేశ వ్యూహాత్మక రక్షణ సంసిద్ధతను బలోపేతంచేయడమే కాకుండా, జాతీయభద్రతకోసం విశ్వసనీయమైన, స్వదేశీ క్షిపణివ్యవస్థలను అభివృద్ధి చేయడంలో కొన సాగుతున్న పురోగతిని కూడా ప్రతిబింబిస్తుంది.



నేను దాన్ని సాధిస్తాను అని చెప్పేవారేమో! నేను ఈ దేశాన్ని బలమైనదిగా మార్చాలి. నా చివరి శ్వాసవరకు దీని కోసం నేను చేయగలిగినదంతా చేస్తాను, అని ఉద్ఘాటించారు.

# నేరగాళ్లకు శాపం ఆపరేషన్ త్రిశూల్




దేశంలో నేరం చేసి ఇతర దేశాలకు పారిపోయిన నేరస్తులను వెనక్కి పట్టుకురావడం ఒక పెద్ద ప్రక్రియ. వారు పారిపోయిన దేశంతో మనకు డిపోర్టేషన్ ఒప్పందాలు ఉంటే పరిస్థితి సాపేక్షంగా సులువవుతుందేమో కానీ, అది లేని దేశాలకు పారిపోతే వారిని ఇక్కడకు తీసుకువచ్చి, శిక్షించే సమయానికి దశాబ్దాల కాలం పడుతుంది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం మార్చేసింది. దేశ సరిహద్దులు దాటి పరారైన క్రిమినల్స్, ఆర్థిక నేరగాళ్లపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. 2019 నుంచి 2026 జులై వరకు గత ఏడేళ్ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి ఏకంగా 274 మంది పరారీలో ఉన్న నిందితులను భారత్‌కు రప్పించినట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇటీవలే వెల్లడించింది. ఈ జాబితాలో ఉగ్రవాదులు, గ్యాంగ్‌స్టర్లు, డ్రగ్ స్మగ్లర్లు, హత్యలు, అత్యాచారాలు, పోక్సో కేసులలో నిందితులుగా ఉన్న ప్రధాన క్రిమినల్స్ ఉన్నారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం ద్వారా పరారీలో ఉన్న క్రిమినల్స్‌కు చెందిన రూ. 17,874 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేయగా, ఫ్యుజిటివ్ ఎకనామిక్ అఫెండర్స్ చట్టం కింద నమోదు చేసిన కేసుల్లో మరో రూ.18,762 కోట్లను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది.

హోంశాఖ గణాంకాల ప్రకారం విదేశాల నుంచి నేరస్థుల అప్పగింతలు ఏడాదికేడాది పెరుగుతున్నాయి. అత్యధికంగా 2025లో 70 మంది నేరస్థులను భారత్‌కు తీసుకొచ్చారు. ఇక 2026 జులై నాటికే 45మంది అప్పగింత పూర్తయింది. అంతకుముందు 2024లో 43 మంది, 2023లో 37 మంది, 2022లో 40 మంది, 2021లో 23 మంది, 2020లో ఏడుగురు, 2019లో తొమ్మిది మందిని భారత్‌కు రప్పించారు. విదేశాలలో పేర్లు, గుర్తింపులు మార్చుకుని తలదాచుకుంటున్న క్రిమినల్స్‌ను కనిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ త్రిశూల్' చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో సిబిఐ, ఐబి, రా, ఎన్ఐఏ, ఇడి, ఎంఇఏ, ఎన్‌సిబి, డిజిజిఐ, రాష్ట్రాల పోలీస్ వ్యవస్థల సమన్వయంతో 'హోల్ ఆఫ్ గవర్నమెంట్' విధానంలో పనిచేసి ఈ విజయం సాధించాయి.

గత మూడేళ్లలో ఇంటర్‌పోల్ ద్వారా 501కంటే ఎక్కువ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా, ఒక్క 2026లోనే 182 నోటీసులు ఇచ్చారు. దేశంలోని 1,400కంటే ఎక్కువ పోలీస్ ఏజెన్సీలను ఇంటర్‌పోల్‌తో అనుసంధానిస్తూ ప్రవేశ పెట్టిన 'భారత్‌పోల్' వేదిక ద్వారా అంతర్జాతీయ సమాచార మార్పిడి వ్యవస్థ మరింత వేగవంతమైంది.

# పీఓకేలో మీడియాపై ఆంక్షలు






ఎంపిక చేసిన వార్తలను ప్రసారం చేసిందని, ఎన్నికల ప్రక్రియను తప్పుగా చిత్రీకరించడానికి ప్రయత్నించిందని మంత్రిత్వ శాఖ ఆరోపించింది. ఎన్నికల సమయంలో హింసను, బలవంతాన్ని ప్రజలు తిరస్కరించినప్పటికీ, పేరు తెలియని బాహ్య శక్తులు ఎన్నికల ప్రక్రియను చట్టవిరుద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని కూడా అది ఆరోపించింది.

పాకిస్తాన్ తన నియంత్రణలో ఉన్న భూభాగాన్ని "ఆజాద్ జమ్మూ కాశ్మీర్" అని పేర్కొంటుండగా, జమ్మూ, కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు మొత్తం దేశంలో అంతర్భాగమని, విడదీయరానివని భారతదేశం వాదిస్తోంది. పాకిస్తాన్ ఈ ప్రాంతంలోని కొన్ని భాగాలను చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించుకుందని న్యూఢిల్లీ వాదన.

ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో పత్రికా స్వేచ్ఛపై అణచివేత తీవ్రతరం అవుతోందని పేర్కొంటూ, జర్నలిస్టుల పరిరక్షణ కమిటీ (సిపిజె) పాక్‌ను విమర్శించింది. ఇంటర్నెట్ నిలిపివేతలు, టెలికమ్యూనికేషన్ల ఆంక్షలు, స్వతంత్ర రిపోర్టింగ్‌పై పరిమితులు, అశాంతిని కవర్ చేస్తున్న జర్నలిస్టుల నిర్బంధం లేదా అదృశ్యంవంటి నివేదికలపై ఈ మీడియా పర్యవేక్షక సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. మీడియా నివేదికల ప్రకారం ఇవి జూన్ 5 నుండి అమలులో ఉన్నాయని, సమాచార స్వేచ్ఛా ప్రవాహంపై ఆంక్షల విస్తృత నమూనాలో ఇవి ఒక భాగమని వర్ణించింది.

# కథ

'మా అమ్మకు నచ్చనిది... నాన్నమ్మా, తాతయ్యా' అన్న సమాధానం దగ్గర నా పెన్ను ఆగిపోయింది. మిగతా పేపర్ దిద్దలేకపోయాను. ఆలోచనలు కందిరీగల్లా కుట్టసాగాయి.ఖాళీగా ఉన్న ఆఖరు అవర్లో పేపర్లు దిద్దాలని మొదలు పెట్టాను. కానీ కళ్లల్లో ఉబికిన నీళ్లు పేపర్ మీద అక్షరాలను మసకమసగ్గా చేశాయి. 'మీ అమ్మకు నచ్చనివి ఏంటో రాయండి' అన్న ప్రశ్నకు ఓ విద్యార్థి రాసిన సమాధానం అది. తొమ్మిది నెలలు మోసి కనీ పెంచి పిల్లలకు లోకాన్ని పరిచయం చేస్తుంది తల్లి. చుట్టూ ఉన్న ప్రపంచం గురించి విడమర్చి చెప్తుంది. ఎవరితో ఎలా మెలగాలో నేర్పిస్తుంది. సమాజంలో కుటుంబ స్థానం, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధం ఎలా ఉండాలో.. పిల్లలు కుటుంబం నుంచే నేర్చు కుంటారు. తల్లిదండ్రుల నడవడికే పిల్లల భవిష్యత్తుకి మూలమవుతుంది. మంచి కుటుంబం నుంచి వచ్చిన పిల్లలు, మంచి పెంపకంలో పెరిగిన పిల్లలు మాత్రమే శారీరకంగా, మానసికంగా సమాజాన్ని ఆరోగ్య వంతంగా ఉంచగలరు. . పేపరు దిద్దాలనిపించలేదు. మనసంతా చేదుగా అయిపోయింది. అడిగిన ప్రశ్నలకు పిల్లలు తెలిసో, తెలియకో, అమాయ కంగానో, కొన్నిసార్లు నవ్వు పుట్టించేటట్లుగానో సమాధానాలు రాస్తుంటారు. పేపర్లు దిద్దేటప్పుడు అలాంటి సమాధానాలను పైకి చదివి టీచర్లందరం అప్పుడప్పుడు సరదాగా నవ్వుకోవడం మామూలే.కానీ ఈ సమాధానం చదివిన తర్వాత దానికి ఎలా ప్రతిస్పందించాలో అర్థం కాలేదు. పిల్లల ప్రవర్తన కుటుంబ సంబంధాల్లోని'దాగుడుమూతలు'పిల్లల మనస్తత్వాన్ని ఎంతగా కలుషితం చేస్తున్నాయో తల్చుకుంటున్న కొద్దీ ఏదో తెలియని ఆందోళన నన్ను చుట్టుముట్టింది.

సమాజం ఎటువైపు పోతుందో అన్న అభిప్రాయాన్ని పక్కన పెడితే, అసలు రక్తసంబంధాలు ఏ మలుపులు తీసుకుంటున్నాయో అర్థం కాలేదు. మనం పిల్లల్ని 'సరైన రీతిలోనే పెంచుతున్నామా?' అనిపించింది. పిల్లల్ని అమ్మమ్మ ఇంటికి దగ్గర చేస్తున్నామని సంబరపడుతున్నాం గానీ..నాన్నమ్మకు దూరం చేస్తున్నామని గ్రహించలేకపోతున్నాం.

తలెత్తి ఎదురుగా చూశాను. స్టాఫ్‌రూంలో టీచర్లందరూ ఎవరి పనుల్లో వాళ్లున్నారు. కొంత మంది ఏవో కబుర్లు చెబుతూ నవ్వుకుంటున్నారు. ఆ నవ్వుల వెనకున్న వాళ్ల సంబంధాలన్నీ పదిలంగానే ఉన్నాయా? అన్న సందేహం కలిగింది.

నోరు నవ్వినప్పుడల్లా నొసలు వెక్కిరిస్తూనే ఉంటాయి. పొందిన వాటిని చూసుకుని పొంగినప్పుడల్లా, పోగొట్టుకున్న వాటి ఆనవాళ్లు ఏదో రూపంలో కళ్ల ముందు నిలుస్తూనే ఉంటాయి.

దూరంగా కనిపిస్తున్న సరళను దగ్గరకు రమ్మని పిలిచాను. మొదటి నుంచి నేను ఇంట్రావర్ట్. ఎవరితోనూ పెద్దగా కలవను.కలిస్తే మాత్రం అంత తొందరగా వాళ్లను వదులుకోను. భిన్న దృక్పథాలు, విభిన్న వ్యక్తిత్వాలు ఉన్న 'స్టాఫ్‌రూం' లో సరళ ఎందుకో బాగా దగ్గరైంది. ఏ విషయమైనా మొహమాటం లేకుండా చెప్తుంది. అందులో ఏ విధమైన దాపరికాలూ ఉండవు. కుండబద్దలు కొట్టినట్లుగా అభిప్రాయాలు చెప్తుంది.

సరళ నా వైపు వస్తూనే "ఏంటే అలా ఉన్నావు? ఒంట్లో బాగోలేదా? లేక ఏదైనా సమస్యా?" అంది. ఏమీ మాట్లాడకుండా పిల్లవాడు రాసిన జవాబు సరళకు చూపించాను.

అది చదివి పెద్దగా నవ్వుతూ "వాడు నిజమే రాశాడుగా! దానికి నువ్వెందుకు కంగారు పడుతున్నావ్? నేనైతే ఎప్పుడో వేరు కాపురం




# నాన్నమ్మ ఇల్లు

డా. జడా సుబ్బారావు

పెట్టేశాను. పెళ్లిళ్లకు, పండగలకు మొక్కుబడిగా వెళ్లి రావడం తప్ప అటు నుంచి పెద్దగా సంబంధాలు లేకుండా చూసుకున్నాను. పిల్లలకు నాన్న తరుపు బంధువులుంటారని తెలుసు. కానీ ఎలా ఉంటారో తెలియదు. పొరపాటున ఎప్పుడైనా కలిసినా వాళ్లని ఏ వరసలతో పిలవాలో అసలు తెలియదు" అంది సరళ చాలా తేలిగ్గా.

"అదేంటే... అంత కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడతావు" అన్నాను. నా వంక అదోలా చూస్తూ "వాస్తవాలెప్పుడూ కుండబద్దలు కొట్టినట్టే ఉంటాయి. వాటిని ఒప్పుకోవాలంటేనే మనసు అంగీకరించదు" అంది సరళ.

'అంటే...అసలు నాన్నమ్మ ఇల్లు తెలియకుండానే పిల్లలు పెరుగుతున్నా రంటావా?" అన్నాను సరళతో.'ఎందుకు తెలియదు? తెలుసు.. అయితే నానమ్మ ఇంటికి రాకపోకలు సాగించే పిల్లలు 'వేళ్ల' మీద ఉంటారు. తెలియని వాళ్లు వేలల్లోనూ, లక్షల్లోనూ ఉంటారు. పైగా ఆడదానికి పుట్టింట్లో మాత్రమే మనుషులుంటారు. వాళ్లు మాత్రమే మనుషులుగా కనిపిస్తారు. అత్తింట్లో అసలు మనుషులుండరు. ఒకవేళ ఉన్నా, వాళ్లంతా ఆస్తుల పంపకాలుగానూ, ఆదాయ వ్యయాల పట్టికలుగానూ కనిపిస్తుంటారు" అంది.



సరళ చెప్పింది నిజమే. అయినా నిజాన్ని నిజంగా ఒప్పుకోవాలంటే 'అహం' అడ్డొస్తుంది. నిజాలు చేదుగా ఉంటాయి.ఎవరైనా జీవితంలోని ఎత్తు పల్లాలను అర్థం చేసుకున్నప్పుడే బంధాల విలువను గ్రహించగలుగుతారు. ఆస్తులతోనూ, అంతస్తులతోనూ కొలతలు వేయనప్పుడే మనిషిని మనిషిగా ప్రేమించగలుగుతారు. కలతలు రాని కాపురాలుండవు, గొడవలు జరగని కుటుంబా లుండవు. తప్పులు అటు నుంచో ఇటు నుంచో జరుగుతూనే ఉంటాయి. అహాన్ని పక్కనపెట్టి సహనంతో సర్దుకుపోవాలి. విడదీసే 'కత్తెర'లా కాకుండా కలిపి కుట్టే 'సూది'లా మారినప్పుడే బంధాలు నిలబడతాయి. సరళ మాటలు వింటుంటే గొంతుకేదో అడ్డం పడినట్లుగా అనిపించింది.

ఆమె వంక చూస్తూ "అందరిళ్లల్లోనూ అలాగే ఉందా? అత్తాకోడళ్లెప్పుడూ తూర్పూ పడమరలే. కొన్ని ఇళ్లల్లో తల్లీకూతుళ్లలా ఉంటే,మరికొన్ని ఇళ్లల్లో బద్ధ శత్రువుల్లా ఉంటారు. కాదనను. కానీ, నాన్నమ్మకి గౌరవం ఇస్తూ, నాన్నమ్మ చుట్టూ తిరిగే పిల్లలు కూడా ఉన్నారుగా..."

'అందుకే వాళ్లు 'వేళ్ల'మీద ఉంటారని చెప్పాను" అంది సరళ వెంటనే అందుకుంటూ. కాసేపయ్యాక "ఇంట్లో ఇలాంటి వాతావరణం ఉంటే పిల్లల మెదళ్లు ఎలా వికసిస్తాయి? చిన్నప్పటి నుంచి ఇంట్లో పెద్ద వాళ్ల మీద మనమే విషాన్ని నూరిపోస్తుంటే భవిష్యత్తులో వాళ్లు మంచి పిల్లలుగా ఎలా ఎదుగుతారు" అన్నాను దిగులుగా.

నా వైపు చూసి చిన్నగా నవ్వుతూ "ఇన్నేళ్ల నుంచీ ఎన్ని వందల మంది పిల్లల్ని చూసుంటాం! ఏ పిల్లోడిని కదిలించినా ఏదో ఒక సమస్య. కొంత మందికి అమ్మా, నాన్న, అమ్మమ్మా, తాతయ్యే తెలుసు.నాన్న తరపు వాళ్లు తెలిసీ తెలియనట్లుగా ఉంటారు. ఒకవేళ మన పిల్లలు నానమ్మతోనో, తాతయ్యతోనో సన్నిహితంగా ఉంటే మనం భరించలేము. బలవంతంగా వాళ్లను కట్టడి చేస్తాం. 'అతి గారాబం చేసి చెడగొడుతు'న్నారని చెప్పి వాళ్లకు పిల్లల్ని దూరం చేస్తాం. 'కోడళ్ల' నుంచి 'తల్లులు'గా మారిన మనందరికీ ఇవన్నీ తెలిసిన విషయాలేగా. పైగా ఏదో తక్కువైందని, రావలసింది రాలేదనీ చీటికిమాటికీ గొడవలు పడుతూ సరిహద్దుల్లో సైనికుల్లా నిరంతరం అత్తింటి వాళ్లతో యుద్ధం చేస్తూనే ఉంటాం" అంది సరళ. నేనేమీ మాట్లాడ లేదు. నా ఆలోచనల్లో నేనున్నాను. సంభాషణ ఎక్కడ మొదలై ఎక్కడిదాకా వెళ్తుందో తెలియకుండా ఉంది.

నేను మౌనంగా ఉండడం చూసి "నువ్వు ఎన్నన్నా చెప్పవే గీతా! ఆడపిల్లలకు పుట్టిల్లు కావాలి. చిన్నపిల్లలకు అమ్మమ్మ ఇల్లు కావాలి. ఇక నాన్నమ్మ తాతయ్యలు వాళ్లకెందుకు? నీ గుండెల మీద చేయి వేసుకుని చెప్పు... పిల్లలతో నీ పుట్టింటికి ఎన్నిసార్లు వెళ్లుంటావు? నీ పిల్లల్ని తీసుకుని మీ అత్తగారింటికి ఎన్నిసార్లు వెళ్లుంటావు? సెలవులొస్తే అమ్మమ్మ ఇల్లు, పండగొస్తే అమ్మమ్మ ఇల్లు. అసలు నానమ్మ ఇంటికి మన పిల్లల్ని దూరం చేసింది మనమే! మనం ఏ దారిలో నడిస్తే పిల్లలు కూడా అదే దారిలో నడుస్తారు. మనం అడ్డదిడ్డంగా నడుస్తూ పిల్లల్ని గట్టుమీద నడవమంటే ఎలా?"

ఏం మాట్లాడాలో నాకు అర్థం కాలేదు. సరళ వంక విస్తుబోయి చూస్తున్న నన్ను పట్టుకుని ఊపుతూ "దీనికే ఇంత ఆశ్చర్యపోతున్నావు. మొన్నా మధ్య పేపర్లో ఒక వార్త చదివాను. కొడుకులు చూడలేదని ఒకావిడ వృద్ధాశ్రమంలో చేరిందట. కొన్నేళ్లు గడిచాక ఒక స్కూలు నుంచి కొంతమంది అమ్మాయిలు ఆ వృద్ధాశ్రమాన్ని చూడ్డానికి వచ్చారట. పరిచయాల్లో భాగంగా ఒకమ్మాయికి అక్కడున్న ఒక ముసలావిడ తన నాయనమ్మే అని తెలిసిందట. తండ్రిని నిలదీస్తే తన తప్పు తెలుసుకుని తల్లిని ఇంటికి తీసుకెళ్లాడట. ఇందులో ముసలావిడ 'కోడలి' ప్రమేయం లేదని చెప్పగలమా?" అంది అక్కడినుంచి వెళ్లిపోతూ.

చెంపమీద ఛెళ్లున కొట్టినట్లయింది. చాలాసేపు సరళ వెళ్లిన వైపే చూస్తుండిపోయాను. నిజమే.. నేను మా అత్తగారింటికి ఎన్నిసార్లు వెళ్లుంటాను? అన్న ప్రశ్న నాలో సునామీని సృష్టించింది. అక్కడ ఉండలేక

ఇంటికి బయల్దేరాను. కొన్నాళ్ల క్రితం భర్తతో జరిగిన సంభాషణ గుర్తొచ్చింది. ఎప్పటివో జ్ఞాపకాలు నా మనసును తూట్లు పొడుస్తూ నన్ను వెంబడించ సాగాయి.

* * *

"చాపేకాళ్లే గానీ సాగే కాళ్లు కాదు. వయసుతో పాటే చాదస్తం పెరుగుతూ ఉంటుంది. చిన్నవాళ్లం.. మనమే వాళ్లని అర్థం చేసుకుని సర్దుకుపోవాలని చెప్పి ఇన్నాళ్లూ నా నోరు మూయించారు" అంది గీత.

కాసేపు వెంకట్ ఏమీ మాట్లాడలేదు. కాసేపయ్యాక "చూడు గీతా! నాన్న పోయాక ఆ పల్లెలో అమ్మ ఒంటరిగా ఉంటోంది. ఆమెకు వృద్ధాప్యంలో వచ్చే సమస్యలతో పాటు అనారోగ్యంతో మంచం పట్టిన కొడుకు కూడా ఉన్నాడు. ఇంటి మనుషులుగా మనం వాళ్లకి అండగా నిలిచి చేతనైన సాయం చేయాలి కానీ వాళ్ల నుంచి ఏమీ ఆశించకూడదు" అన్నాడు వెంకట్.

'ఇలా చెప్పే ఇన్నాళ్లుగా నెట్టుకొస్తున్నారు. అయినా మనుషులకు వయసొస్తే సరిపోతుందా, జ్ఞానం ఉండొద్దూ! పిల్లల ముందే నోట్లో చుట్ట పెట్టుకుని గుప్పు గుప్పుమని పొగ వదులుతూ ఉంటుంది. దాన్ని చూస్తూ పిల్లలు ఎక్కడ పాడైపోతా రనే భయంతో నేను చచ్చేదాన్ని. మీకేం...కన్నతల్లి కాబట్టి కారం పెట్టినా కమ్మగానే ఉంటుంది" అంది.

"అందుకే నిన్ను ఇంటికి రమ్మని నేనెప్పుడూ బలవంతం చేయలేదుగా! ఏవైనా మంచి చెడులకు నేనొక్కడినే వెళ్లొస్తున్నాను. ఈ మధ్య అది కూడా లేదు. ఎప్పుడు ఊరికి వెళ్లినా 'పిల్లోడు కళ్లలో మెదులుతున్నాడు, తీసుకొచ్చి మొహం చూపించు' అని అమ్మ ఒకటే గొడవ. నాకు ఊహ తెలిసిన దగ్గర్నుంచి మా అమ్మ చుట్ట కాలుస్తోంది. అయినా ఆ అలవాటు నాకు రాలేదు. మానేయమని అమ్మతో నేనెలా చెప్పగలను" అన్నాడు వెంకట్.

'సరే అది వదిలేస్తే... పొలం మీద వచ్చే డబ్బులు, వృద్ధాప్యంలో వచ్చే పెన్షన్ కూడా మీ అమ్మ మీ తమ్ముడికే పెట్టేస్తోంది. పెద్ద కొడుకుని ఒకలా, చిన్నకొడుకుని మరోలా చూడడం మీ అమ్మకే చెల్లింది. పెట్టుపోతలు మనవి, కట్టుడు పళ్ల ఆవిడకన్నట్లుగా తయారైంది పరిస్థితి. అక్కడ్నుంచో ఇక్కడ్నుంచో వచ్చిన డబ్బుల్ని దాచి మనవడికి ఒక ఉంగరమో, గొలుసో చేయించాలనే ఆలోచన కూడా లేదావిడకి" గొంతు పెంచింది గీత.

వెంకట్ ఏమీ మాట్లాడలేదు. "చూడు గీతా! ఇద్దరం ఉద్యోగాలు చేసుకుంటు న్నాం. ఏ లోటూ లేకుండా ఉంటున్నాం. అనారోగ్యం వెంటబడి నప్పుడల్లా అప్పుల కోసం పరిగెట్టడం తప్ప దాచుకు నేంత డబ్బు వాళ్ల దగ్గర ఎక్కడుంది? వాళ్లకేదైనా అవసరం వస్తే ఆదుకుని బంధాలు నిలబెట్టుకోవాలి కానీ ప్రతిదాన్నీ భూతద్దంలో చూసుకుని మన చేతులతో మనమే బంధాల్ని తెంచుకోకూడదు" అన్నాడు వెంకట్.

"అవునవును మరి.. నేనే అందరితోనూ బంధాలను తెంచుకోవాలని చూస్తున్నాను! ఆరుగురు ఆడపిల్లల్లో ఆఖరుదాన్ని. అల్లారుముద్దుగా పెరిగినదాన్ని. ఎవరితో ఎలా ఉండాలో నాకు తెలుసు. మీరేమీ చెప్పక్కర్లేదు"



ఆలోచనలకి విరామం ఇచ్చి ఆటో దిగి ఇంట్లోకి నడవసాగాను. ఇన్నాళ్లూ ఏదో పొందానన్న సంతృప్తి నాలో ఉండేది. కానీ దేన్ని కోల్పోతున్నానో ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. నాలుగు అడుగులు ముందుకేస్తే బంధాలు దగ్గరవుతాయి. అదే వెనక్కి నడిస్తే దగ్గరైన బంధాలు కూడా దూరం అవుతాయి. కత్తిరించడమైనా, కలిపి కుట్టడమైనా మన చేతిలోనే ఉంటుంది. దగ్గర చేసుకోవడమైనా, దూరం చేసుకోవడమైనా మన మాట తీరులోనే ఉంటుంది.

"గీతా! మనుషుల్లో కనిపించే లోపాలనే పట్టుకుని వేలాడుతూ అరచేతిలో ఉన్న ఆనందాన్ని దూరం చేసుకోకూడదు. ఎప్పుడో ఏదో జరిగిందని బతికున్నంత కాలం వాటినే తల్చుకుంటూ, అందుకు కారణమైన వాళ్లని తిట్టుకుంటూ మనం సాధించేదేమిటో నాకు అర్థం కావట్లేదు. మాట పట్టింపులుండొచ్చు గానీ మనుషుల్ని దూరం చేసుకునేంత ఉండకూడదు. నీ తల్లిదీ, నా తల్లిదీ ఒకే వయసు. కానీ కూతురుగా నీ తల్లికి నువ్వు చేసినంత కూడా కొడుకుగా నా తల్లికి నేను చేయలేక పోతున్నాను" అన్నాడు. ఏమీ మాట్లాడకుండావెళ్తున్న గీతవైపుచూస్తూమౌనంగాఉండిపోయాడు వెంకట్.

ఆమెను ఎలా సముదాయించాలో తెలియలేదు. 'నీ పెళ్లాం టెంకాయ చెట్ల మధ్య పెరిగింది కానీ మనుషుల మధ్య పెరగలేదురా. ఆరుగురు ఆడపిల్ల లతో కలిసి పెరిగిన దానికి ప్రేమ ఎక్కువుంతుందను కున్నాను. పక్కవాళ్ల పొడగిట్టని ఒంటరితనం దీనికెలా అబ్బిందో? అత్త కొంపమీద అగ్గిపుల్లేసి పుట్టింట్లో దీపం వెలిగించుకునే దాన్ని దీన్నే చూసా' అన్న తల్లి మాటలు గుర్తొచ్చాయి వెంకట్‌కి.

* * *

ఆలోచనలకి విరామం ఇచ్చి ఆటో దిగి ఇంట్లోకి నడవసాగాను. ఇన్నాళ్లూ ఏదో పొందానన్న సంతృప్తి నాలో ఉండేది. కానీ దేన్ని కోల్పోతున్నానో ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. నాలుగు అడుగులు ముందుకేస్తే బంధాలు దగ్గరవుతాయి. అదే వెనక్కి నడిస్తే దగ్గరైన బంధాలు కూడా దూరం అవుతాయి. కత్తిరించడమైనా, కలిపి కుట్టడమైనా మన చేతిలోనే ఉంటుంది. దగ్గర చేసుకోవడమైనా, దూరం చేసుకోవడమైనా మన మాట తీరులోనే ఉంటుంది.

నా ఎనిమిదేళ్ల కొడుకు చేతన్ "అమ్మా!అమ్మమ్మ లైనులో ఉంది మాట్లాడ తావా? తాతయ్య పొలం గట్టుమీద జారిపడ్డాడంట. అమ్మమ్మ కంగారు పడుతోంది" అన్నాడు.

'తర్వాత మాట్లాడ'తానన్నట్టుగా తల అడ్డంగా ఊపి ఆయన పక్కనున్న కుర్చీలో కూర్చున్నాను. మనుషులకి ఏ లోటూ లేకుండా పెరగడమంత 'లోటు' ఇంకొకటి ఉండదు! అల్లారుముద్దుగా పెరగడమంత 'వైకల్యం' మరొకటి ఉండదు!

ఆయన చేతి మీద చేయి వేస్తూ "మీ అమ్మగారెలా ఉన్నారో ఫోన్ చేసి కనుక్కోండి" అన్నాను.

ఆయన ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే "నాలుగు రోజులు సెలవు పెడతాను. మీ అమ్మగారిని చూసొద్దాం. కేతన్‌ని ఒక్కపూట వదిలితేనే నా ప్రాణం అల్లాడిపోతుంది. ఇన్నాళ్లుగా మిమ్మల్ని చూడకుండా ఉన్నందుకు ఆవిడెంతగా తల్లడిల్లుతుందో. ఎవరిదైనా తల్లి ప్రాణమేగా" అన్నాను.

ఆ మాట అంటున్నప్పుడు నా గుండె నిజంగానే బద్దలయింది. లోలోపల నుంచి అనురాగాల ఊటలేవో పొంగి పొర్లుతున్నాయి. పైకి పెరిగాక చెట్టుకొమ్మలు కలుసుకుంటాయి. మనుషులు మాత్రం ఎదిగేకొద్దీ మేడల్నో, గోడల్నో చూసుకుని ఆత్మీయుల్ని దూరం చేసుకుంటారు.

"అమ్మా... అమ్మమ్మ ఇంటికేనా? నేను కూడా వస్తాను" అన్నాడు కేతన్ నా ఒళ్లో కూర్చుంటూ.

"కాదురా... ఈసారి నాన్నమ్మ ఇంటికెళ్దాం. నిన్ను చూడాలనిపిస్తుందంట" అన్నాను. వాడు వెనక్కి తిరిగి అనుమానంగా, అయోమయంగా చూస్తూ "నిజంగానా" అన్నాడు.

వాడి తల నిమురుతూ "నిజమేరా... అక్కడ మీ నాన్నకు అమ్మ ఉంది. నీకు నాన్నమ్మ ఇల్లుంది. అక్కడికి కాకుండా ఇంకెక్కడికెళ్తాం మనం. ఇకనుంచీ ఎప్పుడు సెలవులిచ్చినా ముందు అక్కడికే వెళ్దాం. నువ్వు ఎన్ని రోజులు ఉండాలనుకుంటే అన్ని రోజులుండొచ్చు" అన్నాను పైకి లేస్తూ.

వాడు ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. నా మాటలు విన్న ఆయన కళ్లు ఆనందంతో తడిసి పోయాయి. నా మనసు తేలికయింది. ★




# హాకీ టైటిల్‌పై భారత్ గురి

**2026 ప్రపంచకప్ హాకీ సమరానికి నెదర్లాండ్స్‌లోని ఆమ్ స్టల్ వీన్ నగరంలో తెరలేచింది. రెండువారాలపాటు 16 అత్యుత్తమ జట్ల నడుమ జరిగే ఈ మహా క్రీడా సమరంలో మాజీ చాంపియన్ భారత్ తన అదృష్టాన్ని పరీక్షించుకొంటోంది. ఐదున్నర దశాబ్దాల ప్రపంచకప్ టైటిల్ కల నెరవేర్చుకోడానికి తహతహలాడుతోంది.**

ఒలింపిక్స్ హాకీ చరిత్రలోనే అత్యధికంగా ఎనిమిది బంగారు పతకాలు గెలుచుకొన్న ఏకైక దేశం భారత్. మేజర్ ధ్యాన్‌చంద్, సుర్జిత్ సింగ్, పర్గత్ సింగ్,గోవింద, మెర్విన్ ఫెర్నాండేజ్, ముకేశ్ కుమార్, ధన్ రాజ్ పిళ్లై, శ్రీజేష్, మన్ ప్రీత్ సింగ్, హర్మన్ ప్రీత్‌సింగ్ లాంటి గొప్పగొప్ప ఆటగాళ్లను అందించిన ఘనత భారత హాకీకి ఉంది.

ఐదు దశాబ్దాల ప్రపంచకప్ హాకీ చరిత్రలో మాత్రం భారత రికార్డు అంతంత మాత్రమే. 1975లో కౌలాలంపూర్‌లో జరిగిన ప్రపంచకప్‌లో మాత్రమే భారత్ విజేతగా నిలువగలిగింది.

### 1971 నుంచే హాకీలో ప్రపంచకప్....

విశ్వవ్యాప్తంగా అత్యంత జనాదరణ పొందుతున్న అతికొద్ది క్రీడల్లో ఫీల్డ్ హాకీ ఒకటి. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ క్రీడ పురుషుల విభాగంలో మొట్టమొదటి ప్రపంచకప్‌ను 1971లో కాని నిర్వహించలేక పోయారు. ప్రారంభ పోటీలో కాంస్య సాధించిన భారత్, ఆ తర్వాత రెండేళ్లకు (1973) నిర్వహించిన పోటీలో రజత పతకంతో రెండో స్థానంలో నిలిచింది. తరువాతి రెండేళ్లకు మూడో ప్రపంచకప్ హాకీ టోర్నీలో విశ్వవిజేతగా నిలువగలిగింది. అజిత్ పాల్ సింగ్ నాయకత్వంలోని జట్టు ప్రపంచకప్‌తో మెరిసి మురిసింది. మూడు పోటీల్లో ఏదో ఒక పతకం గెలుచుకొంటూ వచ్చిన భారత్, 1978 నుంచి 2023 వరకూ జరిగిన 14 ప్రపంచకప్ టోర్నీల్లోనూ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది.

### పతకం ఆశలతో బరిలో భారత్...

51 సంవత్సరాల విరామం తరువాత మరోసారి విశ్వవిజేతగా నిలవాలన్న పట్టుదలతో ప్రపంచ 8వ ర్యాంక్ హోదా కలిగిన జట్టుగా, పెనాల్టీకార్నర్ స్పెషలిస్ట్ హర్మన్ ప్రీత్ సింగ్ నాయకత్వంలో భారత్ బరిలో నిలిచింది. మొత్తం 16 జట్లతో నాలుగు గ్రూపులుగా.. మూడు అంచెలుగా నిర్వహిస్తున్న ఈ పోరులో భారత్ గ్రూప్-డీ లీగ్ లో తలపడనుంది. తొలిదశ గ్రూప్ లీగ్‌లో తలపడిన 16 జట్ల నుంచి కేవలం 8 జట్లకు మాత్రమే నాకౌట్ క్వార్టర్ ఫైనల్స్ చేరే అవకాశం ఉంది. గ్రూప్- డీ లీగ్ లో ఇంగ్లండ్, పాకిస్థాన్, వేల్స్ జట్లతో భారత్ అమీతుమీ తేల్చుకో నుంది. మూడు లీగ్ మ్యాచ్ ల్లో రెండింట గెలిచినా భారత్ నాకౌట్ రౌండ్ చేరుకోగలుగు తుంది.. గ్రూపు-ఏ లీగ్‌లో ఆతిథ్య నెదర్లాండ్స్, అర్జెంటీనా, న్యూజిలాండ్, జపాన్, గ్రూప్-బీలో బెల్జియం, జర్మనీ, ఫ్రాన్స్, మలేసియా, గ్రూప్- సీ లీగ్‌లో ఆస్ట్రేలియా, స్పెయిన్, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా జట్లు ఢీకోనున్నాయి.

### నాలుగుజట్ల అరుదైన రికార్డు...

1971-2023 మధ్యకాలంలో 15 ప్రపంచకప్ టోర్నీల్లో పాల్గొన్న ఘనతను భారత్, జర్మనీ, నెదర్లాండ్స్, స్పెయిన్ జట్లు మాత్రమే దక్కించుకోగలి గాయి. ఇప్పటి వరకూ 25 దేశాల జట్లు మాత్రమే ప్రపంచకప్ బరిలో నిలువగలిగాయి.

1975 ప్రపంచకప్ హాకీ విజేతగా నిలిచిన భారత్ ఆ తర్వాతి టోర్నీలలో దారుణంగా విఫలమవుతూ వచ్చింది. 1978 ప్రపంచకప్‌లో ఆరో స్థానానికి పడిపోయిన భారత్.. 1982లో ఐదు, 1986 ప్రపంచకప్‌లో 12 స్థానాలకే పరిమిత మైంది. 1990 ప్రపంచకప్‌లో 10వ స్థానం సంపాదించి, 1994 ప్రపంచకప్‌లో పుంజుకొని 5వ స్థానానికి ఎకబాక గలిగింది.

1998 ప్రపంచకప్‌లో నాలుగు, 2002 ప్రపంచకప్‌లో 10, 2006 ప్రపంచకప్‌లో 11 స్థానాలు సాధించిన భారత హాకీ... 2010 టోర్నీలో ఎనిమిది, 2014 ప్రపంచకప్ లో 9 స్థానాలలో నిలువగలిగింది. 2018 ప్రపంచకప్‌లో 8వ స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ప్రపంచ హాకీ టోర్నీలకు భారత్ మూడుసార్లు ఆతిథ్యమిచ్చినా క్వార్టర్ ఫైనల్స్ దశ వరకూ మాత్రమే చేరుతూ వచ్చింది.

### పూల్-డీ లీగ్‌లో భారత్ పోటీ...

ప్రస్తుత 15వ ప్రపంచకప్ హాకీ గ్రూప్- డీ లీగ్ లో ఇంగ్లండ్, స్పెయిన్, వేల్స్ జట్లతో భారత్ పోటీపడుతోంది. మరోవైపు..భారత్ విజేతగా నిలిస్తే ఒక్కో ఆటగాడికి రూ. కోటి నజరానా ఇస్తామని ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటిం చారు. 2018లో జరిగిన హాకీ ప్రపంచకప్‌కు తొలిసారిగా ఆతిథ్యమిచ్చిన ఒడిషా వరుసగా రెండోసారి ఈ మెగాటోర్నీ నిర్వహణకు చొరవ చూపడం మరో విశేషం.

ప్రస్తుత చాంపియన్ బెల్జియం, రన్నరప్ నెదర్లాండ్స్‌తో పాటు ఆస్ట్రేలియా హాట్ ఫేవరెట్‌గా పోటీలో నిలిచాయి. మిడ్ ఫీల్డర్ మన్ దీప్ సింగ్ నాయ కత్వంలోని 18 మంది సభ్యుల భారతజట్టు మరోసారి తన అదృష్టం పరీక్షించుకొంటోంది.

ప్రస్తుత ప్రపంచకప్ కోసం రూర్కెలాలో కేవలం 9 మాసాల వ్యవధిలోనే ప్రపంచ ప్రమాణాలతో కూడిన బిర్సా ముండా హాకీ స్టేడియం కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఆటగాళ్లు, అధికారులు, శిక్షకుల కోసం 225 గదులను నిర్మించారు. ప్రపంచకప్‌లో పాల్గొంటున్న మొత్తం 16 జట్ల ఆటగాళ్లు, సిబ్బంది ఈ స్టేడియంలోనే విడిది చేయటం విశేషం.హాకీ ఇండియా చైర్మన్ దిలీప్ టిర్కే ప్రపంచకప్ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.రూర్కెలా వేదికగా 20 మ్యాచ్‌లు, భువనేశ్వర్ కళింగ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా 25 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. జనవరి 27న సెమీఫైనల్స్, 29న కాంస్య పతకంతో పాటు బంగారు పతకం పోటీలు జరుగుతాయి. గత కొద్ది సంవత్సరాలుగా నిలకడగా రాణిస్తున్న భారత్ దశాబ్దాల బంగారు కలను సాకారం చేసుకోవాలని కోరుకొందాం.



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# విశ్వశాంతికి 'గీత' సామూహిక పఠనం




ప్రపంచానికి మార్గదర్శనం చేస్తూ, సార్వత్రిక విలువలను అందించే భగవద్గీతను సంపూర్ణంగా పారాయణంచేయడం ఒక గొప్ప సందర్భం. ప్రపంచ ఐక్యత,శాంతి,సమరసతల కోసం ఆధ్యాత్మిక గురువులు, మానవతావాదుల ఎదుట వేలాదిమంది ముక్తకంఠంతో పఠించడం గొప్పఅనుభూతి. ఆగస్ట్ 2న అమెరికాలోని టెక్సాస్, అల్లెన్‌లో అలాంటి అపురూప దృశ్యం మరోసారి సాక్షాత్కరించింది. ప్రపంచశాంతి, పర్యావరణ శ్రేయస్సు, మానవ సంబంధాల పటిష్టత, సామరస్యంకోసం సామూహికంగా 'గీత' లోని 18 అధ్యాయాలను ఏకకంఠంతో పఠించారు. ఆధ్యాత్మిక గురువు శ్రీగణపతి సచ్చిదానందస్వామి మార్గదర్శ కత్వంలో విద్యార్థులు భగవద్గీతను సంపూర్ణ పఠించడంతో అక్కడ ఆధ్యాత్మిక సౌరభాలు విరజిమ్మాయి. ఈ సందర్భంగా శ్రీగణపతి సచ్చిదానందస్వామి అనుగ్రహభాషణ చేస్తూ, భగవద్గీత మానవాళికి ధైర్యం, జ్ఞానం, కరుణ, నిస్వార్థ సేవ, బాధ్యత,అంతర్గత శాంతిని బోధించే ఒక కాలాతీత పవిత్రగంథమని శ్లాఘిం చారు. ప్రేమ, సేవ,ధర్మం ఆధారంగా ప్రపంచాన్ని నిర్మించడానికి మానవాళికి ప్రేరణఇస్తుందని అన్నారు. భగవద్గీత లోని విలువలు ఒక జాతికో,ఒక ధర్మానికో,ఒక వర్గానికో పరిమితంకాదని, అవి సమస్త మానవాళికి వర్తించేవని చెప్పారు. ప్రతి దేశం సామరస్యంతో, ప్రతి ఇల్లు శాంతితో, ప్రతి హృదయం జ్ఞానంతోనిండి ఉండాలని ఆకాంక్షించారు.

'సర్వేజనాఃసుఖినో భవంతు, లోకాఃసమస్తా సుఖినోభవంతు' (లోకంలో ప్రజలందరూ సుఖంగా ఉండుగాక, సకలలోకాలూ సుఖాన్ని, శాంతిని పొందుగాక) అన్న విశ్వ ప్రార్థనతో కార్యక్రమం ముగిసింది. పదకొండేళ్లకు పైగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ,విభిన్న సంస్కృతులు, నేపథ్యాల నుంచి వచ్చినవారికి గీతాధ్యాయనానికి నిర్వాహకులు అవకాశం కల్పిస్తుస్తు న్నారు.

**పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ గురించి**

ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక గురువుగా,మానవతావాది, హీలర్‌గా, సంగీత కారుడు, స్వరకర్తగా, విద్యావేత్తగా, విశ్వశాంతిని ప్రతిపాదకునిగా పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఎనలేని గౌరవాన్ని అందుకుంటున్న గురువు. ధ్యానం, మ్యూజిక్ థెరపీ, యోగా, వేద జ్ఞానం,పర్యావరణపరిరక్షణ, నిస్వార్థ సేవ ద్వారా వివిధ సంస్కృతుల, మతాల, దేశాల వ్యాప్తంగా గల లక్షలాదిమందిప్రజలు దయ, క్రమశిక్షణ, సమరసతతో జీవించేందుకు ఆయన స్ఫూర్తిని, ప్రేరణను ఇచ్చారు. సనాతనధర్మ శాశ్వత విలువలను, శాంతి,పరస్పర గౌరవం, బాధ్యతాయుతమైన జీవనాన్ని,మానవాళి శ్రేయస్సును పెంపొందించే సార్వత్రిక సూత్రాలుగా ప్రోత్సహించడమే ఆయన అంతర్జాతీయ మిషన్.



**బోయిన్‌పల్లి :** ఆగస్ట్ 2న సికింద్రాబాద్ విభాగ్ బోయిన్‌పల్లినగర్‌లో జరిగిన సద్భావనా సదస్సులో జాగృతిపత్రికను నియమితంగా వితరణ చేస్తున్న ముగ్గురు పోస్ట్‌మెన్‌లను సన్మానం చేస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘచాలక్ దుర్గారెడ్డి, ప్రాంతకార్యకారిణి ప్రత్యేక ఆహ్వానితులు రాంపల్లి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.




**దుండిగల్ :** ఆర్ఎస్ఎస్ శతాబ్ది సందర్భంగా ఆగస్ట్ 4న దుండిగల్ ఐఏఆర్ఈ కాలేజ్ నుంచి గండి మైసమ్మ సర్కిల్ వరకు జరిగిన 2కే రన్‌లో 100మందికి పైగా యువకులు, ఆర్ఎస్ఎస్ పెద్దలు పాల్గొన్నారు. దుండిగల్ పోలీస్ సీఐ రాంబాబు పాల్గొని ప్రసంగిస్తూ యువత చెడుఅలవాట్లకు దూరంగా ఉంటూ డ్రగ్–ఫ్రీ సమాజాన్ని నిర్మించడంలో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు. నశాముక్త్ భారత్–శ్రేష్ఠ భారత్ లక్ష్యంతో సాగిన అవగాహన కార్యక్రమం ఎంతో స్ఫూర్తినిచ్చింది.

# ఆ 'చేతులకు' చేయూతనిస్తే...





సరైన చేయూతనిస్తే.. ఆ మహిళ సమాజానికి దిశానిర్దేశం చేసే పారిశ్రామిక వేత్తగా మారుతుంది. ఆ ఇల్లు ఆర్థికంగా నిలబడుతుంది. ప్రాచీన చేతివృత్తుల నుండి నేటి గృహ పరిశ్రమల వరకు.. ప్రభుత్వ పథకాల నుండి డిజిటల్ ఈ-కామర్స్ వరకు... మహిళలు స్వయంసమృద్ధి సాధించేందుకు నేడు అద్భుతమైన అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. చేతివృత్తులు, గృహ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు భారతీయ ఆర్థికవ్యవస్థకు వెన్నుముక వంటివి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తూ, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడంలో చేతివృత్తులు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయి.

గృహిణులు ఇంటి పనులు పూర్తి చేసుకుని ఖాళీ సమయంలో చేసే చిన్న చేతివృత్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసానిస్తుంది. సబ్సిడీల రూపంలో ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థికచేయూత సొంత వ్యాపారాన్ని ప్రారంభించేందుకు సహకరిస్తుంది. ఇంట్లో తయారుచేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్ మాధ్యమాలు వినియోగించుకొని మహిళ ఆర్థికంగా ఎదిగే అవకాశం నేటి తరుణంలో మెండుగా ఉంది. కేవలం మన సంప్రదాయాన్ని కాపాడే కళలుగా మాత్రమే కాక.. ఈ డిజిటల్ యుగంలో చేతివృత్తులు అత్యంతవేగంగా ఎదుగుతున్న బిజినెస్ మోడల్స్‌గా మారాయి.

మహిళల తక్కువ మూలధనంతోనే ఎక్కువ ఉపాధి అవకాశాలు లభించే చేతివృత్తులను ఎంచుకొని ఇంట్లోనే ఉపాధిని ఏర్పరుచుకోవచ్చు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం పనులు, మట్టి పాత్రలు, బొమ్మలు, చేనేత, అల్లికలు, జ్యూట్ బ్యాగుల తయారీ వంటి కళలు అతి తక్కువ పెట్టుబడితోనే ప్రారంభించ వచ్చు. ఖాళీ సమయంలోనే ఈ పనులు చేస్తూ, కుటుంబానికి అదనపు ఆదాయ వనరుగా మహిళలు మారే అవకాశం ఈ చేతి వృత్తుల్లో ఉంటుంది.

పూర్వకాలంలో చేతివృత్తుల ఉత్పత్తులు స్థానికంగా అయినకాడికి అమ్ముకోవాల్సి వచ్చేది. కానీ నేడు సోషల్ మీడియా వేదికల ద్వారా మహిళలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అమ్మగల్గుతున్నారు. హ్యాండ్‌క్రాఫ్ట్, పండుగ అలంకరణ వస్తువులు, సాంప్రదాయ వస్త్రాలు, చేతివృత్తుల ఉత్పత్తులను విదేశాల్లో ఉన్న భారతీయులకు అందించడం ద్వారా లాభాలు ఆర్జిస్తున్నారు.

మహిళలు స్వయంగా సంపాదించడం వల్ల కుటుంబ ఆర్థికనిర్ణయాల్లో వారి భాగస్వామ్యం పెరుగుతుంది. వారి చేతికి వచ్చే ఆదాయం ప్రధానంగా పిల్లల చదువు, పౌష్టికాహారం, కుటుంబ ఆరోగ్య రక్షణకే ఎక్కువ ఖర్చవుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. డ్వాక్రా వంటి స్వయం సహాయక సంఘాలు, ఇతర మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది ఉమ్మడిగా చేతివృత్తుల యూనిట్లు స్థాపించడం ద్వారా గ్రామీణ మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు. అయితే వీరికి యంత్రాల ద్వారా తయారయ్యే చౌక ఉత్పత్తుల పోటీ తలనొప్పిగా తయారవడమే కాదు, దీనిని తట్టుకోవడం సవాలుగా మారింది. అయితే సాంప్రదాయ కళలకు ఆధునిక డిజైన్లను మేళవించడం, ప్యాకేజింగ్, బ్రాండింగ్‌లో సరైన శిక్షణ పొందడం ద్వారా ఉత్పత్తుల విలువ పెంచుకోగలుగుతున్నారు.

మహిళలు చేతివృత్తులు, కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బ్యాంకులు అనేక సహాయక పథకాలను, రుణ సదుపాయాలను అందిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చిన్న చేతివృత్తులు, అల్లికలు మొదలైన వాటికి రూ.50,000 వరకు, పరికరాల కొనుగోలు, తయారీకి రూ.50,000 నుండి రూ.5 లక్షలవరకు, వ్యాపార విస్తరణకు రూ. 5 లక్షల నుండి రూ.10 లక్షలవరకు, 'ముద్ర రుణాల' పేరున అందిస్తోంది. అలాగే మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం కోసం నూతన వ్యాపారాలు లేదా తయారీ యూనిట్లు ప్రారంభించే మహిళలకు రూ.10 లక్షల నుండి రూ.1 కోటి వరకు స్టాండప్ ఇండియా పేరున బ్యాంకుల ద్వారా రుణం లభిస్తుంది. స్వయం ఉపాధి యూనిట్లు, గృహ పరిశ్రమల స్థాపనకోసం ప్రధాన మంత్రి ఉద్యోగ కల్పన కార్యక్రమం ద్వారా తయారీ రంగానికి రూ.50 లక్షల వరకు, సేవా రంగానికి రూ.20 లక్షల వరకు రుణం అందించడమే కాక గ్రామీణ ప్రాంత మహిళలకు ప్రాజెక్ట్ వ్యయంలో 35%వరకు సబ్సిడీ లభిస్తుంది. కుమ్మరులు, చేనేత, దర్జీలు, బొమ్మల తయారీ మొదలైన సాంప్రదాయ చేతివృత్తుల కళాకారులకు ఒక లక్ష నుండి 3లక్షల రూపాయలవరకు కేవలం ఐదు శాతం వడ్డీకే రుణ సదుపాయంతో పాటు, 15,000 రూపాయలు టూల్‌కిట్ గ్రాంట్, ఉచిత శిక్షణ కూడా అందిస్తుంది. మరోవైపు వెనుకబడిన వర్గాలు, మైనారిటీ మహిళల చేతివృత్తులకు చౌక వడ్డీకి రూ. 1,40,000 వరకు ఆర్థిక సహకారం ఇస్తుంది. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలకు గృహ పరిశ్రమలు, ప్యాకింగ్ యూనిట్లు, టైలరింగ్ కోసం బ్యాంకుల సహాయంతో త్వరితగతిన రూ.50,000 నుండి రూ.2 లక్షలవరకు రుణాలు లభిస్తాయి. సమయానుకూలంగా రుణాలు చెల్లించే మహిళా సంఘాలకు ప్రభుత్వం వడ్డీ సబ్సిడీని నేరుగా ఖాతాల్లో జమ చేస్తుంది.


కొత్తగా ప్రారంభించిన వ్యాపార సంస్థలు (స్టార్టప్‌లు), గృహ పరిశ్రమలకు అవసరమైన పెట్టుబడి లేదా నిధులు అందించడం, మార్కెటింగ్, బ్రాండింగ్‌లో మార్గదర్శకత్వం ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా మహిళా పారిశ్రామిక వేత్తల కోసం ఇంక్యుబేటర్ సెంటర్లను ఏర్పాటు చేసింది. రుణ సదుపాయాలను పొందేందుకు అవసరమైన పత్రాలను, వ్యాపారాన్నిబట్టి అంచనా వ్యయాన్ని సిద్ధం చేసుకొని మహిళలు ఆయా రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

మన సాంప్రదాయ కళలను, ప్రాచీన చేతివృత్తులను సజీవంగా ఉంచుతూ భావితరాలకు అందించడంలో మహిళలే ముఖ్యపాత్ర వహిస్తున్నారు. నైపుణ్యానికి ప్యాకేజింగ్, బ్రాండింగ్, సోషల్ మీడియా ప్రచారాన్ని జోడిస్తే... మహిళల చేతివృత్తులు కేవలం జీవనోపాధిగా మాత్రమే కాక, విజయవంతమైన చిన్నతరహా పరిశ్రమలుగా రూపాంతరం చెందుతాయి. నైపుణ్యం ఉన్న చేతులకు సరైన చేయూత లభిస్తే, స్వయంసమృద్ధి సాధించడమే కాకుండా స్థానిక ఆర్థికవ్యవస్థ కూడా బలోపేతమవుతుంది.



**జయశ్రీ ఆచంట**
సీనియర్ జర్నలిస్ట్

# బాల జాగృతి



## చెరపకురా... చెడేవు! | కథ

ఒక ఊరిలో ఒక వృద్ధ సాధువు ఉండేవాడు. ఆయన ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి భిక్ష తెచ్చుకుని జీవించేవాడు. ఆయన దయాగుణం, మంచిమనసు వల్ల ఊరి ప్రజలు ఆయనను ఎంతో గౌరవించేవారు. సాధువు, భిక్షగా వచ్చిన ఆహారాన్ని పేదవారికి, బిచ్చగాళ్లకు, దారిన వెళ్లే వారికి పంచేవాడు. మిగిలినదే తాను తినేవాడు. కొన్నిసార్లు ఆహారం మొత్తం ఇతరులకు పంచి తాను పస్తు ఉండేవాడు.

అదే ఊరిలో ఒక వృద్ధురాలు ఉండేది. ఆమె చాలా పిసినారి. ఎవరికీ సహాయం చేయదు. ఒకరోజు సాధువు ఆమె ఇంటికి భిక్ష కోసం వెళ్లాడు. వదిలించుకోవాలనే ఉద్దేశంతో ఆమె కొంత ఆహారం పెట్టింది. మరుసటి రోజు పాడైపోయిన అన్నం పెట్టింది. మూడో రోజు సాధువు మళ్లీ రావడంతో, అతని బెడదను శాశ్వతంగా వదిలించుకోవాలని దుర్మార్గపు ఆలోచన చేసింది.

ఆమె వంటగదిలోకి వెళ్లి, అన్నంలో విషం కలిపి సాధువుకు భిక్షగా పెట్టింది. ఏమీ తెలియని సాధువు ఆ అన్నాన్ని తీసుకుని వెళ్లిపోయాడు. సాయంత్రం తన ఆశ్రమానికి చేరుకుని, తిందామని కూర్చున్నాడు. అంతలో ఒక యువకుడు అలసిపోయి, ఆకలితో నడుస్తూ వస్తున్నాడు. అతన్ని చూసి సాధువుకు జాలి కలిగింది.

“బిడ్డా! చాలా అలసిపోయినట్టు ఉన్నావు. రా, కాస్త అన్నం తిని వెళ్లు,” అని పిలిచి తన దగ్గర ఉన్న అన్నం మొత్తం పెట్టాడు. దురదృష్టవశాత్తు ఆ యువకుడు ఆ వృద్ధురాలి కొడుకే. ఆకలితో అతను అన్నం తిని ఇంటికి వెళ్లాడు. ఇంటికి చేరగానే తల తిరిగి, నురగలు కక్కుతూ తల్లి ఒడిలో పడిపోయాడు.

వృద్ధురాలు భయంతో ఏడవసాగింది. విషయం తెలిసి అక్కడికి వచ్చిన సాధువు తనకు తెలిసిన ఔషధ విద్యతో యువకుడిని కాపాడాడు. అప్పుడు వృద్ధురాలు తన తప్పు తెలుసుకుని సాధువు కాళ్లపై పడి క్షమాపణ కోరింది.

‘ఇతరులకు చెడు చేయాలనుకుంటే, ఆ చెడు చివరికి మనకే తిరిగి వస్తుంది’ అని సాధువు హితవు పలికాడు.

ఆ రోజు నుంచి వృద్ధురాలు మారిపోయి మంచితనంతో జీవించింది. ★

## మంచిమాట

వంద మాటలు చెప్పేకంటే ఒక్క మంచి పని చేసి చూపడం మేలు

## మెదడుకు మేత

పచ్చని చెట్టులో పగడపు చిలక.. ఏమిటది?

జవాబు : చిక్కుడు కాయ

## పద్యం

చీకటింట బుట్టి చీకటి బెరిగిన
చీకటి మరుగుననె చిక్కనేల
చీకటి దెలిసిన సృష్టి కాన్పింపదా
విశ్వదాభిరామ వినురవేమ

**భావం :** మానవుడు మాయలో పుట్టి మాయలో పెరిగి మాయలోనే జీవిస్తున్నాడు. ఆ మాయా పొరలను విడిచిపెట్టినప్పుడే ఈ సృష్టి రహస్యం తెలుస్తుందని భావం.

## శ్లోకం

దుర్జనః ప్రియవాదీచ నైతద్విశ్వాస కారణమ్
మధు తిష్ఠతి జిహ్వాగ్రే హృది హాలాహలం విషమ్

**భావం :** దుర్జనుడు ప్రియంగా మాట్లాడినంత మాత్రాన అతని మాటలను విశ్వసించరాదు. ఎందుకుంటే... వాడు నాలుకపై తేనె పూసుకొని ఉంటాడు. మనసునిండా ద్వేషమనే విషం నింపుకొని ఉంటాడు.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| ఏనుగు | మూపురం |
| జిరాఫీ | తొండం |
| ఒంటె | అందమైన ఈకలు |
| నెమలి | పొడవాటి చెవులు |
| కుందేలు | పొడవాటి మెడ |

సమాధానాలు : ఏనుగు–తొండం; జిరాఫీ–పొడవాటి మెడ; ఒంటె–మూపురం; నెమలి–అందమైన ఈకలు; కుందేలు–పొడవాటి చెవులు.

## శాస్త్రవేత్తలు

# గుగ్లిఎల్మో జియోవన్ని మారియా మార్కోనీ

(ఏప్రిల్ 25, 1874 – జూలై 20, 1937)

ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త. వైర్‌లెస్ కమ్యూనికేషన్ అభివృద్ధిలో ఆయన చేసిన కృషి ప్రపంచ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. రేడియో తరంగాల ద్వారా తీగలు లేకుండానే సందేశాలను పంపే వైర్‌లెస్ టెలిగ్రఫీ వ్యవస్థను విజయవంతంగా అభివృద్ధి చేశాడు. 1901లో అట్లాంటిక్ మహాసముద్రాన్ని దాటి తొలి వైర్‌లెస్ సంకేతాన్ని విజయవంతంగా ప్రసారం చేశాడు. ఈ ఘనతతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. వైర్‌లెస్ టెలిగ్రఫీ అభివృద్ధికి చేసిన విశేష కృషికి గాను 1909లో జర్మనీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త కార్ల్ ఫెర్డినాండ్ బ్రౌన్‌తో కలిసి భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. ఆధునిక రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థలకు మార్కోనీ పరిశోధనలు బలమైన పునాది వేశాయి.



## జనరల్ నాలెడ్జ్

1. ఇండియన్ మిలిటరీ అకాడమీ ఎక్కడుంది?
2. వేలిముద్రల అధ్యయన శాస్త్రాన్ని ఏమంటారు?
3. 'రాణ్ ఆఫ్ కచ్' ప్రదేశం ఏ రాష్ట్రంలో ఉంది?

సమాధానాలు : 1. డెహ్రాడూన్; 2. డాక్టిలోగ్రఫీ; 3. గుజరాత్.

## భక్తాగ్రేసరులు

# తుమరాడ సంగమేశ్వరశాస్త్రి




తుమరాడ సంగమేశ్వరశాస్త్రి పిఠాపురం మహారాజ ఆస్థానంలో వైణిక విద్వాంసులు. రవీంద్రనాథ్ టాగూర్ సహా పలువురు ప్రముఖులు ఆయన వీణావాదాన్ని ఆస్వాదించారు. ఒక రాగాన్ని ఆపకుండా వెయ్యిసార్లు వాయించడం (వేయిసాధకం) ఆయన ప్రత్యేకతగా చెబుతారు. ఆయనకు ఎన్నో సత్కారాలు జరిగి, బిరుదులు వచ్చినా ఆ బహుమతులను, కంకణాలను, గండపెండేరాన్ని ధరించేవారు కాదట. వాటిని ఎందుకు ధరించరని ప్రశ్నించేవారికి 'అవన్నీ అమ్మ దయవల్ల వచ్చినవి. తిరుపతి వెంకన్న మొక్కుబడి సొమ్ములు. వాటిని నేను వాడుకోవచ్చునా?' అని మృదువుగా సమాధానమిచ్చేవారట. వీణా వాదనం ప్రాణం. పైగా తమకు అంతిమఘడియలు సమీపిస్తున్నట్లు ఊహించి... వీణను గుండెలమీద పెట్టుకొని 'ఆనందభైరవి' రాగాన్ని మీటుతూనే తుదిశ్వాస విడిచారు.




# వారఫలాలు

17-23 ఆగస్ట్ 2026



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

కొన్ని కాంట్రాక్టులు ఎట్టకేలకు దక్కించుకుంటారు. వాహనాలు, స్థిరాస్తి కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. బంధువులతో సత్సంబంధాలు నెలకొంటాయి. వ్యాపారులకు అంచనాలు నిజం కాగలవు. ఉద్యోగులకు మార్పులు ఉత్సాహాన్నిస్తాయి. రాజకీయవేత్తల కృషి ఫలిస్తుంది. రచయితలు, క్రీడాకారులకు మరింత అనుకూలమైన కాలం. 20,21తేదీలలో కుటుంబంలో సమస్యలు. వృథా ఖర్చులు. శ్రీకృష్ణాష్టకం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

సన్నిహితులతో వివాదాలు సర్దుబాటు కాగలవు. నిరుద్యోగులు ఉద్యోగావకాశాలు సాధిస్తారు. వ్యాపారులు మరింత లాభాలు ఆర్జిస్తారు. నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు ప్రోత్సాహకరంగాఉంటుంది. రాజకీయవేత్తలకు కొన్ని పదవులు దక్కే అవకాశాలు. కళాకారులు, క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తుంది. 17,18 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. స్నేహితులతో తగాదాలు.. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఒక సంఘటన ఆకట్టుకుంటుంది. స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. సమాజసేవలో పాల్గొంటారు. వ్యాపారులకు భాగస్వాముల నుంచి ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగులకు కొత్త పోస్టులు దక్కుతాయి. కళాకారులకు నూతనోత్సాహం. క్రీడాకారులకు పురస్కారాలు. 19,20 తేదీల్లో వృథా ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. ఆకస్మిక ప్రయాణాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆలయాలు సందర్శిస్తారు. కుటుంబసమస్యలు కొన్ని పరిష్కరించుకుంటారు. వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు భాగస్వాములతో తగాదాలు పరిష్కారం. ఉద్యోగులకు ఉన్నత హోదాలు దక్కుతాయి. రాజకీయవేత్తలకు సంతోషకరమైన సమాచారం. క్రీడాకారులు, పరిశోధకులకు యత్న కార్యసిద్ధి. 21,22 తేదీలలో వృథా ఖర్చులు. స్వల్ప అనారోగ్యం. దూరప్రయాణాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

గృహం, వాహనాలు కొనుగోలు ప్రయత్నాలు ముందుకు సాగవు. శారీరక రుగ్మతలు వ్యాపారులు పెట్టుబడుల్లో నిదానం పాటించాలి. ఉద్యోగులకు కొత్త సమస్యలు ఎదురుకావచ్చు. రాజకీయవేత్తలకు ఒత్తిడులు పెరుగుతాయి. రచయితలు, పరిశోధకులకు శుభవార్తలు. 20,21 తేదీలలో ఆకస్మిక ధనలాభం. వాహనసౌఖ్యం. అంగారక స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. దైవ కార్యాలలో పాల్గొంటారు. వ్యాపారులకు వివాదాలు సర్దుబాటు కాగలవు. ఉద్యోగులకు మరింత అనుకూల సమయం. రాజకీయ వేత్తలకు పదవులు దక్కుతాయి. రచయితలు, క్రీడాకారులకు సంతోషకరమైన సమాచారం అందుతుంది. 22,23 తేదీల్లో కుటుంబ సభ్యులతో తగాదాలు. స్వల్ప అనారోగ్య సూచనలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి..

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

వాహనాలు, భూములు కొనుగోలు చేస్తారు. విద్యార్థులు నూతన విద్యావకాశాలు సాధిస్తారు. వ్యాపారులు పెట్టుబడులు సమీకరించి ముందుకు సాగుతారు. ఉద్యోగులకు సంతోషకరమైన సమాచారం. పారిశ్రామికవేత్తలకు మరింత అనుకూల సమయం. రచయితలు, క్రీడాకారులకు కార్యసిద్ధి. 18,19 తేదీల్లో శారీరక రుగ్మతలు. కుటుంబంలో చికాకులు. ఆంజనేయ దండకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ప్రముఖులతో పరిచయాలు ఆశ్చర్యపరుస్తాయి. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారులు సత్తా చాటుకుని లాభాలు గడిస్తారు. ఉద్యోగులు వ్యయప్రయాసలు తగ్గి కుదుటపడతారు. రాజకీయవేత్తలకు మంచి గుర్తింపు లభిస్తుంది. క్రీడాకారులు,పరి శోధకులకు పురస్కారాలు. 22,23 తేదీల్లో అనారోగ్యం. బంధువులతో విభేదాలు. శివాష్టకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కొన్ని వివాదాల పరిష్కారదశకు చేరతాయి. ఇంటి నిర్మాణయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు పోస్టుల్లో మార్పులు ఉంటాయి. పారిశ్రామికవేత్తలకు చిక్కులు తొలగుతాయి. కళాకారులు, రచయితలు ప్రగతిపథంలో సాగుతారు. 20,21తేదీల్లో స్వల్ప శారీరక రుగ్మతలు. మానసిక ఆందోళన. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

విద్యార్థుల శ్రమ కొలిక్కి వస్తుంది. నిరుద్యోగులకు ఉద్యోగప్రాప్తి. కాంట్రాక్టులు దక్కుతాయి. వ్యాపారులకు ఆశించిన లాభాలు అందుతాయి. ఉద్యోగులకు విధుల్లో ఆటంకాలు అధిగమిస్తారు. కళాకారులకు అవకాశాలు పెరుగుతాయి. రచ యితలు, క్రీడాకారులు ప్రతిభను చాటుకుంటారు. 18,19 తేదీల్లో కొత్తగా అప్పులు చేస్తారు. శారీరక రుగ్మతలు. ఆకస్మికప్రయాణాలు. దుర్గాదేవిస్తోత్రాలు పఠించండి..

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఇంటి నిర్మాణ యత్నాలు ఫలిస్తాయి. వ్యాపారులు కొత్త సంస్థల ఏర్పాటులో ముందడుగు వేస్తారు. ఉద్యోగులు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తిస్తారు. పారిశ్రామికవేత్తలకు సంతోషకరమైన సమాచారం. పరిశోధకులు, క్రీడాకారులు కొంత ప్రగతి సాధిస్తారు. 19,20 తేదీల్లో అనుకోని ఖర్చులు. కుటుంబంలో చికాకులు. హనుమాన్‌చాలీసా పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

బంధువులతో వివాదాలు కొలిక్కి వస్తాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. పలుకుబడి, గౌరవం పెరుగుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ఉన్నతపోస్టులు రావచ్చు. రాజకీయవేత్తల యత్నాలు సఫలం. కళాకారులు, రచయితలకు నూతన అవకాశాలు దక్కవచ్చు. 20,21తేదీల్లో కుటుంబంలో ఒత్తిడులు. శారీరక రుగ్మతలు. అన్నపూర్ణాష్టకం పఠించండి.

# పదరసం-577

## ఆధారాలు

**అడ్డం**

1. మహత్తు (3)
3. దంపతులు, ఒక రాశి (3)
5. పాపులు ఈ పురికి చేరతారట (2)
6. కుంభం (6)
7. పత్రం, ఆకు (3)
8. గాంధారి అత్తగారు (3)
10. చేవ్రాలు...తడబడింది (3)
12. వ్రతం, పూజ (2)
13. ఒకటి అడ్డంలో భూమి (2)
14. ఈ మహర్షి అనసూయ పతి (2)
15. ముక్క, ఖండం (3)
17. రాయి, పాషాణం (2)
19. నావ లాంటిదే (3)
20. కాపలా, రక్షణ (3)
22. విగ్రహం, బొమ్మ (3)
23. ఆలయ శిఖరం (3)
24. రక్తం పీల్చే ప్రాణి (3)
25. రాచబాట (4)
27. దూషణ, నింద (2)
29. వెళ్లడం (2)
30. పొగడ్త, నుతి..అటు నుంచి (2)
31. పాదం కింది భాగం (4)

**నిలువు**

2. ఘటోత్కజుడి తల్లి (3)
3. శలభం (3)
4. మహావిష్ణువు ఖడ్గం (3)
5. చార్‌ధామ్‌లో ఒకటి (5)
8. శరపాన్పు (4)
9. తామర (3)
11. వారాంతపు అంగడి (2)
14. కుబేరుడి రాజధాని (5)
16. పశ్చిమ దిశ (4)
18. జాతీయ మృగం (2)
19. భర్త (2)
21. శాపం కాదు (2)
22. అభ్యున్నతి (3)
23. తెలుగు రాష్ట్రాల్లో పెద్ద నది (4)
24. ఇంద్రుడి కూతురు (3)
26. కుప్ప, రాశి (2)
28. రహస్యం..తలకిందులుగా (2)
29. పరిపాలించు (2)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | ■ | 3 | | 4 | ■ | 5 | |
| ■ | | ■ | 6 | | ■ | 7 | | | ■ |
| 8 | | 9 | ■ | 10 | 11 | | ■ | 12 | |
| | ■ | 13 | | ■ | | ■ | 14 | | ■ |
| 15 | | | ■ | 16 | ■ | 17 | | ■ | 18 |
| | ■ | ■ | 19 | | | ■ | 20 | 21 | |
| ■ | ■ | 22 | | | ■ | 23 | | | ■ |
| 24 | | | ■ | 25 | | | | ■ | 26 |
| | ■ | 27 | 28 | ■ | ■ | | ■ | 29 | |
| 30 | | ■ | | ■ | 31 | | | | ■ |

## పదరసం - 576 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఉ | డు | 2 త | ■ | 3 కుం | 4 చె | ■ | 5 కొ | ర | 6 త |
| ప | ■ | 7 డి | క్రి | ■ | 8 రు | ద్ర | మ | ■ | మ్ము |
| 9 మ | ఘ | ■ | ■ | 10 పా | వు | ■ | 11 రు | 12 ధ్రు | డు |
| ■ | ■ | 13 కా | మం | దు | లు | ■ | ■ | ప | ■ |
| 14 ర | 15 వ | ళి | ■ | క | ■ | ■ | 16 చ | దు | 17 వు |
| 18 జ | డ | ■ | 19 ఎ | లు | 20 క | లు | ■ | 21 డు | గో |
| తం | ■ | 22 కీ | లు | ■ | లా | ■ | 23 చ | ■ | లు |
| ■ | 24 అ | ■ | గు | ■ | 25 ప | రా | క్ర | 26 మం | ■ |
| 27 అ | ర | కు | ■ | 28 సా | ము | ■ | 29 వ | ది | 30 న |
| 31 ప్ప | క | ■ | 32 ది | వి | ■ | 33 మూ | ర్తి | ■ | టి |

సినిమా

తెలుగులో హారర్ కామెడీ చిత్రాలకు కొదవలేదు. లాజిక్కుల జోలికి పోకుండా దర్శకులు తమకు తోచిన విధంగా సినిమాలు తీయడానికి ఈ జానర్ బాగా ఉపయోగపడుతుంది. అలానే కొందరు హీరోలకు ఈ జానర్ అచ్చిరావడంతో, కొన్నేళ్లుగా విజయానికి దూరంగా ఉన్న వరుణ్ తేజ్ సైతం ఈ హారర్ కామెడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యువీ క్రియేషన్స్ పతాకంపై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి దీనిని నిర్మించారు. ఇటీవల వచ్చిన 'మిరాయ్'తో చక్కని విజయాన్ని అందుకున్న రితికా నాయక్ ఇందులో హీరోయిన్‌గా నటించింది.



# కొరుకుడు పడని KOREAN KANAKARAJU

ఈ సినిమా అనంతపురం జిల్లా పెనుగొండలో జరిగే కథ. చెక్కభజన బృందానికి నాయకత్వం వహించే కనకరాజు (వరుణ్ తేజ్)కు కోపం ముక్కుమీదే ఉంటుంది. తన ముందు ఎవరికి అన్యాయం జరిగినా సహించలేడు. ఎదుటివ్యక్తి ఎంత పెద్దవాడైనా వాడికి గుణపాఠం చెబుతాడు. అలా తరచూ గొడవల్లో ఇరుక్కుంటూ ఉంటాడు. అతని స్నేహితుడైన కిష్టప్ప (సత్య) ఎలానో గట్టెక్కిస్తూ ఉంటాడు. కనకరాజు అన్నయ్య పృథ్వీరాజ్ (అవసరాల శ్రీనివాస్) తండ్రి (చిన్నా)తో పది లక్షలు అప్పు చేయించి, సింగపూర్‌లో బిజినెస్ చేయడానికి వెళ్లి పత్తా ఉండడు. అన్నయ్య అక్కడ కష్టాల్లో ఉన్నాడని తెలిసి కనకరాజు చెక్కభజన ద్వారా తాను సంపాదించిందంతా అతనికే పంపిస్తుంటాడు. తీసుకున్న రుణానికి వడ్డీ కట్టలేదని రాజకీయ నాయకుడు చెంగారెడ్డి (సునీల్) మనుషులు కనకరాజు కుటుంబాన్ని చులకన చేస్తుంటారు. ఇదే సమయంలో అతని ఊరికే చెందిన చైత్ర (రుతిక నాయక్) అతనికి పరిచయం అవుతుంది. కియా కంపెనీలో పనిచేసే చైత్ర కొరియాకు వెళ్లి, అక్కడే ఓ మంచి అందమైన కుర్రాడిని పెళ్లి చేసుకోవాలనుకుంటుంది. ఆమెకు తన ప్రేమను ఎలా చెప్పాలో తెలియక కనకరాజు సతమతమౌతుండగా, ఓ రోజు బార్‌లోని పాత్రలో ఉన్న బూడిదలో మందు కలుపుకుని పొరపాటున తాగేస్తాడు. దాంతో అందులోని కొరియన్ ఆత్మ కనకరాజును ఆవహిస్తుంది. ఆ క్షణం నుంచి అతనికి కొరియన్ భాషతో పాటు విపరీతమైన బలమూ వస్తుంది. తనను చంపడానికి వచ్చిన కర్రి శ్రీను (టెంపర్ వంశీ)ని చంపేయడమే కాకుండా అతని మేనమామ చెంగారెడ్డిని చితకొట్టేస్తాడు. అతనికి పట్టిన ఆ కొరియన్ దెయ్యాన్ని ఎలా వదిలించారు? కొరియా వెళ్లాలనుకున్న చైత్ర కనకరాజుతో కలిసి అక్కడికి వెళ్లినప్పుడు ఏం జరిగింది? సింగపూర్ వెళ్లిన కనకరాజు అన్నయ్య కొరియాకు ఎందుకొచ్చాడు? అసలు కనకరాజును పట్టుకున్న ఆ కొరియా దెయ్యం ఎవరిది? అనేది మిగతా సినిమా.


మనుషులను ఆత్మలు ఆవహించడం, వారు విచిత్రంగా ప్రవర్తించడం, దాంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు భయానికి లోనుకావడం చాలా సినిమాల్లో చూసిందే. అలానే మనిషిని ఆవహించిన ఆత్మ అతని ద్వారా పగ తీర్చుకునే కథలూ చూశాం. కానీ కొరియా నుంచి ఓ ఆత్మ ఇండియాకు రావడం, ఇక్కడ పెనుగొండలోని ఓ వ్యక్తిని ఆవహించడం, ఆ తర్వాత కథ కొరియాకు వెళ్లడం మాత్రం కొత్తగా ఉంది. పైగా ఈ మధ్య తెలుగు వారికి కొరియా మేనియా బాగా పట్టుకుంది. అక్కడి సినిమాలు, వెబ్ సీరిస్ విపరీతంగా చూస్తున్నారు. వాళ్లంతా ఈ సినిమాతో కనెక్ట్ అయ్యే ఆస్కారం ఉంది. ఈ సినిమాలో హీరో చెప్పే సంభాషణల్లో సగం కొరియాలోనే ఉంటాయి. సో... మూడు గంటల్లో కొరియన్ భాష నేర్చుకుని వెళితే సినిమా మరింతగా అర్థమయ్యే ఆస్కారం ఉంది. ప్రథమార్ధంలో కథ సరదాగానే సాగిపోయింది. కానీ కొరియాకు హీరోహీరోయిన్లను తీసుకెళ్లిన తర్వాత దర్శకుడు చేతి నుంచి పగ్గాలు జారిపోయాయనిపిస్తుంది. హీరోని ఆవహించింది బిజినెస్ మ్యాన్ ఆత్మ కాదని, ఓ గ్యాంగ్ స్టర్‌దని తెలిసిన తర్వాత కథలో పట్టు సడలిపోయింది. కాసేపు కనకరాజుగా, మరికాసేపు ఫోర్ ఫింగర్స్ డాన్స్‌గా అతను చేసే చేష్టలు చికాకు తెప్పిస్తాయి.

ఇక హీరోలోకి ఆత్మ ప్రవేశించకుండా హీరోయిన్ ప్లే చేసే ట్రిక్ కూడా చీప్‌గా ఉంది. కనకరాజు అన్నయ్య సింగపూర్ నుంచి కొరియాకు వచ్చిన కథంతా అతుకుల బొంతలా ఉంది. ద్వితీయార్ధంలో వీటీవీ గణేశ్, మాస్టర్ రేవంత్‌పై చిత్రీకరించిన కామెడీ ట్రాక్ కూడా ఏ మాత్రం పండలేదు. దీనికి తోడు చివరిలో రెండు ఆత్మల మధ్య పెట్టిన ఫైటింగ్ సీన్ కామెడీగా ఉంది. అంతేకాకుండా మొదటి నుంచి కిష్టప్ప తండ్రి అయిన తాంత్రికుడి పాత్రను కామెడీగా చూపించడంతో క్లయిమాక్స్‌లో సీరియస్‌నెస్ లోపించింది. నిజానికి ఇలాంటి హారర్ కామెడీస్ చూసేప్పుడు లాజిక్కుల జోలికి పోకూడదు. అప్పుడే ఎంతోకొంత ఎంజాయ్ చేయగలం. డైలాగ్స్ అక్కడక్కడ బాగా పేలాయి.

నటీనటుల విషయానికి వస్తే వరుణ్ తేజ్ చాలా ఈజీగా కనకరాజు పాత్రను పోషించాడు. ఆత్మ ఆవహించిన తర్వాత నటన కాస్తంత శ్రమతో కూడుకున్నదే అయినా... బాగానే కష్టపడ్డాడు. కథలో కీలకమైన రితికా నాయక్ పాత్రకు సెకండ్ హాఫ్‌లో ప్రాధాన్యం లేకుండా పోయింది. అయినా వరుణ్ తేజ్ పక్కన ఫర్వాలేదనిపించింది. ఈ సినిమాను నిలబెట్టింది మాత్రం సత్యనే! తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రతి సన్నివేశాన్ని మరో లెవల్‌కు తీసుకెళ్లాడు. ఇతర ప్రధాన పాత్రలను మురళీధర్ గౌడ్, అవసరాల శ్రీనివాస్, సునీల్, టెంపర్ వంశీ, చిన్నా, తులసి, వీటీవీ గణేశ్, రంగస్థలం మహేశ్, మిర్చి కిరణ్, మాస్టర్ రేవంత్ తదితరులు పోషించారు. దీక్షా నగార్కర్‌పై చిత్రీకరించిన స్పెషల్ సాంగ్‌ను హీరో ఇంట్రడక్షన్ సాంగ్ తరహాలో వాడేశారు. పాట కలర్‌ఫుల్‌గా ఉన్నా ఏమంత ఆకట్టుకోలేదు. తమన్ స్వరపర్చిన పాటలు, నేపథ్య సంగీతం పెద్దంతగా లేవు. ఆర్.ఆర్. అయితే 'ఓజీ' ట్రాక్ ను ఉపయోగించేసినట్టుగా అనిపించింది. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ బాగుంది. నిర్మాణ విలువలకు వంక పెట్టలేం. హారర్ కామెడీ మూవీస్ చూసే వాళ్లకు ఇది నచ్చుతుంది తప్పితే మిగిలిన వారిని ఆకట్టుకోవడం కష్టమే.

– **అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.150/-





వెల : ₹.60/-




వెల : ₹.270/-





వెల : ₹.80/-





వెల : ₹.54/-




వెల : ₹.120




వెల : ₹.80





వెల : ₹.250/-





వెల : ₹.180/-




వెల : ₹.200/-





వెల:₹.999/- సెట్





వెల:₹.450/-




వెల :₹.200/-




వెల : ₹.900/-




వెల : ₹.350/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠీ, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 44

*With best compliments from:*

**Estd : 1994-95**

# G.PULLA REDDY COLLEGE OF PHARMACY

**Affiliated to Osmania University, Hyderabad**
**Approved by PCI & Accredited by NAAC,**
**G.Pulla Reddy Educational Campus, Mehdipatnam, Hyderabad-500 028.**
**Phone : +91 8297511177**
**Email: gprcphyd@gmail.com I website : gprcp.ac.in**

**EAMCET Code : GPRP** **PGECET Code : GPRP1**



## COURSES OFFERED

**B.Pharm**

**M.Pharm**

1. M.Pharm (Pharma. Chemistry)
2. M.Pharm (Pharmaceutics)
3. M.Pharm (Pharmacology)
4. M.Pharm (Pharma. Analysis)
5. M.Pharm (Pharma. Regulatory Affairs)

**Pharm D**

Founder Chairman
**Late G. Pulla Reddy**

Chairman
**Sri P. Subba Reddy**

Managing Trustee
**Sri G. Raghava Reddy**